ఉమ్మడి జిల్లాలో మంత్రులైన గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయ స్వామికి బాధ్యతలను సీఎం చంద్రబాబు మరింత పెంచారు. వారి సమర్థత, నిబద్ధతలపై నమ్మకం ఉంచి కీలక మంత్రిత్వ శాఖలను కేటాయించారు. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ గొట్టిపాటికి విద్యుత్ శాఖను కేటాయించారు. అంచనాలకు అనుగుణంగా స్వామికి సంక్షేమశాఖ కేటాయించటమే కాక అదనంగా గ్రామ సచివాలయ వ్యవస్థ నిర్వహణ బాధ్యతను అప్పగించారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలోనూ వారికి కేటాయించిన శాఖల ప్రాధాన్యత చాలా పెద్దది. అందుకే కాబోలు తమకు కేటాయించిన శాఖల పట్ల ఇద్దరు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం సీఎం చంద్రబాబును వారు కలవగా.. మీపై నమ్మకంతో మంచి శాఖలు ఇచ్చాం.. సమర్థత నిరూపించుకోవాలని సూచించారు.

ఇద్దరు మంత్రులకు ముఖ్య శాఖల కేటాయింపు

వాటి పనితీరు కత్తి మీద సామే

అటు సంక్షేమాన్ని ఇటు సచివాలయ వ్యవస్థ స్వామికి కీలకం

వ్యవసాయ, పారిశ్రామిక రంగాల విద్యుత్ సమస్యలు రవికి సవాలే

సమర్థతను నిరూపించుకుంటాం.. గొట్టిపాటి, డోలా

నిబద్ధతతో పనిచేస్తాం

శాఖల కేటాయింపు అనంతరం రవికుమార్, స్వామిలు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తమపై నమ్మకంతో కీలక శాఖలను కేటాయించారని తెలిపారు. తమకు కేటాయించిన శాఖల విషయంలో చాలా సంతృప్తికరంగా ఉన్నామని, అందుకే వెంటనే ముఖ్యమంత్రిని కలిసి తమ ఆనందం తెలిపామన్నారు. ప్రజలు, పార్టీ, ప్రజా సమస్యల పట్ల ఎంత నిబద్ధతతో పనిచేస్తామో ఇప్పటికే నిరూపించుకొని వరుస విజయాలు సాధిస్తున్నామని వివరించారు. అంతకన్నా ఎక్కువగా పనిచేసి చంద్రబాబు నమ్మకాన్ని నిలబెడుతూ రాష్ట్ర ప్రజల మద్దతు పొందుతామని ధీమాగా చెప్పారు.



సీఎం చంద్రబాబుతో మంత్రులు నారాయణ, స్వామి, సత్యప్రసాద్, రవికుమార్, రామానాయుడు, సవిత

పెరిగిన బాధ్యత

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కొత్తగా చంద్రబాబునాయుడు సారథ్యంలో ఏర్పడిన మంత్రివర్గంలో జిల్లా నుంచి మంత్రులుగా నియమితులైన గొట్టిపాటి రవికుమార్‌కు విద్యుత్ శాఖను, బాలవీరాంజనేయస్వామికి సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సంక్షేమం, సచివాలయం, గ్రామ వలంటీర్ల వ్యవస్థల నిర్వహణ శాఖలను కేటాయించారు. ప్రజలతో నిత్యం సంబంధం ఉండే కీలక శాఖలను వీరిద్దరికీ కేటాయించటంపై జిల్లాలో విస్తృత చర్చ జరుగుతోంది. తమకు కేటాయించిన శాఖలపై ఇద్దరు మంత్రులు సంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే సమర్థవంతంగా ఆ శాఖల నిర్వహణ ద్వారా ముందుకు సాగటం కత్తిమీద సాములాంటిదని ప్రజాభిప్రాయం. శుక్రవారం సాయంత్రం ఇద్దరు మంత్రులు రవి, స్వామిలు సచివాలయంలో చంద్రబాబును కలవగా మీరు కష్టపడతారనే నమ్మకంతోనే మంచి శాఖలు ఇచ్చానన్నారు. ఆ శాఖలపై పూర్తిస్థాయిలో స్టడీ చేయండి, కిందిస్థాయిలో పరిస్థితులను గమనించండి, తరువాత ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా పనులు చేయండి అని స్పష్టంగా సూచించినట్లు తెలిసింది.

సంక్షేమంలో కీలకం

సంక్షేమ కార్యక్రమాలు, సచివాలయ వ్యవస్థలో మార్పులు మంత్రి స్వామికి కీలకంగా మారబోతున్నాయి. గతంలో జగన్ బటన్ నొక్కుడు కార్యక్రమం పేరుతో దళితులకు అమలు చేయాల్సిన 27 సంక్షేమ కార్యక్రమాలను ఆ ప్రభుత్వం అమలు చేయలేదని వాటిని పునరుద్ధరిస్తామని తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించింది. అలాగే వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్ల పంపిణీకి ఉన్న ప్రాధాన్యత తెలిసిందే. మరోవైపు జగన్ ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల నియామకాలపై సంపూర్తిగా స్టడీ చేసి సవివరమైన మార్పులు చేయాల్సిన అవసరం ఈ ప్రభుత్వంపై ఉంది. అందులో కీలక భూమిక మంత్రిగా స్వామి పోషించాల్సి ఉంది. పైగా వలంటీర్ల గౌరవ వేతనాన్ని రూ.10వేలకు పెంచుతామని టీడీపీ ఎన్నికల హామీ ఇచ్చి ఉంది. గతంలో వైసీపీ నాయకులు వలంటీర్లతో రాజీనామాలు చేయించారు. అందులో ఎన్ని ఆమోదించారో అధికారికంగా వెల్లడించలేని పరిస్థితి. వలంటీర్ల పునఃనియామకాలు రాజకీయంగా కత్తి మీద సాము లాంటిదే. సూపర్ సిక్స్ పేరుతో టీడీపీ ప్రకటించిన కార్యక్రమాల అమలుతో దళిత, గిరిజనులకు ఆర్థిక చేయూతనిచ్చే సంక్షేమ పథకాలు పునరుద్ధరించటంలో బాధ్యత గల మంత్రిగా పనిచేయాల్సిన అవసరం కనిపిస్తోంది. నిజానికి పేదలందరి పక్షాన పనిచేసే అరుదైన అవకాశం స్వామికి లభించింది.

విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌కు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంది. అలాగే దళితులకు ఉచిత విద్యుత్ సరఫరాలో జగన్ ప్రభుత్వం చేసిన మోసాన్ని నివారించటం, అన్నింటికీ మించి జల విద్యుత్ వివాదంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించుకోవటం లాంటి అనేక సమస్యలు ఆయన ముందున్నాయి. వీటితోపాటు వైసీపీ ప్రభుత్వంలో కడప జిల్లాకు చెందిన ఒక సంస్థ ద్వారానే విద్యుత్ శాఖలో పనులన్నీ నిర్వహించి భారీ అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణ తీవ్రంగా ఉంది. ఈ విషయాన్ని టీడీపీ కోడై కూయటమే కాక తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అవినీతి గుట్టురట్టు చేసి అవినీతిపరులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఉన్నారు. వీటన్నింటిలోనూ విద్యుత్ శాఖ మంత్రిగా రవికుమార్ గణనీయ పాత్ర పోషించాల్సి ఉంది. ఇక జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, కొత్త లైన్లు ఏర్పాటుకు స్తంభాల కొరత, కొత్త లైన్లు ఏర్పాటుకు ఎదురవుతున్న ఇబ్బందుల పెద్ద సవాల్‌గానే కనిపిస్తున్నాయి. గ్రానైట్, ఆక్వా రంగాలకు సంబంధించి ఇచ్చిన హామీలను మాజీ సీఎం జగన్ విస్మరించారు. విద్యుత్ సరఫరా, విద్యుత్ చార్జీల విషయంలో రెండు రంగాల వారు కొత్త ప్రభుత్వం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు సోలార్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం జిల్లాకు కలగానే మిగిలింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఆ ప్రాజెక్టు జిల్లాకు మంజూరైంది. నిన్నటి వైసీపీ ప్రభుత్వం సరికొత్త మార్పులతో సోలార్ విద్యుత్ ప్రాజెక్టు జిల్లాకు వస్తున్నట్లు ప్రకటించింది. ఆ ప్రభుత్వంలో తొలి మూడేళ్లు జిల్లాకు చెందిన బాలినేని శ్రీనివాసరెడ్డి విద్యుత్ శాఖ మంత్రిగా ఉండటంతో సోలార్ ప్రాజెక్టు ఖచ్చితంగా వస్తుందని భావించారు. కానీ జగన్ ప్రభుత్వం దానికి తిలోదకాలు ఇచ్చింది. ఈ ప్రభుత్వంలో రవికుమార్ సారథ్యంలో అలాంటి బృహత్తర ప్రాజెక్టు ఖచ్చితంగా జిల్లాకు వస్తుందని జనం ఆశగా ఎదురుచూస్తున్నారు.

వ్యవసాయ, పారిశ్రామిక రంగాలే కీలకం

దొనకొండ పారిశ్రామికవాడ



'నేను బడికి పోతా' ప్రత్యేక కార్యక్రమం

ఒక రోజు ఆలస్యంగా ఉత్తర్వులు



ఒంగోలు(విద్య), జూన్ 14 : బడి ఈడు బాలబాలికలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు నేను బడికి పోతా పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ నెల 13నుంచి జూలై 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర పీడీ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. అర్హులైన పిల్లలందరూ పాఠశాలల్లో పేర్లు నమోదు చేయించుకోవాలని, 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న బాలబాలికలు ఎవరూ బడిబయట ఉండరాదు, మధ్యలో బడిమానేసిన పిల్లలందరినీ మళ్లీ బడికి రప్పించాలనే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బడికిపోతా కార్యక్రమానికి సంబంధించి ఒకరోజు ఆలస్యంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈనెల 13 నుంచి కార్యక్రమం షెడ్యూల్ మొదలవుతుండగా సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్(ఎస్పీడీ) మాత్రం తాపీగా 14న ఉత్తర్వులు జారీచేశారు. ఈ విధంగా వారు ఎంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారో ఇటువంటి ఉదంతాలు తేటతెల్లం చేస్తున్నాయి. షెడ్యూల్ ప్రకారం 13న పాఠశాలల్లో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించాలి. 14న బడి ఉత్సవం, 15న బాలికా ఉత్సవం, 17న ప్రత్యేక అవసరాల పిల్లల కార్యక్రమాలు, 18న విద్యా సదస్సు, 19న సమాజంతో ఒక రోజు కార్యక్రమం నిర్వహించాలి. గ్రామ/వార్డు సచివాలయం, వలంటీర్లు, సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు

సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం, జూన్ 14: ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా హెచ్చరించారు. 'ప్రభుత్వ భూమి మళ్లీ ఆక్రమణ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. డిప్యూటీ తహసీల్దార్ బి.శ్రీనివాసులు, మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో షేక్ బడేసాహెబ్‌లతో కలిసి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. సర్వే నెంబర్ 1011లో 30సెంట్ల ప్రభుత్వ భూమి ఉందని గుర్తించారు. అందులో 5 సెంట్లు లీగల్ మెటరాలజీ శాఖకు, 5 సెంట్లు ఏపీ ఫైబర్ నెట్‌కు కేటాయించినట్లు నిర్ధారించారు. మిగిలిన 20 సెంట్లు ప్రభుత్వ భూమిగానే ఉందని తేల్చారు.ఆ భూమిలో గతంలో ఆక్రమణకు యత్నించినప్పుడు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించారన్నారు. తిరిగి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమణకు యత్నించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా హెచ్చరించారు.

రేషన్ వాహన యజమానుల్లో ఆందోళన

జిల్లావ్యాప్తంగా 385 వాహనాలు

ఒక్కొక్క వాహనానికి రూ.18వేలు

ఆపరేటర్‌కు రూ.5వేలు గౌరవవేతనం

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో

ఏమి చేయాలో తెలియని పరిస్థితి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 14 : జిల్లాలో ఇంటింటికీ రేషన్ పేరుతో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొబైల్ వాహన యజమానుల్లో ఆందోళన నెలకొంది. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ సానుభూతిపరులకు ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు ఈ వాహనాలను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 1,392 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 385 వాహనాలను ఏర్పాటు చేశారు. ఆ వాహన యజమానికి నెలకు రూ.18వేలు, ఆ వాహనంలో బియ్యం ఎత్తేందుకు, దించేందుకు ఆపరేటర్ పేరుతో మరో రూ.5వేలను గౌరవవేతనంగా ఇస్తూ వచ్చారు. అలా ఒక్కొక్క వాహనానికి నెలకు రూ.23వేలను ప్రభుత్వం వెచ్చించింది. రేషన్ పంపిణీ 1వతేదీ ప్రారంభించి 15వతేదీ నాటికి పూర్తిచేస్తారు. ఏదైనా సర్వర్ పనిచేయకపోతే మరో రెండు, మూడు రోజులు పెంచేవారు. మిగిలిన 12 రోజులు ఆ వాహన యజమానులు ఇంకా ఇతర పనులకు వినియోగించుకునేవారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది. టీడీపీ ప్రభుత్వం గతంలో మాదిరిగా రేషన్ షాపుల ద్వారానే కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తుందని విస్తృతంగా ప్రచారం జరుగుతుండటంతో వాహన యజమానుల్లో వణుకు నెలకొంది. మరోవైపు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసేందుకు కొత్తగా టెండర్లు పిలిచి టీడీపీ మద్దతుదారులకు వాహనాలను అప్పగిస్తే తమ పరిస్థితి ఏమిటోనని వారు మదనపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే తమకు తెలిసిన వారి ద్వారా టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. తమ వాహనాలను కొనసాగించే విధంగా చూడాలనే ప్రయత్నాలను ప్రారంభించినట్లు సమాచారం. ఇలా జిల్లావ్యాప్తంగా వాహన యజమానుల్లో ఎప్పుడు ఏమి జరుగుతుందో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. వాహనాలను పెట్టుకోకపోతే తాము ఇప్పుడు ఏమి చేయాలో అనేది అర్థం కాని పరిస్థితి నెలకొంది.



స్వచ్ఛందంగా పక్కకు..

సిద్ధమైన జిల్లాలోని రేషన్ డీలర్లు

15వ తేదీలోపు బియ్యం పంపిణీ పూర్తి

ఆ తర్వాత కొత్త వారితో డీడీలు కట్టించే అవకాశం

టీడీపీ అధికారంలోకి రావడంతో చాలామంది రేషన్‌షాపుల డీలర్లు స్వచ్ఛందంగా పక్కకు తప్పుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సుదీర్ఘకాలంగా రేషన్ షాపులు నిర్వహిస్తున్న వారి చేత బలవంతంగా రాజీనామాలు చేయించి వైసీపీ ద్వితీయశ్రేణి నేతలకు అప్పగించారు. ఇటీవలి ఎన్నికల్లో టీడీపీ గెలవడంతో ప్రస్తుతం డీలర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసేందుకు ఎక్కువశాతం మంది ముందుకు రాగా కొంతమంది వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు సమాచారం. రేషన్ షాపులకు ఈనెల 20వతేదీలోపు వచ్చేనెలకు సంబంధించి బియ్యం, కందిపప్పు, పంచదారకు డీడీలు తీయాల్సి ఉంది. ఇప్పటికే సగం షాపుల్లో బియ్యం పంపిణీ పూర్తి కాగా మిగిలిన వాటిల్లో పంపిణీ చివరి దశలో ఉంది. ముందుగా పంపిణీ చేసిన షాపుల వివరాలను ఇప్పటికే గుర్తించిన టీడీపీ నేతలు తదనుగుణంగా చర్యలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

రంగంలోకి పాత డీలర్లు

జిల్లాలోని సుదీర్ఘకాలం పాటు రేషన్ షాపులు నిర్వహిస్తూ పార్టీలకతీతంగా గుర్తింపు ఉన్న డీలర్లను గత వైసీపీ ప్రభుత్వం బలవంతంగా తొలగించింది. ఇప్పుడు అటువంటి వారు కూడా ప్రజాప్రతినిధులను కలిసి తమకు వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాన్ని వివరించడంతోపాటు ఈసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇంకోవైపు టీడీపీ ద్వితీయశ్రేణి నాయకుల్లో కొందరు కూడా డీలర్ల కోసం పోటీపడుతున్నారు. అలా జిల్లావ్యాప్తంగా ఈనెల 20వ తేదీలోపు డీలర్లందరినీ మార్చే అవకాశం ఉందని సమాచారం. ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సులు వచ్చిన వెంటనే షాపులను కేటాయించి కొత్త డీలర్ల చేత డీడీలు కట్టించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి



నవీన్, చందు మృతదేహాలు

పుట్టినరోజు వేడుకల్లో విషాదం

కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబసభ్యులు

దర్శి జూన్ 14 : ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన సంఘటన దర్శిలో జరిగింది. పుట్టినరోజు పార్టీ సందర్భంగా ఈ విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం.. దర్శి మండలం లంకోజనపల్లి పంచాయతీలోని లూదగిరి కాలనీకి చెందిన బొందల నవీన్(16), కొనకనమిట్ల మండలం వాగుమడుగు గ్రామానికి చెందిన వి.చందు(16) దర్శి ఎన్ఎపీ చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లి గురువారం సాయంత్రం గల్లంతయ్యారు. ఈ విషయం రాత్రి పొద్దుపోయిన తర్వాత కుటుంబసభ్యులకు తెలిసింది. వీరిరువురూ దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత మార్చిలో పదో తరగతి పరీక్షలు రాశారు. ఇద్దరు మంచి స్నేహితులు. లూదగిరి కాలనీకి చెందిన నవీన్ పుట్టినరోజు సందర్భంగా గురువారం పార్టీ ఇచ్చేందుకు తన స్నేహితులను అందరినీ పిలుచుకున్నారు. అందులోభాగంగా చందును కూడా పిలిచాడు. చందు స్వగ్రామమైన వాగుమడుగులో తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతున్నాయి. కురిచేడు మండలం అలవలపాడులో ఉన్న చందు అమ్మమ్మను ఊరికి తీసుకెళ్లేందుకు ఆ గ్రామానికి వెళ్లి దర్శికి తీసుకొచ్చాడు. స్నేహితుడు నవీన్ పుట్టినరోజు పార్టీ ఉండటంతో ఆమెను బస్సు ఎక్కించి పంపి గురువారం మధ్యాహ్నం దర్శిలోని శివరాజ్‌నగర్ వద్ద గల ఎన్ఎపీ చెరువు వద్ద పుట్టినరోజు పార్టీ చేసుకున్నారు. భోజనాలు అనంతరం సాయంత్రం నవీన్, చందులు ఈత కొట్టేందుకు చెరువులో దిగారు. మిగిలిన విద్యార్థులు ఈత రాదని వెళ్లిపోయారు. వారిద్దరు ఈత కొట్టేక్రమంలో నీటమునిగారు. రాత్రి 9గంటల వరకు విద్యార్థులు ఇళ్లకు చేరకపోవటంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది ఆరా తీశారు. పుట్టినరోజు పార్టీ చేసుకున్న సమాచారం తెలుసుకొని అక్కడకు వెళ్లి గాలించారు. శుక్రవారం ఉదయం ఇద్దరు మృతదేహాలను బయటకు తీశారు. ఈ సంఘటన ఇరుగ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొల్పింది.

శోకసంద్రంలో కుటుంబసభ్యులు

బాగా చదువుకొని వృద్ధిలోకి వస్తారని ఎన్నో ఆశలతో పేద కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు వారిని కష్టపడి చదివిస్తున్నారు. నవీన్, చందులు ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఉన్నత విద్య చదివి ఉన్నతస్థాయికి చేరుకుంటారని ఎన్నో ఆశలు పెట్టుకున్న కుమారులు మృతిచెందటంతో వారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బంధువులు, స్నేహితులు అధికసంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు విద్యార్థులు ఒకేసారి మృతిచెందటంతో విషాదఛాయలు నెలకొన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విలపిస్తున్న కుటుంబసభ్యులు, మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై



రియల్ భూములకు తరలించి చదును చేసిన మట్టి(ఇన్‌సెట్లో) మట్టిని తవ్వి ట్రాక్టర్లకు ఎత్తిపోస్తున్న ఎక్స్‌కవేటర్లు

తవ్వుకుపోతున్నారు..

పట్టపగలు పేర్నమిట్ట చెరువు గుల్లగుల్ల



యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు

రియల్ ఎస్టేట్ భూములకు మట్టి తరలింపు

ఒంగోలు(క్రైం), జూన్ 14: పేర్నమిట్ట చెరువును రియల్టర్లు గుల్ల చేస్తున్నారు. అక్రమంగా తవ్వకాలు జరిపి గ్రావెల్‌ను రియల్ భూములకు తరలిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన చెరువులో ఎక్స్‌కవేటర్లతో గోతులు తీస్తున్నా కనీసం కన్నెత్తిచూసిన పాపాన పోలేదు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు. చీమకుర్తికి చెందిన ఓ గ్రానైట్ వ్యాపారి రియల్ రంగంలోనూ బాగా పేరుపొందారు. కొత్తగా చేపట్టిన తన వెంచర్ కోసం శుక్రవారం ఉదయం యేథేచ్ఛగా ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు జరిపి ఆరు ట్రాక్టర్లతో కర్నూల్ రోడ్డుకు పక్కనే ఉన్న రెండు ఎకరాల భూమిని చదును చేస్తున్నారు. పరిస్థితిని గమనించిన గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వీఆర్వో రవి అక్కడకు చేరుకొని తవ్వకాలను నిలిపివేసి మండల తహసీల్దార్‌కు నివేదిక ఇచ్చారు. అయితే అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. పేర్నమిట్ట చెరువులో ఇలా నిత్యం అక్రమంగా తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మంత్రి అచ్చెన్నాయుడిని కలిసిన సత్య



అచ్చెన్నాయుడికి బొకే ఇస్తున్న సత్య

కొండపి, జూలై 14 : రాష్ట్ర వ్యవసాయం, సహకార మార్కెటింగ్, పశుసంవర్ధకశాఖల మంత్రి కింజరపు అచ్చెన్నాయుడిని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య శుక్రవారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా విజయవాడలో కలిశారు. ఈసందర్భంగా మంత్రికి సత్య బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు.

బడిఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పించాలి

● డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), జూన్ 14 : బడిఈడు బాలబాలికలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని డీఈవో సుభద్ర ఆదేశించారు. ఒంగోలులోని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల విద్యాధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాల విద్యార్థులకు కొత్త స్టూడెంట్ కిట్స్ మాత్రమే ఇవ్వాలన్నారు. పాత విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయవద్దని ఆదేశించారు. కిట్‌కు ప్రస్తుతం అందుబాటులో ఉన్న వస్తువులను పంపిణీని చేయాలన్నారు. ఈనెల 20నాటికి సామగ్రి మొత్తం పాఠశాలలకు అందుతుందన్నారు. కిట్లు పంపిణీ చేశాక విద్యార్థుల నుంచి అక్విటెన్స్ తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పాఠశాలను తనిఖీ నిర్వహిస్తూ తమ నివేదికలను ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. పెండింగ్ విచారణలు, స్పందన అర్జీలను పరిష్కరించాలని తెలిపారు. మినిమం టైం స్కేలుతో పనిచేస్తున్న 2008, 1998 కాంట్రాక్టు టీచర్లు తాము పనిచేస్తున్న పాఠశాలల్లో చేరాలన్నారు. అవసరమున్న పాఠశాలలకు టీచర్లను పనిసర్దుబాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సెక్టోరల్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై హర్షం



కేక్ కట్ చేస్తున్న అసోసియేషన్ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 12: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబు నాయుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయడం పట్ల బార్ అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఒంగోలులోని జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో శుక్రవారం అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.మోహన్‌దాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినా పట్టించుకొని పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన వెంటనే యాక్టును రద్దు చేయడంపై అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ సురేంద్రబాబు, ఎన్.సత్యశ్రీనివాస్, బొడ్డు భాస్కరరావు, శిరిగిరి సరళ, అజయ్‌బాబు, పంగులూరు గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి, పూర్ణచంద్రరావు

సింగరాయకొండ, జూన్ 14 : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలను ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్నారు. శుక్రవారం దేవస్థానం ఈవో పి.కృష్ణవేణి, చైర్మన్ పామర్తి మాధవరావు విజయవాడ కోనూరిలోని సత్య నివాసంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని, టీడీపీ సీనియర్‌నేత పూర్ణచంద్రరావులను కలిశారు. వారి చేతుల మీదగా బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆలయ ఈవో, చైర్మన్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాకప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీసెల్ అధ్యక్షుడు మించల బ్రహ్మయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాలక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

మద్దిపాడులో తాగునీటికి ఇక్కట్లు

మద్దిపాడు, జూన్ 14: మద్దిపాడులోని ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద మోటార్లు చెడిపోవడంతో గత వారం రోజుల నుంచి మంచినీటి సరఫరా నిలిచిపోయింది. ఈక్రమంలో మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు సహకారంతో వాటర్‌ట్యాంకర్ ద్వారా గ్రామంలో నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మంచినీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ప్రజాపాలన అందించడమే టీడీపీ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మర్రిపూడి, జూన్ 14 : ప్రజాపాలన అందించడమే ధ్యేయంగా టీడీపీ పని చేస్తోందని పలువురు నాయకులు చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీపై తొలిసంతకం చేసిన చంద్రబాబునాయుడు నిరుద్యోగులకు భరోసా కల్పించారని చెప్పారు. రైతుల హక్కులను హరించే విధంగా ఉన్న భూటైటిల్ యాక్ట్‌ను రద్దుచేయడం శుభపరిణామం అన్నారు. దివ్యాంగులకు 6000 రూపాయలు, వృద్ధులకు, వితంతువులకు 4000 రూపాయలకు పింఛను పెంచుతూ సంతకం చేసి వారికి చంద్రబాబు ఆసరాగా నిలిచారని కొనియాడారు. పేదల ఆకలిని తీర్చేందుకు అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి పేదల మనసును చూరగొన్నారని అన్నారు. సమావేశంలో తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు చేరెడ్డి నరసారెడ్డి, రేగుల వీరనారాయణ, తుళ్లూరి నరసింహారావు, రేగుల శ్రీనివాసరావు, యర్రంరెడ్డి వెంకటరెడ్డి, పసుపులేటి సురేష్‌బాబు, గోపిరెడ్డి నరసింహారెడ్డి, బొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కాస్త పట్టించుకోండి సారూ..!



రాజీవ్ గృహకల్ప 3వ లైనులో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 14 : ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లోని సమస్యలు ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. దీంతో నిరంతరం ప్రమాదాలు చోటు చేసుకుంటుండగా, కార్పొరేషన్ పనితీరుపై పెదవి విరుస్తున్నారు. కొప్పోలు రోడ్‌లోని రాజీవ్ గృహ కల్ప 3వ లైనులో గత కొన్ని నెలలుగా మ్యాన్‌హోల్ మూత తెరిచి ఉంది. దీంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయి. అలాగే స్థానిక ఇస్లాంపేటలోని కృష్ణ థియేటర్‌కు వెళ్ళే రోడ్‌లో సైడు కాలువలపై నిర్మాణాలు కట్టడం, మెట్లు నిర్మించి మూసివేయడంతో మురుగు నీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో మురుగు పోయే మార్గం రోడ్లపైకి ప్రవహిస్తున్నది. దీంతో ఆ వైపు రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆయా సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్యవంతులు అందరూ రక్తదానం చేయాలి

● జేసీ గోపాలకృష్ణ

● ఘనంగా రక్తదాన దినోత్సవం



రక్తదాతకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 14 : ఆరోగ్యవంతులు అందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక స్పందన హాలులో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కలెక్టరేట్, కార్పొరేషన్ ఉద్యోగులు, స్వచ్ఛందసంస్థలు, మెడికల్ షాపుల సిబ్బంది, బ్యాంకు ఉద్యోగులు వంద మందికి పైగా రక్తదానం చేశారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన రక్తదాతలను జేసీ అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణం పోసిన వారమవుతామని తెలిపారు. ఈ దిశగా ప్రజలకు చైతన్యంకల్పించి స్వచ్ఛందంగా రక్తదానం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో బ్లడ్‌బ్యాంకును కూడా ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. రక్తదానం చేసిన వారిలో కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, డీఆర్వో శ్రీలత కుమారుడు యశ్వంత్‌ను జేసీ అభినందించారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, ట్రెజరర్ రాఘవయ్య, బ్లడ్ బ్యాంకు కన్వీనర్ నరసింహరావు, దేస్తీ ఫౌండేషన్ చైర్మన్ మహబూబ్, నగర అభివృద్ధి కమిటి అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు పాల్గొన్నారు.

రక్తదానం..మరొకరికి ప్రాణదానం

● సూపరింటెండెంట్ దుర్గాదేవి

ఒంగోలు (కార్పొరేషన్): ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని ఒంగోలులోని రిమ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి హాజరై మాటాడారు. రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలు కాపాడుతుందని తెలిపారు. ఆరు నెలలకు ఒకసారి రక్తందానం చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. రక్తదానంపై ఉన్న అపోహలు వీడాలని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరికి ప్రాణదానం చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎం.థామస్ 70 సార్లుకుపైగా రక్తదానం చేయగా, గొల్లపాటి రమేష్ అరుదుగా దొరికే బాంబే బ్లడ్ గ్రూప్ 25 సార్లు చేయడం అభినందనీయం అన్నారు. అలాగే సాయి కళ్యాణ్, ముత్యాలు ఇప్పటికే 25 సార్లుకు పైగా రక్తదానం చేయడాన్ని డాక్టర్లు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ వివేకానందన్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దామచర్లకు ఉద్యోగ సంఘాల సత్కారం



ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 14: ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను ఏపీ రెవెన్యూ అసోసియేషన్, ఏపీజేఏసీ అమరావతి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జేఏసీ చైర్మన్ ఆర్‌వీఎస్.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గజమాలతో పాటు శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు ఊతకొలు శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి డానియేలు, కాశయ్య, రామనారాయణ రెడ్డి, డేవిడ్, సీహెచ్.కృష్ణమోహన్, ప్రశాంత్, మహిళా విభాగం అధ్యక్షురాలు జయలక్ష్మి, కార్యదర్శి శ్రీదేవి, కోమటిగుంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు ఎమ్మెల్యే దామచర్లను మర్యాద పూర్వకంగా కలిసి బొకే ఇచ్చి శాలువతో సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి వరకుమార్, కోశాధికారి భాను, రంగారెడ్డి, శ్రీనివాసులు, శ్రీకాంత్‌రెడ్డి, రమణారావు, రామ్మోహన్, డాక్టర్ కాట్రగడ్డ రజిత, మానస, కాట్రగడ్డ శ్రీదేవి, వనజ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

కమిషనర్ జశ్వంత్‌రావు

నాలుగు రోజుల నుంచి నగరంలో స్పెషల్‌డ్రైవ్



పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ జశ్వంత్‌రావు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 14 : ఒంగోలు నగరంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు తెలిపారు. శుక్రవారం నగరంలోని జాతీయ రహదారితోపాటు పలు ప్రాంతాల్లో రోడ్డు పక్కల పేరుకుపోయిన చెత్తదిబ్బలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సూచనల మేరకు ప్రధానంగా పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టామన్నారు. ఇంటింటి చెత్త సేకరణ ప్రతిరోజు చేయడంతోపాటు వీధుల్లో ఇష్టారాజ్యంగా వేసిన చెత్తను తొలగిస్తామని, ఇకపై వీధుల్లో చెత్త వేయడానికి వీలు లేదని ఆయన స్పష్టం చేశారు. ఇళ్ళలో సేకరించిన చెత్తను పుట్‌కార్టులు, చెత్త సేకరణ ఆటోల లోనే వేయాలన్నారు. అలాగే శానిటేషన్ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, ప్రతి ఒక్కరూ విధుల్లో ఉండాల్సిందేనని, మురుగు, చెత్త సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఇకపై శానిటరీ అధికారులు, సిబ్బంది ప్రతిరోజు పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. అందమైన నగరంగా ఒంగోలు తీర్చి దిద్దడమే లక్ష్యమని చెప్పారు. అలాగే తాగునీరు, లీకుల సమస్యలపై కూడా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రవీంద్ర, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, ఇన్‌స్పెక్టరు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు సీఎం చంద్రబాబు శ్రీకారం

● ఎమ్మెల్యే బీఎన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 14: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాధ్యతలు తీసుకున్న మొదటి రోజే ఐదు హామీలపై సంతకం పెట్టడం హర్షనీయమని, ప్రజలు మెచ్చిన పాలన టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛను పెంపు, అన్న క్యాంటిన్‌ల పునరుద్ధరణ, స్కిల్స్ సెన్సెస్ హామీలపై సంతకం చేసిన విజన్ కలిగిన నాయకుడు చంద్రబాబు అని చెప్పారు. రానున్న ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు బృహత్తర ప్రణాళికతో ముందుకెళుతున్నారని పేర్కొన్నారు. సీఎం సారథ్యంలో ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలోనూ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడక స్వాములు, పార్టీ మండల అధ్యక్షులు గొట్టిపాటి రాఘరావు, మద్దినేని హరిబాబు, మండవ జయంత్‌బాబు, కంకణంపాటి బుజ్జి, వేల్పుల శ్రీనివాసరావు, మండవ గోపి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నూరు జడ్పీ హైస్కూల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

● పారిశ్రామికవేత్త హరిప్రసాద్



విద్యార్థినికి పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న హరిప్రసాద్

కొండపి, జూన్ 14 : వెన్నూరులోని జడ్పీస్కూల్ ఆదర్శపాఠశాలగా ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు కూడా తీర్చిదిద్దాలని అంజలి గ్రానైట్స్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త, స్కూల్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పోతినేని హరిప్రసాద్ చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన స్కూల్‌ను సందర్శించారు. స్కూల్ హెచ్ఎం భారతీతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. స్కూల్‌లో వసతుల కల్పనకు తాను సాయమందిస్తానని, విద్యార్థులను ఆదర్శవంతంగా తయారు చేయాలని సూచించారు. ఏటా ఉత్తమ ఫలితాలు సాధించి నగదు ప్రోత్సాహక బహుమతులు తన ద్వారా అందుకుంటున్న విద్యార్థులు ఏయే రంగాల్లో రాణిస్తున్నారో తెలుసుకుని వారి కార్యక్రమాల గురించి మిగిలిన విద్యార్థులకు వివరించి స్ఫూర్తి నింపాలని సూచించారు. కార్యక్రమంలో కొండపి ఏఎంసీ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, ఉపాధ్యాయులు ఆనందరావు, గుండా సుబ్బారావు, టీడీపీ నాయకులు దామా మురళి, గుండపనేని రామ్మూర్తినాయుడు, రామారావు పాల్గొన్నారు.

మద్దిపాడులో కదలని మురుగు



పాత సిండికేట్ బ్యాంకు వద్ద డ్రైనేజీలో ఏపుగా పెరిగిన తుంగ

మద్దిపాడు, జూన్ 14: మద్దిపాడులో మురుగు కాలువలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. మురుగు పేరుకుపోయి ముందుకు కదలకపోవటంతో దోమలు విజృంభిస్తున్నాయి. స్థానిక అరుంధతికాలనీలో సైడుకాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు ముందు కదలడం లేదు. అలాగే పాత సిండికేట్ బ్యాంకు, ఎస్సీ హాస్టల్ వద్ద మురుగునీరు నిలిచిపోయింది. గ్రామంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుంది. అదేవిధంగా ముస్లింకాలనీ, మహాత్మాగాంధీ కాలనీలో సైతం పరిస్థితి అలాగే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువలు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అవీ..ఇవీ..

సమర్థవంతమైన సీఎం చంద్రబాబు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 14: రాష్ట్రం బాగుండాలంటే సమర్థవంతమైన నాయకుడు అవసరం ఎంతైనా ఉందని, అందుకే ప్రజలు తిరుగులేని తీర్పుతో చంద్రబాబు నాయుడును మరలా ముఖ్యమంత్రిని చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ తెలిపారు. శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమాన్ని, నిరుద్యోగుల భవిష్యత్‌ను, అవ్వాతాతలకు అండగా ఉండేందుకు చంద్రబాబు సీఎంగా బాధ్యతలు తీసుకున్న తొలిరోజే ఐదు హామీలపై సంతకాలు చేశారని పేర్కొన్నారు. ప్రజలు మెచ్చిన పాలన టీడీపీతోనే సాధ్యమన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

16న హనుమాన్ శోభాయాత్ర

ఒంగోలు(కల్చరల్), జూన్ 14: ఒంగోలులో ఈ నెల 16వ తేదీన హనుమాన్ శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ ప్రముఖ్ సోమ సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2వ తేదీన తలపెట్టిన శోభాయాత్ర ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడిందని, దానిని 16న నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక సంతపేటలోని శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద బయలుదేరి బైక్ ర్యాలీ నాటు బాబూరావు పార్కు, ట్రంకురోడ్డు, కలెక్టరేట్, పాత కూరగాయల మార్కెట్, అద్దంకి బస్టాండ్, కర్నూల్ రోడ్డు బైపాస్, మంగమూరు రోడ్డు కూడలి, లాయర్‌పేట, కొణిజేడు బస్టాండు, కేశవస్వామి పేట వరకు కొనసాగుతుందన్నారు. కనుక హిందువులు ఈ హనుమాన్ శోభాయాత్రలో భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

శ్రీవారికి మేల్‌చాట్ వస్త్రాల బహూకరణ



మేల్‌చాట్ వస్త్రాలను అందజేస్తున్న దాతలు

ఒంగోలు(కల్చరల్), జూన్ 14: ఒంగోలు నగరం శ్రీగిరిలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం భక్తులు మేల్‌చాట్ వస్త్రాలను బహూకరించారు. సీవీ.రామకృష్ణారావు, ఇందిరాదేవి దంపతులు ఈ వస్త్రాలను అందజేయగా, ఆలయ పండితులు వారికి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఈ సందర్భంగా దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలూరు ఝాన్సీరాణి మాట్లాడుతూ శనివారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆచార్య వరణం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మేదినీ పూజ, మృత్సంగ్రహణం, అంకురార్పణ, వాస్తు హోమం, ధ్వజదండ, ధ్వజపట గరుడ ప్రతిష్ఠ మొదలైన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

రేపు కాపు కమ్యూనిటీ కార్యవర్గ సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 14: కాపు కమ్యూనిటీ హాల్ అండ్ పేద విద్యార్థుల వసతిగృహ కమిటీ కార్యవర్గ సమావేశం ఆదివారం ఉదయం పది గంటలకు ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో జరుగుతుందని కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తోటపల్లి వెంకటరంగారావు, ఆరిగ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

కొత్త ప్రభుత్వానికి శుభాకాంక్షలు : ఏపీటీఎఫ్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 14: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి ఏపీటీఎఫ్ నాయకులు కేవీజీ.కీర్తి, బి.వెంకట్రావు, ఎ.అమ్మయ్య, బి.అశోక్‌కుమార్, వై.శ్రీనివాసులు, పీవీ.సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వంలో కోల్పోయిన హక్కులు, రాయితీలు పునరుద్ధరించాలని, 117 జీవోను రద్దు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, అమ్మకువందనం పథకం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే వర్తింపజేయాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని వారు కోరారు.

మంత్రి లోకేష్‌కు అభినందనలు

ఒంగోలు(విద్య), జూన్ 14 : రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్‌ను మినిమం టైం స్కేలు ఉపాధ్యాయుల గౌరవాధ్యక్షుడు పి.వీరయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మండవ సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. లోకేష్ నాయకత్వంలో విద్యారంగం మరింత అభివృద్ధి చెందాలని, 1998 ఎంటీఎస్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

నిధులను రికవరీ చేయాలి



డీపీవో ఉషారాణికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 14: దుర్వినియోగమైన పంచాయతీ నిధులను రికవరీ చేసేలా చర్యలు తీసుకోవాలని నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరుకు చెందిన ప్రజలు కోరారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ చేయగా రూ.42,70,066 నిధులను పంచాయతీ కార్యదర్శి అసాధారణంగా ఖర్చు చేసినట్లు గుర్తించారన్నారు. ఆ నిధులను రికవరీ చేయాలని కోరారు. కార్యక్రమంలో కవగాల శ్రీనివాసరావు, పి.కోటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో రాయితీపై విత్తనాలు

మద్దిపాడు, జూన్ 14: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన పిల్లిపెసర, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మద్దిపాడు వ్యవసాయ అధికారి జి.రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దిపాడు రైతుభరోసా కేంద్రంలో విత్తనాలు 30 శాతం రాయితీతో అందించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పురుగుమందులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు కావలసిన విజ్ఞానాన్ని కూడా ఆర్‌బీకేలో సిబ్బంది వివరిస్తారని ఆయన వివరించారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, జూన్ 14: మోటార్‌సైకిల్ ఢీకొని మరో మోటార్‌సైక్లిస్టుకు గాయాలైన సంఘటన శుక్రవారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం సమీపంలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు పర్చూరుకు చెందిన గరికముక్కల సీమోను తన మోటార్‌సైకల్‌పై నాగులుప్పలపాడు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, మరో మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో సీమోనుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మేదరమెట్లలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

దశరాజుపల్లి పొలాల్లో గుర్తుతెలియని మృతదేహం

ఒంగోలు(క్రైం), జూన్ 14: ఒంగోలు నగరం దశరాజుపల్లి పొలాల్లో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం గుర్తించారు. రైల్వే ఫ్లైఓవర్‌కు తూర్పు వైపున ఉన్న పొలాల్లో సుమారు 35 ఏళ్ళ యువకుడు సుమారు పది రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. దీంతో ఒంగోలు తాలుకా సీఐ భక్తవత్సలరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, అక్కడనే పోస్టుమార్టం చేయించారు. అయితే హత్య లేక ఆత్మహత్య అనే అనుమానాలు వ్యక్తం కాగా, పోస్టుమార్టం నివేదికలో కొంత సమాచారం తెలిసే అవకాశం ఉందని సీఐ పేర్కొన్నారు.

యువత భవితకు చంద్రబాబు బాసట



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పొన్నలూరు (కొండపి), జూన్ 14 : యువత భవితకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నాడని టీడీపీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు చెప్పారు. శుక్రవారం ఆయన మండల నా యకులతో కలిసి పొన్నలూరులో విలేకరులతో మాట్లాడారు. మెగా డీఎస్సీ, అన్న క్యాంటిన్‌లు ఏర్పాటు, పింఛన్‌ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, స్కిల్ సెన్సెస్ పథకాలపై తొలి సంతకాలు చేసిన చంద్రబాబు రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పాటు పడుతున్నారన్నారు. సమావేశంలో మండల నాయకులు మండవ ప్రసాద్, గుమ్మళ్ల వెంకట్రావు, సన్నమూరి నరసింహారావు, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను కొనసాగించాలి

మద్దిపాడు, జూన్ 14: ఉపాధి హామీ పనులను కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బ వెంకటేశ్వర్లు శుక్రవారం మద్దిపాడులోని ఉపాధి డీఏ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది ఉపాధి కూలీలు 100 రోజుల పని దినాలను సక్రమంగా ఉపయోగించుకోలేదని, పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, వాటిని కొనసాగించాలన్నారు. 200 పనిదినాలు కల్పించి, రూ.600 కూలి ఇవ్వాలని కోరారు. అలాగే ఉపాధి కూలీల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట సంఘ అధ్యక్షులు కొంగాల చిన్న ఉన్నారు.

దివ్యాంగురాలిపై అఘాయిత్యం

• ముగ్గురు అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

చీమకుర్తి, జూన్ 14: అమాయకురాలైన దివ్యాంగురాలిపై అఘాయిత్యం జరిగింది. ఈ ఘటనపై శుక్రవారం చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో బాధితురాలు గుర్తించిన మేరకు ముగ్గురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలపరిధిలోని చంద్రపాడులో మాటలు రాని, వినపడని యువతిపై గత మూడు నెలలుగా అఘాయిత్యం జరుగుతున్నట్లు బయటపడింది. ఆ యువతి గర్భిణీ అని తేలటంతో నివ్వెరపోయిన ఆమె తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు యువతి గుర్తించిన మేరకు అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. ఈ ముగ్గురిలో ఒకరు అవివాహితుడు కాగా ఇద్దరు వివాహితులు. ఈ ఘటన గ్రామంలో సంచలనం రేపుతోంది. బాధితురాలికి అసుపత్రిలో వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

బాధ్యతగా వ్యవహరిద్దాం

• విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

అద్దంకి, జూన్14: వైసీపీ నేతలు చేసిన తప్పులు మనం చేయకుండా ప్రజలకు మంచి పనులు చేస్తూ బాధ్యతగా వ్యవహరించాలని విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మంత్రిగా ప్రమాణం చేసిన తరువాత తొలిసారి శుక్రవారం అద్దంకి వచ్చిన రవికుమార్ స్థానిక నాగులపాడురోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఘన విజయం సాధించటంతో ఎక్కువ బాధ్యత పెరిగిందన్నారు. వైసీపీ దుర్మార్గపు పాలనతో దేశంలో ఏపీకి చెడ్డ పేరు వచ్చిందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. వాళ్ల చేసిన తప్పులు మనం చేయకుండా మంచిపాలన అందించాలన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు మర్మతులు చేయకుండా వైసీపీ నాయకులు గాలికి వదిలివేశారు. వెంటనే మరమ్మతులు చేయించి సాగు, తాగు నీటి సమస్య లేకుండా చర్యలు చేపడతానన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో భాగంగా ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీ, అన్న క్యాంటిన్‌ల ఏర్పాటు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, పెన్షన్ పెంపు తదితర ఫైళ్లపై సంతకాలు చేశారన్నారు. పింఛన్లను టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పింఛను రూ.2వేలకు పెరిగిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వెయ్యి రూపాయలు పెంచటానికి 5 సంవత్సరాలు పట్టిందన్నారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3 వేల పింఛన్ రూ.4 వేలకు పెంచటంతో పాటు, ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి పెంచిన రూ.వెయ్యి కలిపి మూడు వేల రూపాయలను కూడా వచ్చే నెలలో ఇళ్ల వద్దనే అందజేస్తారన్నారు.

అద్దంకి నియోజకవర్గ చరిత్రలో తొలిసారి మంత్రి పదవి

అద్దంకి నియోజకవర్గ చరిత్రలో తొలిసారి మంత్రి పదవి వచ్చిందని, మరింత బాధ్యతగా పనిచేసి అద్దంకి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని మంత్రి రవికుమార్ అన్నారు. అద్దంకి అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 85 కోట్ల రూపాయలతో మంచినీటి పథకం మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తే వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇంకా పూర్తి కాలేదన్నారు. అత్యధిక శాతం పనులు పూర్తయిన టిడ్కో ఇళ్లు కూడా నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వెంటనే అసంపూర్తి పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. వరుస విజయాలు అందిస్తున్న అద్దంకి నియోజకవర్గ ప్రజల అభిమానం మరువలేనిదన్నారు. నిత్యం అందుబాటులో ఉండి అద్దంకి నియోజకవర్గాన్ని మరింత అభివృచేస్తానని హామీ ఇచ్చారు.

మంత్రి పర్యటనలో జేబు దొంగల చేతివాటం

విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం అద్దంకి పట్టణానికి తొలిసారి రావటంతో శుభాకాంక్షలు తెలిపేందుకు అన్ని ప్రాంతాల నుంచి టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున వచ్చారు. పాతబస్టాండ్ సెంటర్‌లో మరింత ఒత్తిడి ఏర్పడింది. ఈ నేపథ్యంలో జేబుదొంగలు చేతివాటం చూపించారు. పలువురు టీడీపీ నేతల జేబులలో ఉన్న నగదును నొక్కేశారు. సుమారు 10 మంది వద్ద నుంచి 1.5 లక్షల రూపాయల వరకు కాజేసినట్లు తెలుస్తోంది. అయితే జేబులో నుంచి నగదు తీయటాన్ని గుర్తించి ఓ యువకుడుని పట్టుకొని టీడీపీ శ్రేణులు పోలీసులకు అప్పగించారు. దర్శికి చెందిన యువకుడుగా అనుమానిస్తున్నారు. పట్టుబడ్డ యువకుడుతో పాటు సుమారు 10 మంది ముఠాగా కలిసి వచ్చినట్లు తెలుస్తోంది. ఒక యువకుడు పట్టుబడటంతో మిగిలిన యువకులు అక్కడ నుంచి జారుకున్నారు.

మంత్రి స్వామికి పలువురి సత్కారం



మంత్రి స్వామిని సత్కరిస్తున్న సచివాలయ సంఘ నాయకులు



మంత్రి స్వామి, పూర్ణచంద్రరావులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పెరిదేపి నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 14: సాంఘిక సంక్షేమశాఖ, వార్డు, సచివాలయ, వలంటీర్ శాఖల మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీరామ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో మంత్రి స్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామికి బొకే అందజేసి శాలువతో సన్మానించారు. అనంతరం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను తీసుకెళ్ళినట్లు అజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గునిపే రాజేష్, కోశాధికారి పాండురంగ, మాడుగుల రాజేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెరిదేపి నాయకుల శుభాకాంక్షలు

కొండపి: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని పెరిదేపి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం విజయవాడలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావును కలిసి బొకేలు ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పెరిదేపి గ్రామ మాజీ సర్పంచ్ చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, నాయకులు రాయపాటి వెంకటరావు, మార్టూరి వెంకటేశ్వరరావు, రాజేష్ పాల్గొన్నారు.

అదేవిధంగా మంత్రి స్వామిని మండల తెలుగు యువత అధ్యక్షుడు షేక్ ఖాఈషా, ముప్పవరం గ్రామ నాయకులు ముప్పరాజు శ్రీనివాసరావు, బోయిళ్ల శ్రీనివాసరావు, టీడీపీ మండల నాయకులు చాగంరెడ్డి నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ సారథి ముఖ్యమంత్రి చంద్రబాబు

టీడీపీ ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రామయ్యచౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కొండపి, జూన్ 14: ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ సారథిగా తొలి ఐదు సంతకాలు చేశారని టీడీపీ ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్యచౌదరి చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం కొండపిలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగులకు మెగా డీఎస్సీ ద్వారా 16వేలకు పైగా ఉపాధ్యాయుల ఉద్యోగాలను కల్పించాలన్నది ఆయన సంకల్పమన్నారు. అదేవిధంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, పింఛన్‌దారులకు నాలుగువేల రూపాయలకు పెంపు, పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు ప్రారంభం, నిరుద్యోగులకు ఉపయోగపడే స్కిల్ సెన్సెస్‌లపై తొలి సంతకాలు చేసి చంద్రబాబు దార్శనికతను చాటుకున్నారని చెప్పారు. అదేవిధంగా కొండపిలో మూడోసారి గెలిచిన డోలా శ్రీబాలవీరాంజనేయస్వామికి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి పదవి ఇవ్వడం పట్ల ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఆదివారం తొలిసారిగా మంత్రి హోదాలో జిల్లాకు వస్తున్న స్వామికి మధ్యాహ్నం మూడు గంటల నుంచి నియోజకవర్గంలోని శ్రేణులు బొప్పూడి ఆంజనేయస్వామి గుడి నుంచి జరిగే ర్యాలీలో పాల్గొనాలని తెలిపారు. సమావేశంలో నాయకులు కొర్రపాటి వసంతరాయుడు, దామా మురళి, బత్తుల అంజయ్య, మూలె కోటేశ్వరరావు, మూలె రామిరెడ్డి, శిరిగిరి సుధాకర్‌రెడ్డి, ఆముదాలపల్లి గంగాధర్, ఈదర కిరణ్ పాల్గొన్నారు.

కబ్జాదారులొస్తున్నారు..తస్మాత్ జాగ్రత్త !

టీడీపీ నీడకు భూఆక్రమణదారులు • బదిలీల సిఫార్సులతో దందాకు శ్రీకారం • నిశితంగా గమనిస్తున్న ప్రజలు

మార్కాపురం, జూన్ 14: అధికారంలోకి వచ్చిన టీడీపీ నాయకులు నిరంతరం అప్రమత్తంగా ఉండి జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మార్కాపురంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ కాలంలో మార్కాపురం నియోజకవర్గం భూఆక్రమాలకు చిరునామాగా పేరుగాంచింది. వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుల వ్యవహారశైలితో అంతటి అపకీర్తి వచ్చిందనడంలో సందేహం లేదు. అందుకు రెవెన్యూ సిబ్బంది సహకరించడం, పత్రికలలో కథనాలు రావడం వంటి పరిణామాలతో మార్కాపురం ప్రాంతంలో రెవెన్యూ అక్రమాలు వెలుగు చూశాయి. చివరకు 14 మంది గ్రామ రెవెన్యూ అధికారులు, ఒక ఆర్ఐ సస్పెండ్ కావడం, బాధ్యుడైన తహసీల్దార్ అరెస్టు వంటి ఘటనలు పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టాయి. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సైతం మార్కాపురం వచ్చినప్పుడు మార్కాపురంలో వైసీపీ నాయకులు భారీగా భూఅక్రమాలకు పాల్పడ్డారని, వారిని చోటా నయీం ముఠాతో అభివర్ణించాడు.

రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికార వైసీపీలో అభ్యర్థుల బదిలీ చోటుచేసుకొంది. నాటి అధికార వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన కుందురు నాగార్జునరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై ఉన్న అవినీతి ఆరోపణల నేపథ్యంలో గిద్దలూరు నుంచి పోటీలో నిలిచారు. దీంతో భూ అక్రమాలకు కారణమైన వారు దిక్కుతోచక పోటీలో ఉన్న అభ్యర్థుల సామాజికవర్గాలలో తేడాలను కారణంగా చూపి టీడీపీ నీడకు చేరారు. వారంతా బయటకు టీడీపీలో ఉన్నట్లు కనబడుతూనే వైసీపీ నాయకులతో చీకటి వ్యవహారాలు నడిపారు. ఓట్లకోసం టీడీపీ నాయకులు సైతం వచ్చిన ప్రతి ఒక్కరినీ పార్టీలోకి ఆహ్వానించారు. ఇదే సమయంలో టీడీపీ తుఫాను సృష్టించి అధికారం చేజిక్కించుకొంది. మార్కాపురంలో కూడా టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి విజయం సాధించారు.

ఎన్నికల సందర్భంగా టీడీపీ నీడకు చేరిన భూ అక్రమార్కులు రెవెన్యూ అధికారుల బదిలీల సిఫార్సులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా రెవెన్యూ సిబ్బందిని తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటే అన్నీ పనులు సాఫీగా జరిగిపోతాయన్న ఆలోచనతో వారున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేగా గెలుపొందినవారు ప్రమాణస్వీకారం చేయకముందే తమకు నచ్చిన, తాము చెప్పే పనుల చేసే అధికారులకు బదిలీల హామీలు ఇచ్చేస్తున్నారు. వారు రాగానే పూర్తి చేయాల్సిన పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

మార్కాపురంలో నెలకొన్ని రాజకీయ పరిస్థితులను, నాయకుల వ్యవహార శైలిని ప్రజలు క్షుణ్ణంగా గమనిస్తున్నారు. భూఅక్రమాలు జరిగినప్పుడు ప్రతి పక్షనాయకులుగా ఉన్నవారు ప్రస్తుతం అధికారపక్షానికి వచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ ప్రభుత్వ హయంలో జరిగిన భూ అక్రమాలపై సమగ్ర విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధితులకు ఏమాత్రం న్యాయం జరుగుతుందోనని ఎదురుచూస్తు న్నారు. ఇదిలా ఉండగా కొందరు భూఅక్రమార్కులు నేరుగా ఎమ్మెల్యేను కలువకుండా ఆయన ముఖ్య అనుచరణగణానికి, కుటుంబసభ్యులకు ఆశల ఎర వేస్తున్నారు. తద్వారా తమ వ్యవహారాలను చక్కబెట్టుకునే పనిలో ఉన్నారు. రాగద్వేషాలను తావివ్వనని ఎన్నికల ప్రచారంలో గొంతెత్తిచాటిన ఎమ్మెల్యే కందుల నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని ఏమాత్రం నిలుపుకుంటారో వేచి చూడాలి.

అక్రమార్కులపై ఇప్పుడైనా చర్యలు తీసుకుంటారా?

అటవీశాఖ నిధుల గోల్‌మాల్‌పై పట్టించుకోని అధికారులు

విచారణను వదిలేసిన వైనం



దర్శి పల్లెవనం పార్క్



నాడు ఎన్టీఆర్ పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు

దర్శి, జూన్ 14: అటవీశాఖ నిధులు గోల్‌మాల్‌కు బాధ్యులైన వారిపై ఇప్పుడైనా చర్యలు తసుకుంటారో, లేదోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో విచారణ పేరుతో కాలయాపనచేస్తూ ఉన్నతాధికారులు అక్రమార్కులకు కొమ్ముకాస్తూ వచ్చారు. తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో నిధులు గోల్‌మాల్ చేసిన వారిపై చర్యలు తీసుకుంటారని భావిస్తున్నారు. దర్శి పట్టణంలోని ఎన్టీఆర్ పల్లెవనం పార్క్ అభివృద్ధి పనులకు 2023 జనవరిలో రూ.45 లక్షల నిధులు విడుదల చేశారు. ఆ నిధులను 2023 మార్చి లోపు ఖర్చుచేయాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యవైఖరి అవలంబించారు. మార్చి నెలలో ఎలాంటి పనులు చేయకుండా పల్లామల్లి సొసైటీ ద్వారా కొంతమంది అటవీశాఖ అధికారులు మార్చుకున్నారు. స్థానిక బీట్ ఆఫీసర్ ద్వారా ఆ పనులు నిర్వహించాల్సి ఉంది. అయితే స్థానిక అధికారికి తెలియకుండా, ఎలాంటి పనులు చేయకుండా మొత్తం నిధులను డ్రా చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక బీట్ ఆఫీసర్ జిల్లా ఉన్నతాధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారులు తొలివిడతగా వచ్చి చూసి వెళ్లారు. ఆ తర్వాత నిధులు మార్చుకున్న అధికారులు హడావుడిగా కొంతమేర పనులు చేశారు. ఆతర్వాత స్క్వాడ్ డీఎఫ్‌వో మారుతీప్రసాద్ పరిశీలనకు వచ్చారు. ఆ తర్వాతైనా అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారని భావించారు. అటవీశాఖ ఉన్నతాధికారుల మధ్య ఏం జరిగిందోకాని ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇక్కడకు వచ్చిన ఉన్నతాధికారులను నిధులు గోల్‌మాల్ పై గతంలో ప్రశ్నించినప్పుడు ఎప్పుడో ఒకప్పుడు పనులు పూర్తి చేశారుగా, ఆ విషయాన్ని వదిలేయండి అంటూ సమాధానం ఇచ్చారు. దీంతో విచారణను గాలికి వదిలేశారని స్పష్టమైంది. వైసీపీ ప్రభుత్వంలో తప్పుచేసిన అధికారులపై చర్యలు తీసుకోరనే భావనతో కిందిస్థాయి అధికారులు ఇంతకాలం మౌనంగా ఉన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో విచారణ వేగవంతం అవుతుందని భావిస్తున్నారు. కొత్త అధికారులు బాధ్యతలు చేపట్టిన తర్వాత పనులు చేయకుండా నిధులు డ్రా చేసిన విషయం, ఆతర్వాత అరకొర పనులతో సరిపెట్టిన విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారని ప్రజలు భావిస్తున్నారు.

ఎన్టీఆర్ పేరును మళ్లీ ఏర్పాటు చేయాలి

స్థానిక ఎన్టీఆర్ పల్లెవనం పార్క్ నేమ్‌బోర్డులో తొలగించిన ఎన్టీఆర్ పేరును మళ్లీ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో దర్శి-కురిచేడు రోడ్డులో ఎన్టీఆర్ పల్లెవనం పార్క్‌ను సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావటంతో పాలకుల ఒత్తిడి మేరకు బోర్డులో ఎన్టీఆర్ పేరును తొలగించారు. ప్రస్తుతం పల్లెవనం పార్క్‌గా మాత్రమే కనిపిస్తుంది. పార్క్ ఏర్పాటు సమయంలో గజిట్‌లో ఎన్టీఆర్ పల్లెవనం పార్క్‌గా రాశారు. అయినప్పటికీ పాలకులు ఉద్దేశపూర్వకంగా ఎన్టీఆర్ పేరును తొలగించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మళ్లీ ఎన్టీఆర్ పేరును ఏర్పాటుచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చిన్నగుడిపాడులో చోరీ

• రూ.50 వేల నగదు, మూడు సవర్ల బంగారం అపహరణ



బీరువాను పొలంలో వదిలివెళ్లిన దొంగలు

దొనకొండ, జూన్ 14: దొనకొండ మండలం చిన్నగుడిపాడుపాడు గ్రామంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన చౌదల కృష్ణారెడ్డి, నాగలక్ష్మమ్మ దంపతులు ఇంటికి తాళం వేసి వరండాలో పడుకున్నారు. దొంగలు ఇంటికి వెనుకవైపున ఉన్న కిటికీకి ఉన్న ఐరన్ గ్రిల్ చాకచక్యంగా తీసి కిటికీలో నుంచి లోపలకు ప్రవేశించారు. ముందు తలుపునకు లోపల గడిపెట్టి వెనుకవైపు తలుపు తీసుకొని ఇంటిలోని బీరువాను సమీపంలోని పొలంలోకి తీసుకెళ్లారు. అక్కడ బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.50 వేల నగదు, మూడు సవర్లు బంగారు ఆభరణం దోచుకెళ్లారు. ఉదయం నిద్రలేచిన కృష్ణారెడ్డి తలుపులు లోపల వేసి ఉండటం చూసి దొంగతనం జరిగిన విషయం గుర్తించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై సంపత్‌కుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒంగోలు క్లూస్ టీం సిబ్బంది పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కల్పించాలి : ఎమ్మెల్యే ఉగ్ర

ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ • సౌకర్యాల లేమిపై ఆగ్రహం



డయాలసిస్ రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూన్ 14: ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకాన్ని కల్పించే విధంగా వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కనిగిరి ప్రభుత్వ ఏరియా వైద్యశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. డయాలసిస్ కేంద్రంలోకి వెళ్ళి రోగులను పరామర్శించారు. కేంద్రంలో అందుతున్న సేవలపై వారిని విచారించారు. రాత్రి సమయాల్లో డయాలసిస్ కోసం వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారు వెళ్ళేందుకు వాహన సౌకర్యం ఏర్పాటుచేయాలని వైదాధికారులను ఆదేశించారు. గతంలో కేంద్రంలో జనరేటర్ వసతి లేక రోగులు నానా ఇబ్బందులు పడిన విషయాన్ని గుర్తు చేస్తూ అలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల వార్డులో చిన్నపిల్లలకు ఊయల లేకపోవటం గమనించి వాటిని ఏర్పాటుచేయాలన్నారు. ఆక్సిజన్, వాటర్‌ప్లాంట్ పరిశీలించి వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. స్వల్ప వ్యాధులకు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్ళాలని వైద్యులు చెప్తునట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇక నుంచి అలాంటి వాటికి స్వస్తి చెప్పాలన్నారు. లేదంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని డాక్టర్ ఉగ్ర హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, బాలు ఓబులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

• చీరాల ఎమ్మెల్యే కొండయ్య



సబ్సిడీ విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జూన్ 14: రైతులకు అన్ని విధాల అండగా ఉంటాం. సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని అక్కాయిపాలెంలో శుక్రవారం చీరాల, వేటపాలెం మండలాల పరిధిలోని ఆర్‌బీకే, డీలర్స్ వ్యవసాయశాఖ అధికారులు, బాధ్యులతో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ ఉపవృత్తులకు సంబంధించి రైతులకు అన్ని విధాలుగా అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఖరీఫ్ సాగుకు ముందస్తుగా రైతులకు ఉపయోగకరంగా ఏఏ పంటలు వేస్తే లాభదాయంకగా ఉంటుందనే అంశాన్ని గ్రామగ్రామాన వివరించాలని చెప్పారు. అనంతరం 50శాతం సబ్సిడీపై లబ్ధిదారులకు పచ్చిరొట్ట పైర్లకు సంబంధించిన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఏవో రామకృష్ణ, డీడీఏ విజయనిర్మల, ఏడీఏ ఎఫ్రాయమ్, డాట్ శాస్త్రవేత్త మురళీకృష్ణ, ఉషారాణి, ఉద్యానవనశాఖ అధికారి అలేఖ, నీటిపారులశాఖ అధికారులు, ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి రావినూతల టీడీపీ నాయకుల అభినందన



మంత్రి రవికుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

మేదరమెట్ల , జూన్14: మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అద్దంకి గొట్టిపాటి రవికుమార్‌కు రావినూతల తెలుగుదేశం నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. శుక్రవారం చిలకలూరిపేటలోని మంత్రి నివాసానికి 30 వాహనాలు టీడీపీ నాయకులు, పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు తరలి వెళ్ళి మంత్రి రవికుమార్‌కు పూల మాలలు, బొకేలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం పట్ల తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కారుసాల నాగేశ్వరరావు(బాబు), మోపర్తి లక్ష్మీనారాయణ, అనుబ్రోలు కస్తూరి, చేబ్రోలు నాగేశ్వరరావు, కారుసాల గురుబాబు, పిన్నక హనుమయ్య, కారుసాల సుబ్బయ్య, బొడపాటి ఆంజనేయులు, అనుబ్రోలు ప్రభాకరరావు, కావూరి ప్రసాద్, మువ్వ పావనీ, పాములపాటి కృష్ణకుమారి, వజ్జా ఇందిరమ్మ తదితరులు పెద్ద సంఖ్యల్లో హాజరై మంత్రి శుంభాకాంక్షలు తెలియజేశారు.

జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక


విదిత్‌కుమార్

గిద్దలూరు టౌన్, జూన్ 14 : మండలంలోని పొదల కొండపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల రామ సుబ్బారెడ్డి తెలిపారు. 8వ తరగతి చదువుతున్న నల్లబోతుల వెంకట గురుచరణ్, కొమ్మునూరు విదిత్‌కుమార్‌లు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారని, అలాగే ప్రతి సంవత్సరం పాఠశాల నుంచి ఎంపికవుతున్నట్లుగా తెలిపారు. ఈ పరీక్షలు రాయడానికి విద్యార్థులను ప్రోత్సహించడంతోపాటు అవసరమైన మెటీరియల్స్, ఫీజులను ఉచితంగా ఉపాధ్యాయుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య అందిస్తున్నట్లు తెలిపారు. మరో ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ కూడా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.12వేల చొప్పున 5 సంవత్సరాల వరకు విద్యార్థుల ఖాతాల్లో నగదుపడుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.


వెంకటగురుచరణ్

కబ్జాదారులొస్తున్నారు.. తస్మాత్ జాగ్రత్త

- టీడీపీ నీడకు భూఆక్రమణదారులు
- బదిలీల సిఫార్సులతో దందాకు శ్రీకారం
- నిశితంగా గమనిస్తున్న ప్రజలు

మార్కాపురం, జూన్ 14: అధికారంలోకి వచ్చిన టీడీపీ నాయకులు నిరంతరం అప్రమత్తంగా ఉండి జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మార్కాపురంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ కాలంలో మార్కాపురం నియోజకవర్గం భూఆక్రమాలకు చిరునామాగా పేరుగాంచింది. వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుల వ్యవహారశైలితో అంతటి అపకీర్తి వచ్చిందనడంలో సందేహం లేదు. అందుకు రెవెన్యూ సిబ్బంది సహకరించడం, పత్రికలలో కథనాలు రావడం వంటి పరిణామాలతో మార్కాపురం ప్రాంతంలో రెవెన్యూ అక్రమాలు వెలుగు చూశాయి. చివరకు 14 మంది గ్రామ రెవెన్యూ అధికారులు, ఒక ఆర్‌ఐ సస్పెండ్ కావడం, బాధ్యుడైన తహసీల్దార్ అరెస్టు వంటి ఘటనలు పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టాయి. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సైతం మార్కాపురం వచ్చినప్పుడు మార్కాపురంలో వైసీపీ నాయకులు భారీగా భూఆక్రమాలకు పాల్పడ్డారని, వారిని చోటా నయీం ముఠాతో అభివర్ణించాడు.

టీడీపీ నీడకు భూఅక్రమార్కులు

రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికార వైసీపీలో అభ్యర్థుల బదిలీ చోటుచేసుకొంది. నాటి అధికార వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన కుందురు నాగార్జునరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై ఉన్న అవినీతి ఆరోపణల నేపథ్యంలో గిద్దలూరు నుంచి పోటీలో నిలిచారు. దీంతో భూఅక్రమాలకు కారణమైన వారు దిక్కుదోచక పోటీలో ఉన్న అభ్యర్థుల సామాజికవర్గాలలో తేడాలను కారణంగా చూపి టీడీపీ నీడకు చేరారు. వారంతా బయటకు టీడీపీలో ఉన్నట్లు కనబడుతూనే వైసీపీ నాయకులతో చీకటి వ్యవహారాలు నడిపారు. ఓట్లకోసం టీడీపీ నాయకులు సైతం వచ్చిన ప్రతి ఒక్కరినీ పార్టీలోకి ఆహ్వానించారు. ఇదే సమయంలో టీడీపీ తుఫాను సృష్టించి అధికారం చేజిక్కించుకొంది. మార్కాపురంలో కూడా టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి విజయం సాధించారు.

ప్రారంభమైన బదిలీల సిఫార్సులు

ఎన్నికల సందర్భంగా టీడీపీ నీడకు చేరిన భూఅక్రమార్కులు రెవెన్యూ అధికారుల బదిలీల సిఫార్సులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా రెవెన్యూ సిబ్బందిని తమకు అనుకూలమైన వారిని నియమించుకుంటే అన్నీ పనులు సాఫీగా జరిగిపోతాయన్న ఆలోచనతో వారున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేగా గెలుపొందినవారు ప్రమాణస్వీకారం చేయకముందే తమకు నచ్చిన, తాము చెప్పే పనుల చేసే అధికారులకు బదిలీల హామీలు ఇచ్చేస్తున్నారు. వారు రాగానే పూర్తి చేయాల్సిన పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

గమనిస్తున్న ప్రజలు

మార్కాపురంలో నెలకొన్ని రాజకీయ పరిస్థితులను, నాయకుల వ్యవహార శైలిని ప్రజలు క్షుణ్ణంగా గమనిస్తున్నారు. భూఅక్రమాలు జరిగినప్పుడు ప్రతిపక్షనాయకులుగా ఉన్నవారు ప్రస్తుతం అధికారపక్షానికి వచ్చారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ ప్రభుత్వ హయంలో జరిగిన భూ అక్రమాలపై సమగ్ర విచారణ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో బాధితులకు ఏమాత్రం న్యాయం జరుగుతుందోనని ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా కొందరు భూఅక్రమార్కులు నేరుగా ఎమ్మెల్యేను కలువకుండా ఆయన ముఖ్య అనుచరగణానికి, కుటుంబసభ్యులకు ఆశల ఎర వేస్తున్నారు. తద్వారా తమ వ్యవహారాలను చక్కబెట్టుకునే పనిలో ఉన్నారు. రాగద్వేషాలను తావివ్వనని ఇటీవల కాలంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలలో గొంతెత్తిచాటిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనను ఎన్నుకున్న మార్కాపురం నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీని ఏ మాత్రం నిలుపుకుంటాడో వేచి చూడాలి.

అవీ..ఇవీ..

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

- ఎరువులు, విత్తన విక్రేతలకు ఏవో బుజ్జిబాయ్ సూచన


రికార్డులు పరిశీలిస్తున్న ఏవో

పెద్దారవీడు, జూన్ 14: ఎరువులు, పురుగుమందుల డీలర్లు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని మండల వ్యవసాయాధికారి బుజ్జిబాయ్ అన్నారు. మండలంలోని కుంట గ్రామంలో ఎరువులు, విత్తనాల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణాలలో లైసెన్స్‌లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ డీలర్లు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు అందజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ విక్రయించిన ప్రతి వస్తువుకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. తక్కువ ధరలకే విత్తనాలు, పురుగుమందులు ఇస్తామని చెప్పే మాయమాటలను రైతులు నమ్మవద్దన్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ల నుంచే కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత


మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

గిద్దలూరు, జూన్ 14 : ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పని చేయాలని మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య అధికారులను కోరారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ఛైర్మన్ మాట్లాడుతూ రుతుపవనాలు సకాలంలో వచ్చి కొద్దిమేర వర్షాలు పడడంతో కొన్ని బోర్లకు రీచార్జ్ అయ్యాయన్నారు. నీరు రావడం వలన పట్టణంలో నీటిసమస్య తగ్గిందని పేర్కొన్నారు. అయినప్పటికీ మరికొన్ని ప్రాంతాలలో బోర్లకు నీరు రాక నేటికీ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. ప్రజలకు సరిపడినంత నీటిని అందించాలని ఆదేశించారు. మురికినీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ దోమల వృద్ధిని తగ్గించాలని సిబ్బందిని కోరారు. అజెండాలో పేర్కొన్న అన్ని అంశాలపై సభ్యులు ఏకగ్రీవం గా ఆమోదం తెలిపారు. వైస్‌ఛైర్మన్లు ఆర్‌.డి.రామక్రిష్ణ, దీపిక, కమిషనర్ శ్రీనివాసరావు, టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు


కేకు కట్ చేస్తున్న కార్మికులు

పొదిలి, జూన్ 14 : ఎన్‌డీఏ కూటమిలో జన సేన నేత పవన్‌కల్యాణ్ అఖండ మెజారిటీతో గెలు పొందడంతో పాటు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఆనందంగా ఉందని మార్తాబత్తిన సాములు అన్నారు. పొదిలిలో శుక్రవారం భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడి పాలనలో అభివృద్ధితో పాటు యువతకు, మహిళలకు భరోసా ఉంటుందన్నారు. ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వంలో చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కష్టాలు తీరనున్నాయన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీల కూటమికి ప్రజలు తిరుగులేని విజయాన్ని అందించారని ఓట్లు వేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేకును కట్‌చేసి కార్మికులకు పంచిపెట్టడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెద్ద దోర్నాల, జూన్ 14: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సంజీవ్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా వైద్యాధికారి సీహెచ్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సంజీవ్ మాట్లాడుతూ.., సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రధానంగా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. దోమలకు ఆలవాలైన మురికి గుంటలు ఇంటి పరిసరాలలో లేకుండా చూడాలన్నారు. దోమ తెరలను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఇస్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

- ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కోత

ఎర్రగొండపాలెం, జూన్ 14 : ఎర్రగొండపాలెం, మిల్లంపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో నేడు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీ టి.అల్లూరయ్య తెలిపారు. ఎర్రగొండపాలెం మిల్లంపల్లి 33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు తెలిపారు. వినియోగదారులు ఈ అసౌకర్యానికి సహకరించాలని తెలిపారు. గృహ వినియోగదారులు ముందుగానే ప్రణాళికలు వేసుకోవాలన్నారు.

వైద్య సిబ్బంది రక్తదానం


రక్తదానం చేస్తున్న వైద్యసిబ్బంది

మార్కాపురం రూరల్, జూన్ 14: స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రాజమున్నార్, సూపరింటెండెంట్ సావిత్రిల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో వైద్యశాలలో పనిచేసే సిబ్బందితో పాటు సెక్యూరిటీ, వివిధ విభాగాల ఉద్యోగులు 40 మంది రక్తదానం చేశారు. పూర్వ జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.సుబ్బారెడ్డి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డిప్యూటీ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ మేజర్ రాంబాబు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ కె.వంశీకృష్ణ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సయ్యద్ అబ్దుల్ వాజిద్, పలువురు వైద్య నిపుణులు, ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు, బేస్తవారిపేట ప్రైమరీ హెల్త్ సెంటర్ సీహెచ్‌వో అబిబ్ ఖాన్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, శానిటరీ వర్కర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సెక్యూరిటీ సిబ్బంది రక్తదానం చేశారు. ఇన్‌చార్జ్ పేథాలజీ డిపార్ట్‌మెంట్ ప్రధాన ఆచార్యులు డాక్టర్ కె.మారుతీదేవి వీరిని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ బీసీ శార్వాణి, డాక్టర్ నీలిమ ప్రియదర్శిని, డాక్టర్ శాంతిప్రియ, డాక్టర్ శ్రీకాంత్, బ్లడ్ బ్యాంకు ల్యాబ్ టెక్నీషియన్లు కె.రవికుమార్, ఆర్.ఆంజనేయులు, ఎంవీ శివశంకర్, స్టాఫ్ నర్సులు బి.లక్ష్మీప్రసన్న, సత్యవాణి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే సీజ్


బస్సును తనిఖీ చేస్తున్న ఆర్‌టీవో రవికుమార్

పొదిలి, జూన్14: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు తిప్పితే ఆ వాహనాలపై కేసు నమోదు చేసి సీజ్ చేస్తామని దర్శి రవాణా శాఖ అధికారి రవికుమార్ అన్నారు. శుక్రవారం పొదిలిలో పలు ప్రైవేటు బస్సులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల బస్సులను కూడా తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఫిట్‌నెస్ లేకుండా, ట్యాక్స్ కట్టకుండా తిరుగుతున్న పలు స్కూల్ బస్సులపై కేసునమోదు చేశారు. రూ.90వేల జరిమానా విధించారు. పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లే బస్సులు పూర్తి కండీషన్‌తో రోడ్లపై తిప్పాలని, లైసెన్స్ కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలన్నారు.

బీసీ బాలికల వసతి గృహం ఏర్పాటుకు వినతి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 14: డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో బీసీ బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు పిన్నిక లక్ష్మీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మార్కాపురంలోని బాలికల ఉన్నత పాఠశాల, తదితర పాఠశాలలు, కళాశాలల్లో దాదాపు 200 మందిపైగా చదువుకుంటున్నారన్నారు. బీసీ హాస్టల్ లేని కారణంగా పాఠశాల స్థాయిలోనే చదువు మానుకుని వెళ్లిపోతున్నారన్నారు. తాము సబ్ కలెక్టర్‌ను కలిసి బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మార్కాపురంలో బీసీ బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

మార్కాపురం, జూన్ 14: పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను శుక్రవారం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.24,640లు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ కథనం మేరకు.., స్థానిక పెద్దనాగులవరం రోడ్డులోని ఓ గృహంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేయగా ఆ గృహంలో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

పాఠశాల వద్ద అధ్వానంగా పారిశుధ్యం


బోడపాడులో ప్రభుత్వ పాఠశాల వద్ద నిల్వ ఉన్న మురుగునీరు

మార్కాపురం రూరల్, జూన్ 14: పరిశుభ్రంగా ఉండాల్సిన పాఠశాల ఆవరణలు అధికారుల నిర్లక్ష్యంతో మురుగు నీటి నిల్వతో దుర్గంధం వెదజల్లుతోంది. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే సమయం కావడంతో పాఠశాలలు, ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మండలంలోని బోడపాడు గ్రామ మండల పరిషత్ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల వద్ద మురుగు నీటి నిల్వ ఉండడంతో నీటి కుంటలా తయారైంది. ఆ పరిశుభ్ర వాతావరణంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ నెల 13వ తేదీ నుంచి పాఠశాలలు ప్రారంభంకావడంతో విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలి విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. గ్రామస్థాయి, మండల స్థాయి అధికారులకు గతంలో ఈ సమస్యపై ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ, ఈ ఎటువంటి స్పందనరాలేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆశావర్కర్ల తరగతులు జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రాఘవమ్మ

పొదిలి, జూన్ 14 : పొదిలిలో ఈ నెల 30, జూన్ 1న జరిగే ఆశావర్కర్ల జిల్లా తరగతులను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఐవి రాఘవమ్మ కోరారు. పొదిలి ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా తరగతులు జయప్రదానికి సన్నాహకంగా యూనియన్ నాయకురాలు యస్ పద్మా అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశావర్కర్లపై రోజురోజుకు పనిభారం పెరుగుతోందన్నారు. ఆశాలకు ఏమాత్రం సంబంధం లేని విలేజ్ హెల్త్ క్లీనిక్, సచివాలయంలో స్వీపింగ్, క్లీనింగ్ చేయించడం దుర్మార్గమన్నారు. ఫీల్డ్ వర్క్ కాకుండా రోజు విలేజ్ హెల్త్ క్లీనిక్స్, సచివాలయాల్లో విధులను చేయాలనటం ఆశాల ప్రాథమిక విధులకు విఘాతం కలుగుతోందన్నారు. ఆశాల సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఆశాల సమస్యలపై చర్చించటానికి జరిగే జిల్లా క్లాసుల్లో ఆశాలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నియంతృత్వ వైఖరితో ఆశాల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ఆశాల పెండింగ్ సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఆశాలకు కనీస వేతనాలు అమలు చేసి , ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్ల యూనియన్ పొదిలి, మర్రిపూడి మండలాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ నిర్వహించుకోవాలి

మార్కాపురం, జూన్ 14: బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మార్కాపురం సీఐ ఆవుల వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక సీఐ కార్యాలయంలో శుక్రవారం ముస్లిం మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో గోవధ నిషేధ చట్టం అమల్లోవున్న నేపథ్యంలో గోవులను వధించరాదన్నారు. ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

ట్రాక్ రిపేరుతో రాచర్ల రైల్వేగేటు మూత

- పాములపల్లి గేటు నుండి ట్రాఫిక్ మళ్లింపు
- వాహనచోదకులకు ఇక్కట్లు

గిద్దలూరు, జూన్ 14 : పట్టణంలోని రాచర్ల రైల్వేగేటును ట్రాక్ రిపేరు కారణంగా రైల్వేశాఖ అధికారులు రెండు రోజులపాటు మూసివేశారు. శుక్రవారం ఉదయం ట్రాక్ రిపేరు పనులు మొదలు కావడంతో పట్టణంలోని రాచర్ల రైల్వేగేటును తాత్కాలికంగా మూసివేశారు. శనివారం రాత్రి 10గంటల వరకు పనుల కారణంగా రైల్వేగేటు వెంబడి రాకపోకలు అనుమతివ్వబోమని ఇంజనీరింగ్ అధికారులు ప్రకటించారు. ప్రత్యామ్నాయంగా ఈ గేటుకు సమీపంలో ఉన్న పాములపల్లి రైల్వే గేటు నుంచి రాకపోకలు సాగించాలని సూచించారు. అటు రాచర్ల గేటు, ఇటు పాములపల్లి గేటు రెండు గేట్ల ట్రాఫిక్ ఒక్కసారిగా పాములపల్లి గేటు నుంచి కొనసాగించాల్సి రావడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. పెద్దవాహనలు వచ్చిన సందర్భాలలో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. దానికితోడు ఈ రెండు గేట్ల మధ్య కేవలం మట్టిరోడ్డు మాత్రమే ఉండడంతో ఈ రోడ్డు గుంతలమయమై ఉండడంతో వాహనచోదకులు పడరానిపాట్లు పడ్డారు.


పాములపల్లి రైల్వే గేటుకు వస్తున్న వాహనాలు


పాములపల్లి రైల్వేగేటు వద్ద ట్రాఫిక్

ఎన్నికల వాగ్దానాలపై మొదటి రోజే సంతకం

- ఐదు వాగ్దానాల అమలుపై సంతకం చేసిన సీఎం
- చంద్రబాబునాయుడికి ఎరిక్షన్‌బాబు కృతజ్ఞతలు

ఎర్రగొండపాలెం, జూన్ 14 : ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఐదు వాగ్దానాలపై సీఎంగా బాధ్యతలు స్వీకరించిన మొదటిరోజు సంతకం చేసి చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. బీఈడీ చదువుకొని ఉద్యోగాలు లేక వయస్సు మీరిపోతున్న నిరుద్యోగ యువత కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీపై మొదటి సంతకం చేశారన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 16347 ఉపాధ్యాయ పోస్టులను తద్వారా భర్తీ చేయనున్నార న్నారు. రైతులకు నష్టం చేసే ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దుకు 2 వ సంతకం చేశారన్నారు. అవ్వ తాతల వృద్ధాప్య ఫించన్లు రూ.3వేల నుంచి రూ.4 వేలకు, దివ్యాంగుల ఫించన్లు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు, జగన్ తొలగించిన అన్న క్యాంటిన్‌ల పునర్ధరణపై సంతకాలు చేసి మాట నిలుపుకున్నారన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకోవడంతో అమరావతి రాజధానికి దివ్యమైన వెలుగు వచ్చిందని అన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతానని, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాదు, టీడీపీ నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, కంచర్ల సత్యనారాయణగౌడ్, మంత్రునాయక్, బీవీ.సుబ్బారెడ్డి, కాకర్ల కోటయ్య, గోళ్ల సుబ్బారావు, అనుమాలశెట్టి సుబ్బారావు, చీదెళ్ల నాగేశ్వరరావు, తోట మహేష్ , నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ముడివేములలో బీటీ రోడ్డు పనులు ప్రారంభం

తీరనున్న ప్రయాణికుల వెతలు

త్రిపురాంతకం, జూన్ 14: ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న ముడివేముల రోడ్డు నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. మండలంలోని కంకణాలపల్లి నుండి కంకణాలపల్లి ఎస్సీ కాలనీ, ఒడ్డుపాలెం, పాపన్నపాలెం, పాత ముడివేముల వరకు సుమారు 5.9 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పనులు ఇటీవల ప్రారంభించారు. సుమారు పాతికేళ్ల క్రితం నిర్మించిన బీటీ రోడ్డు పూర్తిగా చిద్రమై మోకాళ్లలోతు గుంతలతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో ఈ రోడ్డులో అనేక ప్రమాదాలు జరిగాయి. ఆరు కిలోమీటర్ల దూరం ప్రయాణం సుమారు గంట సమయం పట్టేది. దీంతో కొన్నేళ్లుగా ఆయా గ్రామాల ప్రజలు నూతన రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతుండడంతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గతేడాది ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజనలో రూ.3.62 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఇటీవలే టెండర్లు పూర్తి చేసేకున్న గుత్తేదారులు మూడు నెలల క్రితం రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలగించి పాడైపోయిన రోడ్డును చదును చేశారు. కాగా గత మూడు రోజుల నుండి నూతన రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. కంకర చిప్స్, డస్ట్ వంటివి తోలి రోడ్డును చదును చేస్తున్నారు. యంత్రాల సహాయం తో రోడ్డును వేస్తూ, రోలర్ పనులు చేస్తున్నారు. రోడ్డు నిర్మాణాన్ని సుమారు నెలరోజులలో పూర్తి చేసే అవకాశం ఉందని గుత్తేదారు తెలిపారు. ఈరోడ్డు నిర్మాణం పూర్తయితే కంకణాలపల్లి, ఎస్సీ కాలనీ, పాపన్నపాలెం, ఒడ్డుపాలెం, పాతముడివేముల, కొత్తముడివేముల గ్రామాల ప్రజలకు ప్రయాణ వెతలు తీరుతాయి. దీనికి తోడు పాతముడివేముల సమీపంలో గుండ్లకమ్మ నదిపై పలు గ్రామాల ప్రజలు సొంత నిధులతో వంతెన ఏర్పాటు చేసిన నేపథ్యంలో త్రిపురాంతకం నుంచి కురిచేడు, దర్శి వెళ్లే ప్రయాణికులకు, దర్శి, కురిచేడు నుంచి త్రిపురాంతకం, ఎర్రగొండపాలెం వెళ్లే ప్రయాణికులకు ఎంతో ఉపయోగం ఉంటుంది. ఇప్పటి వరకు ఇలా వెళ్లాలి అంటే రోడ్డు సక్రమంగా లేకపోవడంతో వినుకొండ అడ్డరోడ్డు మీదుగా వెళ్లాల్సి వస్తోంది.


నూతనంగా వేస్తున్న రోడ్డుపై పరిచిన కంకర డస్ట్

అశోక్‌రెడ్డికి అభినందనల వెల్లువ

గిద్దలూరు టౌన్, జూన్ 14 : ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో అశోక్ రెడ్డిని బీజేపీ నాయకులు కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు అబ్బిశెట్టి ఉదయ్‌శంకర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భవనాశి వెంకట రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె.వి. నారాయణ, జిల్లా ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి మట్టె మల్లయ్య, నియోజకవర్గ ఎస్సీ మోర్చ ఇన్‌చార్జి బండారి జయప్రసాద్ తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో శాసనసభ్యునిగా ఉన్నప్పటి కంటే రెట్టింపుగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

వీఆర్‌ఏల సమస్యలపై దృష్టి సారించండి

వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని వీఆర్‌ఏల అసోసియేషన్ నాయకులు ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆంజనేయులు ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వీఆర్‌ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీ.హెచ్. శ్రీనివాసులు, డి.నాగరాజు, ఎస్.అల్లూరయ్య, పద్మావతి, వెంకటయ్య, నర సింహులు, హుస్సేన్, రంగస్వామి, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సబ్‌కలెక్టర్, కమిషనర్

ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని సబ్ కలెక్టర్ నాగజ్యోతి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆర్‌వోగా వ్యవహరించిన నాగజ్యోతి, ఈఆర్‌వోగా శ్రీనివాసులు నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించారని ఎమ్మెల్యే అన్నారు.

ముత్తుములతో మార్కాపురం జిల్లా సాధన సమితి సభ్యులు

మార్కాపురం జిల్లా సాధన సమితి సభ్యులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. రాష్ట్రంలో జిల్లాలు ఏర్పడే సమయంలో మార్కాపురం జిల్లా కోసం తామంతా నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మార్కాపురాన్ని జిల్లాగా చేస్తామని చంద్రబాబు ప్రకటించడం హర్షనీయమన్నారు. త్వరగా జిల్లా ఏర్పాటయ్యేలా చొరవ చూపాలని వారు అశోక్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సభ్యులు శివపురం మురళి, శివారెడ్డి, బాలీశ్వరయ్య, షానేషావలి తదితరులు పాల్గొన్నారు.


ముత్తుములకు అభినందనలు తెలుపుతున్న అశోక్‌రెడ్డి

నేడు మోపాడులో శాంతి కల్యాణం


మోపాడులోని స్వామి మూలవిరాట్ విగ్రహాలు

పామూరు, జూన్ 14: మండలంలోని మోపాడు గ్రామంలోగల శ్రీ కోదండరామస్వామి దేవస్థాన వార్షికోత్సవ సందర్భంగా శనివారం శీసీతారామస్వామి వార్ల కల్యాణం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ నిర్వాహకులు తెలిపారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ఏపీటీఎఫ్ లక్ష్యం


హెచ్ఎం ఈసాక్‌కు సభ్యత్వం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పామూరు, జూన్ 14: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఏపీటీఎఫ్ పనిచేస్తుందని ఆసంఘం జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ అన్నారు. ఉపాధ్యాయులు సంఘంలో సభ్యులుగా చేరి సహకరించాలని కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో సభ్యత్వాల నమోదు కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. గత ప్రభుత్వం పీఆర్సీ తీవ్ర అన్యాయం చేసినప్పుడు ముందుగా ఖండించి ఉద్యమానికి పిలుపునిచ్చిందని ఏపీటీఎఫ్ అని ఆయన పేర్కొన్నారు. సభ్యత్వ నమోదులో భాగంగా బోడవాడ, అయ్యవారిపల్లి, కంభాలదిన్నె, బొట్లగూడూరు, కోడిగుంపల, ఇనిమెర్ల, లక్ష్మీనరసాపురం, ఇనిమెర్ల పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పి.బాలాంజనేయులు, మచ్చ ప్రసాద్, మాల్యాద్రి, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటికి అభినందనలు తెలిపిన తాళ్లూరు తెలుగు తమ్ముళ్లు


మంత్రి రవికుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న తాళ్లూరు టీడీపీ నేతలు

తాళ్లూరు, జూన్ 14: రాష్ట్రమంత్రిగా నియమితులైన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను తాళ్లూరు మండల తెలుగుతమ్ముళ్లు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అద్దంకి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించి చంద్రబాబు క్యాబినెట్‌లో మంత్రిగా నియమితులుకావటంతో తాళ్లూరు తెలుగు తమ్ముళ్లు అద్దంకిలోని ఆయన కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసిన వారిలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యవర్గసభ్యుడు వల్లభనేని సుబ్బయ్య, గుమ్మడి సాయిబాబా, షేక్ మీరామొహిద్దీన్, కనిశెట్టి రామలక్ష్మయ్య, కైపు రామకోటిరెడ్డి, చంద్రగిరి శివారెడ్డి, పుల్లారెడ్డి, గిరి, ఎం. సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

అక్రమార్కులపై ఇప్పుడైనా చర్యలు తీసుకుంటారా!

- అటవీశాఖ నిధుల గోల్‌మాల్‌పై పట్టించుకోని అధికారులు
- విచారణను వదిలేసిన వైనం


దర్శి పల్లెవనం పార్క్

దర్శి, జూన్ 14: అటవీశాఖ నిధులు గోల్‌మాల్‌కు బాధ్యులైన వారిపై ఇప్పుడైనా చర్యలు తసుకుంటారో, లేదోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో విచారణ పేరుతో కాలయాపనచేస్తూ ఉన్నతాధికారులు అక్రమార్కులకు కొమ్ముకాస్తూ వచ్చారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో నిధులు గోల్‌మాల్ చేసిన వారిపై చర్యలు తీసుకుంటారని భావిస్తున్నారు. దర్శి పట్టణంలోని ఎన్టీఆర్ పల్లెవనం పార్క్ అభివృద్ధి పనులకు 2023 జనవరిలో రూ.45 లక్షల నిధులు విడుదల చేశారు. ఆ నిధులను 2023 మార్చిలోపు ఖర్చుచేయాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యవైఖరి అవలంబించారు.

మార్చి నెలలో ఎలాంటి పనులు చేయకుండా పల్లామల్లి సొసైటీ ద్వారా కొంతమంది అటవీశాఖ అధికారులు మార్చుకున్నారు. స్థానిక బీట్ ఆఫీసర్ ద్వారా ఆ పనులు నిర్వహించాల్సి ఉంది. అయితే, స్థానిక అధికారికి తెలియకుండా, ఎలాంటి పనులు చేయకుండా మొత్తం నిధులను డ్రా చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక బీట్ ఆఫీసర్ జిల్లా ఉన్నతాధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారులు తొలివిడతగా వచ్చి చూసి వెళ్లారు. ఆతర్వాత నిధులు మార్చుకున్న అధికారులు హడావుడిగా కొంతమేర పనులు చేశారు. ఆతర్వాత స్క్వాడ్ డీఎఫ్‌వో మారుతీప్రసాద్ పరిశీలనకు వచ్చారు. ఆతర్వాతైనా అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారని భావించారు. అటవీశాఖ ఉన్నతాధికారుల మధ్య ఏం జరిగిందోకాని ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇక్కడకు వచ్చిన ఉన్నతాధికారులను నిధులు గోల్‌మాల్‌పై గతంలో ప్రశ్నించినప్పుడు ఎప్పుడో ఒకప్పుడు పనులు పూర్తి చేశారుగా, ఆవిషయాన్ని వదిలేయండి అంటూ సమాధానం ఇచ్చారు. దీంతో విచారణను గాలికి వదిలేశారని స్పష్టమైంది. వైసీపీ ప్రభుత్వంలో తప్పుచేసిన అధికారులపై చర్యలు తీసుకోరనే భావనతో కిందిస్థాయి అధికారులు ఇంతకాలం మౌనంగా ఉన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో విచారణ వేగవంతం అవుతుందని భావిస్తున్నారు. కొత్త అధికారులు బాధ్యతలు చేపట్టిన తర్వాత పనులు చేయకుండా నిధులు డ్రా చేసిన విషయం, ఆతర్వాత అరకొర పనులతో సరిపెట్టిన విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారని ప్రజలు భావిస్తున్నారు.

ఎన్టీఆర్ పేరును మళ్లీ ఏర్పాటుచేయాలి



నాడు ఎన్టీఆర్ పేరుతో ఏర్పాటుచేసిన పల్లెవనం పార్క్ బోర్డు

స్థానిక ఎన్టీఆర్ పల్లెవనం పార్క్ నేమ్‌బోర్డులో తొలగించిన ఎన్టీఆర్ పేరును మళ్లీ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో దర్శి-కురిచేడు రోడ్డులో ఎన్టీఆర్ పల్లెవనం పార్క్‌ను సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఆతర్వాత వైసీపీ అధికారంలోకి రావటంతో పాలకుల ఒత్తిడి మేరకు బోర్డులో ఎన్టీఆర్ పేరును తొలగించారు.

ప్రస్తుతం పల్లెవనం పార్క్‌గా మాత్రమే కనిపిస్తుంది. పార్క్ ఏర్పాటు సమయంలో గజిట్‌లో ఎన్టీఆర్ పల్లెవనం పార్క్‌గా రాశారు. అయినప్పటికీ పాలకులు ఉద్దేశపూర్వకంగా ఎన్టీఆర్ పేరును తొలగించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మళ్లీ ఎన్టీఆర్ పేరును ఏర్పాటుచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చిన్నగుడిపాడులో చోరీ

- రూ.50 వేల నగదు, మూడు సవర్ల బంగారం చోరీ


బీరువాను పొలంలోకి తీసుకెళ్లి పగులకొట్టిన దొంగలు

దొనకొండ, జూన్ 14: మండలంలోని చిన్నగుడిపాడుపాడు గ్రామంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన చౌదల కృష్ణారెడ్డి, నాగలక్ష్మ్మ దంపతులు ఇంటికి తాళం వేసి వరండాలో పడుకున్నారు. దొంగలు ఇంటికి వెనుకవైపున ఉన్న కిటికీకి ఉన్న ఐరన్ గ్రిల్ చాకచక్యంగా తీసి కిటికీలో నుంచి లోపలకు ప్రవేశించారు. ముందు తలుపునకు లోపల గడిపెట్టి వెనుకవైపు తలుపు తీసుకొని ఇంటిలోని బీరువాను సమీపంలోని పొలంలోకి తీసుకెళ్లారు. అక్కడ బీరువాను పగులగొట్టి అందు లో ఉన్న రూ.50 వేలు నగదు, మూడు సవర్లు బంగారు ఆభరణం దోచుకెళ్లారు. ఉదయం నిద్రలేచిన కృష్ణారెడ్డి తలుపులు లోపల వేసి ఉండటం చూసి దొంగతనం జరిగిన విషయం గుర్తించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై సంపత్‌కుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒంగోలు క్లూస్ టీం సిబ్బంది పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కల్పించాలి

- వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర
- సౌకర్యాల లేమిపై ఆగ్రహం


డయాలసిస్ సేవలపై రోగులను అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూన్ 14: ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకాన్ని కల్పించే విధంగా వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. డయాలసిస్ కేంద్రంలోకి వెళ్లి రోగులను పరామర్శించారు. కేంద్రంలో అందుతున్న సేవలపై వారిని విచారించారు. రాత్రి సమయాల్లో డయాలసిస్ కోసం వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారు వెళ్లేందుకు వాహన సౌకర్యం ఏర్పాటుచేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. గతంలో కేంద్రంలో జనరేటర్ వసతి లేక రోగులు నానా ఇబ్బందులు పడిన విషయాన్ని గుర్తుచేస్తూ అలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల వార్డులో చిన్నపిల్లలకు ఊయల లేకపోవటం గమనించి వాటిని ఏర్పాటుచేయాలన్నారు. ఆక్సిజన్, వాటర్‌ప్లాంట్ పరిశీలించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. స్వల్ప వ్యాధులకు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లాలని వైద్యులు చెప్తునట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇక నుంచి అలాంటి వాటికి స్వస్తి చెప్పాలన్నారు. లేదంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని డాక్టర్ ఉగ్ర హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, బాలు ఓబులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న దర్శి దివ్యాంగులు

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

దర్శి జూన్ 14: విభిన్న ప్రతిభావంతులకు పింఛన్ రూ.6వేలు, వృద్ధులకు రూ.4 వేలకు టీడీపీ కూటమి ప్రభుత్వం పెంచటాన్ని హర్షిస్తూ దర్శి నియోజకవర్గానికి చెందిన విభిన్న ప్రతిభావంతులు తాడేపల్లిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేశారు. రాష్ట్రమంత్రి ఎస్.సవితమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ ప్రతిభావంతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు టి.ఓబయ్య, రాష్ట్ర కార్యదర్శి సందు వెంకటరావు, ఎనుమల ఏడుకొండలు, షేక్ బాషా, తదితరులు పాలభిషేకం చేశారు.

ఈసందర్భంగా వారు మా ట్లాడుతూ సీఎం చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. కార్యక్ర మంలో తెలుగు యువత నాయకుడు రవినాయుడు, నారా ప్రశాంత్, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

ఏఎంసీ వైస్‌చైర్మన్ రాజీనామా

దర్శి జూన్ 14: దర్శి ఏఎంసీ వైస్‌చైర్మన్ కండే గంగయ్య గురువారం రాజీనామా చేశారు. ఆయనతో పాటు పలువురు సభ్యులు కూడా రాజీనామా చేశారు. చైర్మన్ షేక్ షకీలా నాలుగురోజుల క్రితం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈరోజు మొత్తం కార్యవర్గం రాజీనామా చేయటంతో నూతన కార్యవర్గం ఏర్పాటుకు త్వరలో రంగం సిద్ధం చేసే అవకాశం ఉంది.

ముందుకు కదలని మురుగు

- దుర్గంధం, దోమలతో అల్లాడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

దొనకొండ, జూన్ 14: దొనకొండలోని వీవీపురం బజారులోని ప్రధాన ర హదారి పక్కన గత కొన్ని నెలలుగా మురుగునీరు ముందుకు కదలడం లేదు. దీంతో రోడ్డుపైకి చేరుతున్నాయి. భరించలేని దుర్వాసన వస్తుండటంతోపాటు దోమలకు నిలయమై ప్రజలు రోగాల బారిన పడేందుకు కారణమవుతుంది. పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ వైద్యశాల, కెనరా బ్యాంక్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై మురుగునీరు నిలచి రోడ్డుపైకి పారుతున్నా నిత్యం ఆ రహదారిపై రాకపోకలు జరిపే పాలకులు, అధికారులు పట్టించుకోని నిర్లక్ష్య వైఖరిని ప్రజలు విమర్శిస్తున్నారు. సైడుకాల్వలు లేకపోవటంతో వీధిలో నుంచి వచ్చిన మురుగునీరు మలుపు వద్ద నిలవటంతో పందులు సంచరిస్తుండటంతో విపరీతమైన దుర్వాసనలు వెదజల్లుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. తాము మురుగునీటితో సహవాసం చేయాల్సిన దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయని, ఎటువంటి ప్రాణాపాయ రోగాలు ప్రబ లుతాయోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం వర్షాలు కు రుస్తున్న సమయంలో నిల్వఉన్న ఈ మురుగునీటిలోని దోమలతో ఎటువంటి వ్యాధులు సోకుతాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మురుగునీటి సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరిస్తు న్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీకి ఆదాయం వస్తున్నా పాలకులు, అధికారులు కనీసం డ్రైనేజీ సమస్య పరి ష్కరించటం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు కలుగ జేసుకొని ప్రజలు రోగాల బారిన పడకముందే సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

మరమ్మతులకు నోచుకోని డీప్‌బోరు

- నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని గ్రామపంచాయతీ అధికారులు


కొత్తపాలెంలో మూలనపడ్డ డీప్ బోర్

తాళ్లూరు, జూన్ 14: తాళ్లూరు పంచాయతీ కొత్తపాలెం గ్రామంలో డీప్‌బోర్‌కు మరమ్మత్తులు చేయకపోవటంతో ప్రజలు నీటిసమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి కోసం ప్రాథమిక పాఠశాల ఆవరణలో డీప్ బోర్ వేసి గ్రామానికి నీటిని సరఫరా చేస్తున్నారు. డీప్ బోర్ దాదాపు ఆరునెలల క్రితం చెడి పోయింది. మరమ్మతులు చేసేందుకు పైపులను, మోటార్‌ను బయటకుతీశారు. అప్పటినుంచి మోటార్‌ను బిగించక పోవటంతో గ్రామంలోని కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరాలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి రోజు మార్చిరోజు వచ్చే సాగర్ మంచినీటిని వాడుకుంటున్నారు. ఆనీటిని నిల్వ ఉంచుకుని అన్ని అవసరాలకు వాడుకుంటున్నారు. డీప్‌బోర్ మోటార్ మరమ్మతుల కోసం మోటార్‌ను తీసిన అధికారులు మరలా బిగించక పోవటంలోని అంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆరు నెలలుగా డీప్‌బోర్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా గ్రామ పంచాయతీ అధికారులు తమకేమి పట్టనట్లు మిన్నకున్నారని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు గైకొని డీప్ బోర్‌కు మరమ్మతులు జరిపించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

హామీలను అమలుచేసిన సీఎం

- నిబద్ధతకు మారుపేరు చంద్రబాబు
- ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జూన్ 14: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేర్చారని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శుక్రవారం రైతులు, నిరుద్యోగులు, వృద్ధులు, దివ్యాంగులు చంద్రబాబు ఐదు సంతకాలపై హర్షం వ్యక్తం చేస్తూ డాక్టర్ ఉగ్ర అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం కట్టుబడి మెగా డీఎస్సీపై సీఎం తొలి సంతకం చేశారన్నారు.


రైతులు, నిరుద్యోగులు, వృద్ధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

వైసీపీ ప్రభుత్వంలో ప్రజల మెడలకు ఉరితాడుగా మారిన లాండ్ టైటిల్ యాక్టును రద్దు చేస్తూ రెండో సంతకం చేసి ప్రజ లకు రక్షణ కల్పించారన్నారు. వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పెంచటమే కాకుండా అన్న క్యాంటీన్‌లను ప్రారంభించబోతున్నా రన్నారు. నిరుద్యోగుల ఉజ్వల భవిష్యత్తు కల్పించేందుకు నైపుణ్య గణనకు ఆమోదం తెలిపి అమలుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. సమావే శంలో టీడీపీ నేతలు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, రాచమల్ల శ్రీనివాసులు రెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), బొమ్మనబోయిన వెంగయ్య, రామారావు, నంబలు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలుచేయటం హర్షణీయం

ఎన్నికలకు ముందు ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చంద్రబాబు సంతకాలు చేయటం ఎంతో సంతోషంగా ఉందని రైతులు, వికలాంగులు, వృద్ధులు, నిరుద్యోగులు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఎదుట హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర రైతులు, వృద్ధులు, నిరుద్యోగుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో గెలిచి ప్రమాణస్వీకారం చేసిన వెంటనే మేనిఫెస్టోలోని మెగా డీఎస్సీ, లాండ్ టైటిల్ యాక్టు రద్దు, వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ అమలుకు శ్రీకారం చేయటం సీఎం చంద్రబాబు నిబద్ధతకు నిదర్శనమని వారు పేర్కొన్నారు.





బృహత్తర బాధ్యత

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ముగ్గురికి.. బాపట్ల జిల్లా పరిధిలోని ఒకరికి చంద్రబాబు క్యాబినెట్‌లో చోటు దక్కగా వారందరికీ కీలక శాఖలను కేటాయించారు. మంత్రివర్గ కూర్పులో మంగళగిరి, రేపల్లె, తెనాలి, అద్దంకి ఎమ్మెల్యేలకు పెద్ద పీట వేశారు. అదే సమయంలో శాఖల కేటాయింపులో కూడా అదే ప్రాధాన్యత లభించింది. లోకేశ్ మినహా నాదెండ్ల మనోహర్, అనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లకు తొలిసారిగా మంత్రి పదవులు దక్కాయి. అయినా వారికి సీఎం చంద్రబాబు కీలక శాఖలను అప్పగించి బృహత్తర బాధ్యత పెట్టారు. తమ నేతలకు మంత్రి పదవి దక్కడంతో పాటు కీలకమైన శాఖలను చంద్రబాబు కట్టబెట్టడంతో కూటమి పార్టీ శ్రేణులతో పాటు జిల్లావాసులు ఆనందంతో సంబరాలు చేసుకుంటున్నారు. ఐదేళ్లలో విధ్వంసం తప్ప అభివృద్ధి మాటెరుగని ఆయా రంగాల్లో ఇక మీదట పురోగతి కనబడుతుందనే ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ పతనానికి నాంది పలికి కూటమి విజయంలో కీలకపాత్ర పోషించిన నిర్ణయాలకు సంబంధించిన శాఖలు జిల్లా మంత్రులకు దక్కాయి. ఇక మీదట వీరు తీసుకునే ప్రతి నిర్ణయంపై ప్రజలు ఆసక్తి కనబరిచే అవకాశం ఉంది.

- జిల్లా మంత్రులకు కీలక శాఖలు
- ప్రాధాన్య శాఖలతో సర్వత్రా హర్షం
- జిల్లా వాసుల ఆశలన్నీ అమాత్యులపైనే
- నారా లోకేశ్‌కు మానవ వనరులతో పాటు ఐటీ శాఖ
- అనగాని సత్యప్రసాద్‌ను వరించిన రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు
- గొట్టిపాటి రవికి విద్యుత్..
- మనోహర్‌కు పౌరసరఫరాలు

గుంటూరు, తెనాలి, బాపట్ల (ఆంధ్రజ్యోతి), మంగళగిరి, జూన్ 14: రాష్ట్ర మంత్రి వర్గంలో మంత్రులకు శాఖల కేటాయింపు విషయంలో ఉత్కంఠతకు తెరపడింది. శుక్రవారం మంత్రుల శాఖలను వెల్లడించటంతో కూటమి శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది. చంద్రబాబు కేబినెట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల జిల్లాకు కీలక మంత్రిత్వ శాఖలు దక్కాయి. మొత్తం నలుగురికి మంత్రి వర్గంలో చోటు లభించిన విషయం తెలిసిందే. నలుగురిలో ముగ్గురు తొలిసారిగా మంత్రులయ్యారు. అయినా వారికి చంద్రబాబు కీలకశాఖలు అప్పగించారు. రాజధాని అమరావతిలో భాగమైన గుంటూరు, బాపట్ల లోక్‌సభ పరిధిలో మొత్తం నలుగురికి మంత్రులయ్యే అవకాశం దక్కింది. కీలకమైన మంత్రిత్వ శాఖలు దక్కడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు బాపట్ల జిల్లా అభివృద్ధి అమాత్యులపై పడింది. తమ శాఖల ద్వారా తమతమ నియోజకవర్గాలతో పాటు జిల్లా అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేసే అవకాశం వారికి దక్కింది. మంత్రులకు కీలక శాఖలు దక్కడంతో కూటమి పార్టీల శ్రేణులతో పాటు జిల్లావాసుల్లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తొలిసారిగా మంత్రులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ తమ నేతల మీద నమ్మకంతో కీలక శాఖలు కట్టబెట్టిన చంద్రబాబు నిర్ణయాన్ని ప్రజలు అభినందిస్తున్నారు. మంగళగిరి నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నారా లోకేశ్‌కు మాత్రమే మంత్రిగా చేసిన అనుభవం ఉంది. తెనాలి నుంచి ఎన్నికైన నాదెండ్ల మనోహర్, రేపల్లె నుంచి ఎన్నికైన అనగాని సత్యప్రసాద్, అద్దంకి నుంచి ఎన్నికైన గొట్టిపాటి రవికుమార్‌లకు మాత్రం తొలిసారిగా మంత్రి పదవి దక్కింది. అయితే వీరికి గతానుభవం లేకపోయినా చంద్రబాబు కీలక శాఖల బాధ్యతలు అప్పగించడం విశేషం. లోకేశ్ గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన ఐటీ శాఖను మళ్లీ అప్పగించి అదనంగా మానవ వనరుల అభివృద్ధి శాఖను కేటాయించారు. ఆయనకు గతంలో ఐటీ శాఖ నిర్వహించిన అనుభవం ఉంది. ఈ పరిస్థితుల్లో రాజధాని ప్రాంతంలో ఐటీ అభివృద్ధికి పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేకంగా కృషి చేసే అవకాశం ఆయనకు దక్కింది. ఎన్నికల ప్రచారంలో యువతకు ఉపాధిపై లోకేశ్ హామీలు ఇచ్చి ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల ద్వారా హామీలను నెరవేర్చే అవకాశం లోకేశ్‌కు వచ్చింది. ఇక తీర ప్రాంతం నుంచి ఎన్నికై చంద్రబాబు క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న అనగానికి రెవెన్యూ, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కేటాయించారు. ఇక వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ శాఖను అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు అప్పగించారు. గత ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిన విద్యుత్ రంగాన్ని గాడిన పెట్టే పెద్ద బాధ్యత రవిపై ఉంది. స్పీకర్‌గా చేసిన వారు మళ్లీ ఎన్నికల్లో గెలవడం అరుదనే వాదనలున్న తరుణంలో అది నిజంకాదంటూ నాదెండ్ల మనోహర్ తెనాలి నుంచి భారీ మెజారిటీతో విజయం సాధించడమే కాకుండా చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. పైగా తొలిసారి మంత్రి పదవి పొందినా ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల వ్యవహారాల శాఖను కేటాయించారు. గతంలో మనోహర్ ఉన్నత పదవులు అలంకరించినా, మంత్రిగా పదవిని పొందడం మాత్రం ఇదే తొలిసారి.

గతంలోనూ..

ఐదేళ్ల వైసీపీ పాలనలో వివిధ శాఖలు అస్తవ్యస్తంగా మారాయన్న ఆరోపణల నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా, బాపట్ల జిల్లాకు చెందిన మంత్రులకు కీలక శాఖల బాధ్యతలను చంద్రబాబు అప్పగించారు. అయితే గతంలోనూ జిల్లాకు చెందిన వారు ఎన్నో కీలకశాఖలను నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి పదవిని గత టీడీపీ హయాంలో దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు, ప్రత్తిపాటి పుల్లారావు, కాంగ్రెస్ పాలనలో కాసు కృష్ణారెడ్డి బాధ్యతలు నిర్వహించారు. తిరిగి ఇప్పుడు ఈ శాఖ నాదెండ్ల మనోహర్‌కి కేటాయించారు. ప్రస్తుతం అనగానికి దక్కిన రెవెన్యూశాఖను గతంలో ఎన్టీఆర్ హయాంలో పొన్నూరు నుంచి గెలుపొందిన ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి కొంతకాలం నిర్వహించారు. గతంలో టీడీపీ హయాం లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే అవకాశం దక్కింది.

నాడు పౌరసరఫరాల్లో అక్రమాలు వెలికి తీసి.. నేడు మంత్రిగా

వైసీపీ హయాంలో పౌర సరఫరాల శాఖలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి.. భారీ నిధుల గోల్‌మాల్.. మళ్లింపు చేశారు.. చిక్కీలు, కందిపప్పు, రేషన్ బియ్యం దారిమళ్లించారు.. అంటూ పౌరసరఫరాల శాఖలో జరిగిన పలు కుంభకోణాలను జనసేన పీఏసీ ఛైర్మన్‌గా నాదెండ్ల మనోహర్ వెలుగులోకి తెచ్చారు. ఆయన బయటపెట్టిన ఏ కుంభకోణాన్నయినా పూర్తి ఆధారాలతోనే గతంలో వెల్లడించారు. దీంతో ఆయా శాఖల మంత్రులు కూడా వాటిపై స్పందించడానికి భయపడిన పరిస్థితి. కానీ మనోహర్ వాటిని వదలకుండా చివరి వరకు అంటే ఎన్నికలకు ముందు వరకు వెంటపడుతూనే వచ్చారు. ఈ నేపథ్యంలో తెనాలి నుంచి కూటమి తరపున గెలిచిన నాదెండ్లకు ఆహార, పౌర సరఫరా, వినియోగదారుల వ్యవహారాల శాఖను మనోహర్ దక్కించుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే ఇప్పుడు అంతటి కీలకమైన శాఖ ఆయన చేతికి రావడంతో ఆ కుంభకోణాల గుట్టు విప్పుతారని, వారి పనిపడతారనే ఆశాభావం జనం నుంచి వ్యక్తమవుతోంది.




లోకేశ్‌కు మళ్లీ ఐటీ..

మంగళగిరి నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన నారా లోకేశ్‌కు కూటమి ప్రభుత్వంలో కీలకమైన మంత్రిత్వ శాఖలు దక్కాయి. లోకేశ్ 2016-19లో శాసన మండలి తరపున ఐటీ, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు గతంలో నిర్వహించిన ఐటీ శాఖతోపాటు మానవ వనరుల అభివృద్ధి శాఖ అదనంగా దక్కింది. గతంలో ఉమ్మడి రాష్ట్ర రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను చంద్రబాబు ఐటీ హబ్‌గా తీర్చిదిద్దారు. ఆయన తనయుడైన లోకేశ్‌కు ఐటీ శాఖపై పట్టు ఉంది. ఈ పరిస్థితుల్లో అమరావతి ఐటీ రంగంలో హైదరాబాద్‌తో పోటీ పడేలా లోకేశ్ పనితీరు ఉండే అవకాశం ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో లోకేశ్ ఐటీ మంత్రిగా మంగళగిరి, గన్నవరం ప్రాంతాల్లో పలు ఐటీ సంస్థలను ఏర్పాటు చేయించి వేలాది మంది యువతకు ఉపాధి కల్పించారు. ఇప్పుడు మారిన పరిస్థితుల్లో లోకేశ్ మరింత కసిగా అమరావతికి పెద్దఎత్తున ఐటీ పరిశ్రమలను తీసుకువచ్చే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఆయన కార్యాచరణను ప్రారంభించారని సమాచారం. గత వైసీపీ ప్రభుత్వం పగబట్టినట్టు పనిచేయడంతో అమరావతి ప్రాంతం అన్ని విధాలుగా వెనుకబడింది. అభివృద్ధిలో వెనుకంజ వేసిన అమరావతి ప్రాంతాన్ని మళ్లీ ముందుకు పరుగులెత్తించే విధంగా గొప్ప పనితీరును కనబరచాలని లోకేశ్ పట్టుదలగా ఉన్నారు. ఐటీ శాఖ దక్కడంతో మంగళగిరి, అమరావతి ప్రాంతాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు లోకేశ్‌కు ఒకింత వెసులుబాటు కలిగినట్టయింది. లోకేశ్ మంగళగిరి నుంచి మంత్రివర్గంలో కొనసాగనుండడంతో నియోజకవర్గ ప్రజలు ఆయనపై ఎన్నో ఆశలు... మరెన్నో అంచనాలతో ఉన్నారు. 2029 నాటికి మంగళగిరి, అమరావతి ప్రాంతాలు లోకేశ్ సారథ్యంలో దేశానికి ఓ దిక్సూచిలా మారతాయని ఈ ప్రాంత ప్రజలు విశ్వసిస్తున్నారు.



అనగానికి.. రెవెన్యూ చక్కదిద్దే అవకాశం

భూ వివాదాలు.. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోక పలువురు బాధితులు తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారు. రెవెన్యూ వ్యవస్థలో పాతుకుపోయిన నిర్లక్ష్యం, అవినీతి తాండవంతో భూయజమానులు, రైతులు అల్లాడిపోతున్నారు. రెవెన్యూ బాధితులు తహసీల్దార్ల కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా వారి చెప్పులు అరగడం తప్పితే ప్రయోజనం ఉండడం లేదు. అంతే కాకుండా వైసీపీ ప్రభుత్వం దిగిపోయే ఏడాదిన్నరకు ముందు అసైన్డ్ చట్ట సవరణతో పాటు లంక భూములకు యాజమాన్య హక్కులనేవి వైసీపీ నేతలకే వరంగా మారాయని విమర్శలను అప్పట్లో టీడీపీ నేతలే చేశారు. ఇంతటి ప్రాధాన్య శాఖ రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌ను వరించింది. ఒకవిధంగా రెవెన్యూను చక్కదిద్ది తన పనితీరుతో ప్రభుత్వానికి కూడా మంచి పేరు తేచ్చే అవకాశం చంద్రబాబు అనగాని భుజస్కంధాలపై పెట్టారు. వైసీపీ నేతలు ఐదేళ్లలో ఇష్టారాజ్యంగా భూములను చెరబట్టారు. వారికి కొమ్ముకాసే రెవెన్యూ సిబ్బంది అండతో వేల ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ నేతలు కైంకర్యం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై చంద్రబాబు సంతకం చేసినప్పటికీ ప్రజల్లో దాని తాలూకా భయాందోళనలు వెంటాడుతూనే ఉన్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా అనగాని సత్యప్రసాద్ ప్రజలకు భరోసా కల్పించడంతో పాటు ఐదేళ్లలో జరిగిన భూ మేతల పట్ల సమగ్ర విచారణ జరిపించాలనే డిమాండ్లు ఇప్పటికే వెల్లువెత్తుతున్నాయి.



గొట్టిపాటి చేతిలో విద్యుత్ ప్రక్షాళన

చంద్రబాబు అంటేనే నాణ్యమైన విద్యుత్.. కోతలు లేని సరఫరా. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ శాఖ అంటే వినియోగదారులను పిండుకునేందుకు ఉపయోగించుకుంది. కరెంట్ కోతలు నిత్యకృత్యంగా మారాయి. ఒక విధంగా వైసీపీ దారుణ పరాజయం వెనక మధ్యతరగతి నడ్డి విరిచిన కరెంటు బిల్లులు కూడా ప్రధాన కారణంగా ఉన్నాయి. రకరకాల సర్‌చార్జీల పేరుతో బిల్లులు చూస్తేనే షాక్ కొట్టేంతగా వైసీపీ పాలన సాగించింది. ఏడాపెడా చార్జీల భారం మోపడమే కాకుండా కార్యాలయాల ముందు వినియోగదారులు ధర్నాకు దిగిన ఉదంతాలను కూడా గతంలో చూశాం. వైసీపీ ఘోర ఓటమి వెనక ఇవన్నీ కూడా కీలకంగా పనిచేశాయి. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం పై విద్యుత్ శాఖను పటిష్ఠ పరిచి చార్జీలు తగ్గించడమే కాకుండా నాణ్యమైన కోతలు లేని సరఫరాను ప్రజలు ఆశిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంతటి కీలకమైన శాఖ బాధ్యత చంద్రబాబు అనగానిపై పెట్టారు. విద్యుత్ శాఖలో ఐదేళ్లుగా పేరుకుపోయిన నిర్లక్ష్యాన్ని ప్రక్షాళన చేయడంతో పాటు షాక్ కొట్టే కరెంటు చార్జీల నుంచి ప్రజలకు ఊరట కలిగించాల్సిన గురుతర బాధ్యత గొట్టిపాటిపై ఉంది.

నాడు ఉరి నేడు సరి?

117 జీవో BANNED

- ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవమే
- జీవో 117 రద్దు హామీపై ఉపాధ్యాయుల హర్షం
- వైసీపీ ప్రభుత్వ నిర్ణయంతో 500పైగా పాఠశాలల మూత
- జీవో 117పై ఆందోళనలను పట్టించుకోని నాటి పాలకులు

గుంటూరు(విద్య), జూన్ 14: వైసీపీ హయాంలో సీఎం జగన్ అనాలోచిత నిర్ణయం ఊరి బడికి ఉరిగా మారింది. 117 జీవో.. 500పైగా ప్రాథమిక పాఠశాలల ఉసురుతీసింది. ఈ జీవో వల్ల ప్రాథమిక విద్యా వ్యవస్థకు నష్టమని అటు ఉపాధ్యాయులు, ఇటు మేధావులు ఆందోళన చేసినా వైసీపీ ప్రభుత్వం ఆలకించలేదు. ప్రాథమిక తరగతుల విద్యార్థులు బడికి దూరమవుతారని తల్లిదండ్రుల గోడును పట్టించుకోలేదు. విద్యా వ్యవస్థను తీర్చి దిద్దాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవ హరించింది. అయితే ఎన్నికల ప్రచారంలో 117 జీవో రద్దుకు ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. ఈ క్రమంలో వైసీపీ ఓటమి పాలవడం.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో జీవో 117 రద్దుతో పాటు విద్యా వ్యవస్థలోని లోటుపాట్లను సరి చేస్తారని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో ప్రాథమిక పాఠశాలలకు పూర్వవైభవం రానుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. మౌలికవసతులతో పాటు విద్యార్థులు అక్కడ పూర్తిస్థాయిలో చదువుకునేలా ఏర్పాట్లు చేసినప్పుడే ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం ఏర్పడుతుందని ఉపాధ్యాయ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.

విద్యార్థులు దూరం.. పోస్టులకు కోత

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ 117 జీవోను తెచ్చారు. దీనివల్ల ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 30 వేల మంది విద్యార్థులు ప్రైవేటు బాట పట్టారు. మరో 3 వేల మంది విద్యార్థులు డ్రాపవుట్లుగా మిగిలారు. 2500పైగా ఉపాధ్యాయ పోస్టులకు కోత పడింది. లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసిన ప్రాథమిక పాఠశాలలు విద్యా ర్థులు లేక మూత వేయాల్సిన దుస్థితి నెలకొంది. జీవో 117తో ఊరి బడికి ఉరి వేయవద్దని ఉపాధ్యాయ సంఘాలు నెత్తినోరు బాదుకున్నా జగన్ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 3500పైగా పైగా ప్రాథమిక పాఠశాలలు ఉండగా ఆయా పాఠశాలల్లో విద్యాశాఖ లెక్కల ప్రకారమే 4.5 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటు న్నారు. ఉపా ధ్యాయ పోస్టులు తగ్గించడానికే వైసీపీ ప్రభుత్వం జీవో 117 తీసుకువచ్చింది. ఈ జీవోతో ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల్ని ఉన్నత పాఠశాల ల్లోకి విలీనం చేశారు. ఉన్నత పాఠశాలలు ఒకటిన్నర కిలోమీటర్ల దూరం ఉండటంతో తల్లిదం డ్రులు పిల్లల్ని అక్కడికి పంపేందుకు వెనుకంజ వేశా రు. ఇంటి సమీపంలోని బడి మూతతో ఈ దుస్థితి నెలకొందని వారు వాపోయినా ప్రభుత్వం పట్టించు కోలేదు. సాధారణంగా 3, 4, 5 తరగతులు చదివే విద్యార్థులు పదేళ్లలోపే ఉంటారు. వీరంతా సుదూరంగా ఉండే ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో పిల్లల్ని తల్లి దండ్రులు తమకు అందుబాటులో ఉండే ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడం ప్రారంభించారు. 1,2 తరగతులు ఉన్న ప్రా థమిక పాఠశాలల్లో విద్యార్థుల్ని చేర్పించే వారు లేక అవి క్రమంగా నిర్వీర్యం అయ్యే స్థాయికి వచ్చాయి. మరోవైపు ఉన్నత పాఠశాలల్లో కూడా 3, 4, 5 తరగతుల్లో చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు రాలేదు. దీంతో ఒక్క పల్నాడు జిల్లాలోనే దాదాపు 200పైగా పాఠశాలలు ఈ ఏడాది విద్యార్థులు లేక మూత పడే ప్రమాదం ఉందని ఉపాధ్యాయ సంఘాలు నాయకులు వెల్లడిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారాల్లో జీవో 117 రద్దుకు సంబంధించి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హామీ ఇచ్చారు. వైసీపీ అధికారం కోల్పోయి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం గతంలో వారిచ్చినట్లుగా జీవో 117 రద్దు అవుతుందని.. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం వస్తోందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.




ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుంటూరు)


అద్దంకి పాతబస్టాండ్ సెంటర్‌లో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఘన స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు


రవికుమార్‌ను పూలమాలతో సత్కరిస్తున్న కాకానిపాలెం టీడీపీ నేతలు

గొట్టిపాటికి ఘనస్వాగతం

- మంత్రిగా నియోజక వర్గంలోకి
- పసుపుమయంగా మారిన అద్దంకి

అద్దంకి, జూన్ 14: ఓటమెరుగని ఎమ్మెల్యేగా గుర్తింపు పొంది.. మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం తొలిసారిగా అద్దంకిలోకి అడుగుపెట్టారు. ఆయనకు టీడీపీ శ్రేణులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. అద్దంకి నియోజకవర్గ చరిత్రలో తొలిసారి మంత్రి పదవి రావడంతో ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. శుక్రవారం రవికుమార్ అద్దంకికి వస్తున్న విషయాన్ని ముందే తెలుసుకున్న పలు గ్రామాల టీడీపీ శ్రేణులు పట్టణానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చిలకలూరిపేట నుంచి వచ్చిన గొట్టిపాటికి ఆర్టీసీ బస్టాండ్ నుంచి టీడీపీ శ్రేణులు స్వాగతం పలికాయి. అద్దంకి మొత్తం ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లతో పసుపుమయంగా మారింది. పొట్టి శ్రీరాములు విగ్రహం, అంబేడ్కర్ విగ్రహాలకు గొట్టిపాటి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య నేతలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. అనంతరం కామేపల్లి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన టీడీపీ శ్రేణులు బారులు తీరి గొట్టిపాటికి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నేతలు కరి పరమేష్, నాగినేని రామకృష్ణ, అద్దంకి పట్టణ, మండల పార్టీల అధ్యక్షులు చిన్ని శ్రీనివాసరావు, కఠారి నాగేశ్వరరావు, గార్లపాటి శ్రీనివాసరావు, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, కాకాని అశోక్, కుందారపు రామారావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్, లహరి, చుండూరి మురళీ సుధాకరరావు, భోజనపల్లి సత్యనారాయణ, పూనూరి నరేంద్ర, స్టాలిన్, కరిముల్లా, కొండమ్మ, నటరాజ్, జొన్నలగడ్డ గోపి, కౌన్సిలర్‌లు అత్తులూరి రమేష్, కంపా రజనీ, రంగిశెట్టి సుభాషిణి, మాగులూరి తిరుపతమ్మ తదితరులు రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎంఈవోలు గంగాధర్, సుధాకరరావు, విద్యుత్ డీఈ సత్యనారాయణ, టౌన్, మేదరమెట్ల ఏఈలు శివప్రసాద్, షైలా శ్రీనివాసరావులతో పాటు పలు శాఖల అధికారులు, మెప్మా, డ్వాక్రా సంఘాల సభ్యులు, న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

అమాత్యుడైనా.. సామాన్యుడిలా..

గొట్టిపాటి రవికుమార్ ఇప్పుడు మంత్రి. అయినా ఆయన ఓ సామాన్యుడిలా ఉన్నారు. మంత్రి అయిన తర్వాత అద్దంకికి వచ్చిన ఆయన పార్టీనాయకులతో కలిసి బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్దకునడిచి వెళ్తూ మార్గమధ్యలో ఉన్న రాజస్థాన్ టీస్టాల్ వద్ద ఆగారు.సామాన్యుడిలా అందరితో కలిసి టీ తాగుతూ స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు



అక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం, జూన్ 14: ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా హెచ్చరించారు.'ప్రభుత్వ భూమి మళ్లీ ఆక్రమణ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. డిప్యూటీ తహసీల్దార్ బి.శ్రీనివాసులు, మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో షేక్ బడేసాహెబ్‌లతో కలిసి ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. సర్వే నెంబర్ 1011లో 30సెంట్ల ప్రభుత్వ భూమి ఉందని గుర్తించారు. అందులో 5 సెంట్లు లీగల్ మెటరాలజీ శాఖకు, 5 సెంట్లు ఏపీ ఫైబర్ నెట్‌కు కేటాయించినట్లు నిర్ధారించారు. మిగిలిన 20 సెంట్లు ప్రభుత్వ భూమిగానే ఉందని తేల్చారు. ఆ భూమిలో గతంలో ఆక్రమణకు యత్నించినప్పుడు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించారన్నారు. తిరిగి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమణకు యత్నించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా హెచ్చరించారు.

తవ్వుకుపోతున్నారు..

» యథేచ్ఛగా అక్రమంగా తవ్వకాలు



రియల్ భూములకు తరలించిన మట్టి

ఒంగోలు(క్రైం), జూన్ 14: పేర్నమిట్ట చెరువును రియల్టర్లు గుల్ల చేస్తున్నారు. అక్రమంగా తవ్వకాలు జరిపి గ్రావెల్‌ను రియల్ భూములకు తరలిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన చెరువులో ఎక్స్‌కవేటర్లతో గోతులు తీస్తున్నా కనీసం కన్నెత్తిచూసిన పాపాన పోలేదు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు. చీమకుర్తికి చెందిన ఓ గ్రానైట్ వ్యాపారి రియల్ రంగంలోనూ బాగా పేరుపొందారు. కొత్తగా చేపట్టిన తన వెంచర్ కోసం శుక్రవారం ఉదయం యథేచ్ఛగా ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు జరిపి ఆరు ట్రాక్టర్లతో కర్నూల్ రోడ్డుకు పక్కనే ఉన్న రెండు ఎకరాల భూమిని చదును చేస్తున్నారు. పరిస్థితిని గమనించిన గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వీఆర్వో రవి అక్కడకు చేరుకొని తవ్వకాలను నిలిపివేసి మండల తహసీల్దార్‌కు నివేదిక ఇచ్చారు. అయితే అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. పేర్నమిట్ట చెరువులో ఇలా నిత్యం అక్రమంగా తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దశరథరామయ్య మృతి బాధాకరం



బెల్లంకొండ దశరథ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, జూన్ 14 :సేవాభావంతో ప్రజలకు చేరువగా ఉంటూ నిరంతరం గ్రామ అభివృద్ధిని కాంక్షించే టీడీపీ నేత బెల్లంకొండ దశరథరామయ్య మృతి ఎంతో బాధాకరమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ కొద్ది రోజుల క్రితం మరణించిన బెల్లంకొండ దశరథ కుటుంబ సభ్యులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పరామర్శించారు. చిత్రపటం వద్ద నివాళి అర్పించిన మంత్రి గొట్టిపాటి రామయ్య మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. భార్య అమ్మణ్ణి, కుమార్తె సుమతి, అల్లుడు కృష్ణ, తమ్ముడు శ్రీనివాసరావులను పరామర్శించారు. ఆయన మాజీ జడ్పీటీసీ సభ్యుడు కేవీ సుబ్బారావు, మండల అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పెంట్యాల రాధాకృష్ణ, రామలింగస్వామి, టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్, చింతల సహదేవుడు, గుర్రం ఆదిశేఖర్, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, బొప్పూడి నాగేశ్వరరావు, వీరయ్య, గొట్టిపాటి కాజా, పరంధామయ్య, కొల్లి సురేంద్ర, మాగులూరి రమేష్, జేకేసీ, ఉన్నం రవి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి మూడుచక్రాల సైకిల్ అందజేత

పంగులూరు, జూన్ 14: రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన తూర్పు కొప్పెరపాడు గ్రామవాసి నీలం హనుమంతరావుకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ మూడు చక్రాల వాహనాన్ని అందజేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న గొల్లపూడి శేషగిరిరావును పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెండ్యాల సుబ్బారావు, గొల్లపూడి అంజయ్య, ఎనికపాటి అశోక్, సూరిబాబు, ఆర్.అశోక్, మాణిక్యమ్మ పలువురు మహిళలు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పించాలి

ఒంగోలు(విద్య), జూన్ 14 : బడిఈడు బాలబాలికలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని డీఈవో సుభద్ర ఆదేశించారు. ఒంగోలులోని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల విద్యాధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాల విద్యార్థులకు కొత్త స్టూడెంట్ కిట్స్ మాత్రమే ఇవ్వాలన్నారు. పాత విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయవద్దని ఆదేశించారు. కిట్‌కు ప్రస్తుతం అందుబాటులో ఉన్న వస్తువులను పంపిణీని చేయాలన్నారు. ఈనెల 20నాటికి సామగ్రి మొత్తం పాఠశాలలకు అందుతుందన్నారు. కిట్లు పంపిణీ చేశాక విద్యార్థుల నుంచి అక్విటెన్స్ తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పాఠశాలను తనిఖీ నిర్వహిస్తూ తమ నివేదికలను ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. పెండింగ్ విచారణలు, స్పందన అర్జీలను పరిష్కరించాలని తెలిపారు. మినిమం టైం స్కేలుతో పనిచేస్తున్న 2008, 1998 కాంట్రాక్టు టీచర్లు తాము పనిచేస్తున్న పాఠశాలల్లో చేరాలన్నారు. అవసరమున్న పాఠశాలలకు టీచర్లను పనిసర్దుబాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో సెక్టోరల్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై హర్షం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 12: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే చంద్రబాబు నాయుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయడం పట్ల బార్ అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఒంగోలులోని జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో శుక్రవారం అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.మోహన్‌దాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినా పట్టించుకొని పరిస్థితి ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన వెంటనే యాక్టును రద్దు చేయడంపై అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ సురేంద్రబాబు, ఎన్.సత్యశ్రీనివాస్, బొడ్డు భాస్కరరావు, శిరిగిరి సరళ, అజయ్‌బాబు, పంగులూరు గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, జూన్ 14: మోటార్‌సైకిల్ ఢీకొని మరో మోటార్‌సైక్లిస్టుకు గాయాలైన సంఘటన శుక్రవారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం సమీపంలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు పర్చూరుకు చెందిన గరికముక్కల సీమోను మోటార్‌సైకిల్‌పై నాగులుప్పలపాడు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, మరో మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఢీకొట్టింది. సీమోనుకు గాయాలు కాగా, చికిత్స నిమిత్తం మేదరమెట్లలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

బాధ్యత పెంచిన శాఖలు

» ఇద్దరు మంత్రులకు కత్తి మీద సామే
» అటు సంక్షేమాన్ని ఇటు సచివాలయ వ్యవస్థే స్వామికి కీలకం
» వ్యవసాయ, పారిశ్రామిక రంగాల విద్యుత్ సమస్యలు రవికి సవాల్
» మరింత పనిచేసి సమర్థతను నిరూపించుకుంటాం.. గొట్టిపాటి, డోలా

ఉమ్మడి జిల్లాలో మంత్రులైన గొట్టిపాటి రవి కుమార్, డోలా బాలవీరాంజనేయ స్వామికి బాధ్యతలను చంద్రబాబు మరింత పెంచారు. వారి సమర్థత, నిబద్ధతలపై నమ్మకం ఉంచి మంత్రులను చేశారు. కీలక మంత్రిత్వ శాఖలను కేటాయించారు. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ గొట్టిపాటికి విద్యుత్ శాఖను కేటాయించారు. అంచనాలకు అనుగుణంగా స్వామికి సంక్షేమశాఖ కేటాయించటమే కాక అదనంగా గ్రామ సచివాలయ వ్యవస్థ నిర్వహణ బాధ్యతను అప్పగించారు. రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయిలోను వారికి కేటాయించిన శాఖల ప్రాధాన్యత చాలా పెద్దది. అందుకే కాబోలు తమకు కేటాయించిన శాఖల పట్ల ఇద్దరు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే శుక్రవారం సాయంత్రం చంద్రబాబు కూడా మీపై నమ్మకంతో మంచి శాఖలు ఇచ్చాం.. మరింత సమర్థత నిరూపించుకోమని వారికి సూచన చేశారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కొత్తగా చంద్రబాబునాయుడు సారథ్యంలో ఏర్పడిన మంత్రివర్గంలో జిల్లా నుంచి మంత్రులుగా నియమితులైన గొట్టిపాటి రవికుమార్‌కు విద్యుత్ శాఖను, బాలవీరాంజనేయస్వామికి సాంఘిక సంక్షేమం, వికలాంగుల సీనియర్ సిటిజన్ల సంక్షేమం, సచివాలయం, గ్రామ వలంటీర్ల వ్యవస్థల నిర్వహణ శాఖలను కేటాయించారు. ప్రజలతో నిత్యం సంబంధం ఉండే కీలక శాఖలను వీరిద్దరికి కేటాయించటంపై జిల్లాలో విస్తృత చర్చ జరుగుతోంది. తమకు కేటాయించిన శాఖలపై ఇద్దరు మంత్రులు సంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే సమర్థవంతంగా ఆ శాఖల నిర్వహణ ద్వారా ముందుకు సాగటం కత్తిమీద సాములాంటిదని ప్రజాభిప్రాయం. శుక్రవారం సాయంత్రం ఇద్దరు మంత్రులు రవి, స్వామిలు సచివాలయంలో చంద్రబాబును కలవగా మీరు కష్టపడతారనే నమ్మకంతోనే మంచి శాఖలు ఇచ్చానన్నారు. ఆ శాఖలపై పూర్తిస్థాయిలో స్టడీ చేయండి, కింది స్థాయిలో పరిస్థితులను గమనించండి, తరువాత ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలా పనులు చేయండి అని స్పష్టంగా సూచించినట్లు తెలిసింది.

సంక్షేమంలో కీలకం

సంక్షేమ కార్యక్రమాలు, సచివాలయ వ్యవస్థలో మార్పులు మంత్రి స్వామికి కీలకంగా మారబోతున్నాయి. గతంలో జగన్ బటన్ నొక్కుడు కార్యక్రమం పేరుతో దళితులకు అమలు చేయాల్సిన 27 సంక్షేమ కార్యక్రమాలను ఆ ప్రభుత్వం అమలు చేయలేదని వాటిని పునరుద్ధరిస్తామని తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించింది. అలాగే వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్ల పంపిణీకి ఉన్న ప్రాధాన్యత తెలిసిందే.

మరోవైపు జగన్ ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల నియామకాలపై సంపూర్తిగా స్టడీ చేసి సవివరమైన మార్పులు చేయాల్సిన అవసరం ఈ ప్రభుత్వంపై ఉంది. అందులో కీలక భూమిక మంత్రిగా స్వామి పోషించాల్సి ఉంది. పైగా వలంటీర్ల గౌరవ వేతనాన్ని రూ.10వేలకు పెంచుతామని టీడీపీ ఎన్నికల హామీ ఇచ్చి ఉంది. గతంలో వైసీపీ నాయకులు వలంటీర్లతో రాజీనామాలు చేయించారు. అందులో ఎన్ని ఆమోదించారో అధికారికంగా వెల్లడించలేని పరిస్థితి. వలంటీర్ల పునఃనియామకాలు రాజకీయంగా కత్తి మీద సాము లాంటిదే. సూపర్ సిక్స్ పేరుతో టీడీపీ ప్రకటించిన కార్యక్రమాల అమలుతో దళిత, గిరిజనులకు ఆర్థిక చేయూతనిచ్చే సంక్షేమ పథకాలు పునరుద్ధరించటంలో బాధ్యత గల మంత్రిగా పనిచేయాల్సిన అవసరం కనిపిస్తోంది. నిజానికి పేదలందరి పక్షాన పనిచేసే అరుదైన అవకాశం స్వామికి లభించింది.



సీఎం చంద్రబాబుతో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, స్వామి, నారాయణ, తదితరులు

వ్యవసాయ, పారిశ్రామిక రంగాలే కీలకం

విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌కు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు చెప్పిన ప్రకారం విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంది. అలాగే దళితులకు ఉచిత విద్యుత్ సరఫరాలో జగన్ ప్రభుత్వం చేసిన మోసాన్ని నివారించటం, అన్నింటికీ మించి జల విద్యుత్ వివాదంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించుకోవటం లాంటి అనేక సమస్యలు ఆయన ముందున్నాయి. వీటితోపాటు వైసీపీ ప్రభుత్వంలో కడప జిల్లాకు చెందిన ఒక సంస్థ ద్వారానే విద్యుత్ శాఖలో పనులన్నీ నిర్వహించి భారీ అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణ తీవ్రంగా ఉంది. ఈ విషయాన్ని టీడీపీ కోడై కూయటమే కాక తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అవినీతి గుట్టురట్టు చేసి అవినీతిపరులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఉన్నారు. వీటన్నింటిలోను విద్యుత్ శాఖ మంత్రిగా రవికుమార్ గణనీయ పాత్ర పోషించాల్సి ఉంది.

ఇక జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, కొత్త లైన్లు ఏర్పాటుకు స్తంభాల కొరత, కొత్త లైన్లు ఏర్పాటుకు ఎదురవుతున్న ఇబ్బందుల పెద్ద సవాల్‌గానే కనిపిస్తున్నాయి. గ్రానైట్, ఆక్వా రంగాలకు సంబంధించి గత మాజీ సీఎం జగన్ ఇచ్చిన హామీలను విస్మరించాడు. విద్యుత్ సరఫరా, విద్యుత్ చార్జీల విషయంలో రెండు రంగాల వారు కొత్త ప్రభుత్వం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు సోలార్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం జిల్లాకు కలగానే మిగిలింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఆ ప్రాజెక్టు జిల్లాకు మంజూరైంది. నిన్నటి వైసీపీ ప్రభుత్వం సరికొత్త మార్పులతో సోలార్ విద్యుత్ ప్రాజెక్టు జిల్లాకు వస్తున్నట్లు ప్రకటించింది. ఆ ప్రభుత్వంలో తొలి మూడేళ్లు జిల్లాకు చెందిన బాలినేని శ్రీనివాసరెడ్డి విద్యుత్ శాఖ మంత్రిగా ఉండటంతో సోలార్ ప్రాజెక్టు ఖచ్చితంగా వస్తుందని భావించారు. కానీ జగన్ ప్రభుత్వం దానికి తిలోదకాలు ఇచ్చింది. ఈ ప్రభుత్వంలో రవికుమార్ సారధ్యంలో అలాంటి బృహత్తర ప్రాజెక్టు ఖచ్చితంగా జిల్లాకు వస్తుందని జనం ఆశగా ఎదురుచూస్తున్నారు.

మరింత నిబద్ధతలో పనిచేస్తాం

శాఖల కేటాయింపు అనంతరం రవికుమార్, స్వామిలు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తమపై నమ్మకంతో కీలక శాఖలను కేటాయించారని తెలిపారు. తమకు కేటాయించిన శాఖల విషయంలో చాలా సంతృప్తికరంగా ఉన్నామని, అందుకే వెంటనే ముఖ్యమంత్రిని కలిసి తమ ఆనందం తెలిపామన్నారు.

ప్రజలు, పార్టీ, ప్రజా సమస్యల పట్ల ఎంత నిబద్ధతతో పనిచేస్తామో ఇప్పటికే నిరూపించుకొని వరుస విజయాలు సాధిస్తున్నాని వివరించారు. అంతకన్నా ఎక్కువగా పనిచేసి చంద్రబాబు నమ్మకాన్ని నిలబెడుతూ రాష్ట్ర ప్రజల మద్దతు పొందుతామని ధీమాగా చెప్పారు.

ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

» పుట్టినరోజు వేడుకల్లో విషాదం

దర్శి, జూన్ 14: ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన సంఘటన దర్శిలో జరిగింది. పుట్టినరోజు పార్టీ సందర్భంగా ఈ విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం.. దర్శి మండలం లంకోజనపల్లి పంచాయతీలోని లూదగిరి కాలనీకి చెందిన బొందల నవీన్(16), కొనకనమిట్ల మండలం వాగుమడుగు గ్రామానికి చెందిన వి.చందు(16) దర్శి ఎన్ఏపీ చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లి గురువారం సాయంత్రం గల్లంతయ్యారు. ఈవిషయం రాత్రి పొద్దుపోయిన తర్వాత కుటుంబసభ్యులకు తెలిసింది. వీరిరువురు దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత మార్చిలో పదో తరగతి పరీక్షలు రాశారు. ఇద్దరు మంచి స్నేహితులు. లూదగిరి కాలనీకి చెందిన నవీన్ పుట్టినరోజు సందర్భంగా గురువారం పార్టీ ఇచ్చేందుకు తన స్నేహితులను అందరినీ పిలుచుకున్నారు. అందు లోభాగంగా చందును కూడా పిలిచాడు. చందు స్వగ్రామమైన వాగుమడుగులో తిరునాళ్ల ఉత్సవాలు జరుగుతున్నాయి. కురిచేడు మండలం అలవలపాడులో ఉన్న చందు అమ్మమ్మను ఊరికి తీసుకెళ్లేందుకు ఆ గ్రామానికి వెళ్లి దర్శికి తీసుకొచ్చాడు. స్నేహితుడు నవీన్ పుట్టినరోజు పార్టీ ఉండటంతో ఆమెను బస్సు ఎక్కించి పంపి గురువారం మధ్యాహ్నం దర్శిలోని శివరాజ్‌నగర్ వద్ద గల ఎన్ఏపీ చెరువు వద్ద పుట్టినరోజు పార్టీ చేసుకున్నారు. భోజనాలు అనంతరం సాయంత్రం నవీన్, చందులు ఈత కొట్టేందుకు చెరువులో దిగారు. మిగిలిన విద్యార్థులు ఈత రాదని వెళ్లిపోయారు. వారిద్దరు ఈత కొట్టేక్రమంలో నీటమునిగారు. రాత్రి 9గంటల వరకు విద్యార్థులు ఇళ్లకు చేరకపోవటంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది ఆరా తీశారు. పుట్టినరోజు పార్టీ చేసుకున్న సమాచారం తెలుసుకొని అక్కడకు వెళ్లి గాలించారు. శుక్రవారం ఉదయం ఇద్దరు మృతదేహాలను బయటకు తీశారు. ఈ సంఘటన ఇరుగ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొల్పింది.



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న కుటుంబసభ్యులు

బాగా చదువుకొని వృద్ధిలోకి వస్తారని ఎన్నో ఆశలతో పేద కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు వారిని కష్టపడి చదివిస్తున్నారు. నవీన్, చందులు ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. ఉన్నత విద్య చదివి ఉన్నతస్థాయికి చేరుకుంటారని ఎన్నో ఆశలు పెట్టుకున్న కుమారులు మృతిచెందటంతో వారి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బంధువులు, స్నేహితులు అధికసంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు విద్యార్థులు ఒకేసారి మృతిచెందటంతో విషాదచాయలు నెలకొన్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు కొనుగోలు చేసిన ప్రతి దానికి రసీదు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏడీఏ ధనరాజ్

అద్దంకిటౌన్, మే 14: విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేసిన షాపులలో రైతులు ప్రతి దానికి రసీదు తీసుకుని వానిటి భద్రపరుచుకోవాలని అద్దంకి డివిజన్ ఏడీఏ ధనరాజ్ సూచించారు. శుక్రవారం అద్దంకి ఎంపీడీవో కార్యాలయంలో 2024 ఖరీఫ్ సాగుపై అద్దంకి డివిజన్ పరిధిలోని గ్రామా వ్యవసాయ సహాయకులు, విత్తన, ఎరువులు, పురుగు మందు డీలర్లకు అవగాహన కార్యక్రనమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ కార్యాలయం సాంకేతిక అధికారి తిరుమలరావు మాట్లాడుతూ డిలర్లు తమ వద్దకు వచ్చిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వివరాలను సరిచూసుకోవడం, వాటి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవడం చేయాలన్నారు. రైతులకు అమ్మిన ప్రతి వస్తువుకు రసీదు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతు గ్రామ వ్యవసాయ సహాయకులు కొత్తగా వచ్చిన రకాలు, పురుగు మందులు గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ క్యాక్రమంలో కొరిశపాడు మండల వ్యవసాయ అధికారి పి. శ్రీనివాసరావు, టెక్నికల్ ఏవో మీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ వాహన యజమానుల్లో ఆందోళన

» జిల్లావ్యాప్తంగా 385 వాహనాలు
» ఒక్కో వాహనానికి రూ.18వేలు, ఆపరేటర్‌కు రూ.5వేలు గౌరవవేతనం
» రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి



ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 14 : జిల్లాలో ఇంటింటికీ రేషన్ పేరుతో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొబైల్ వాహన యజమానుల్లో ఆందోళన నెలకొంది. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ సానుభూతిపరులకు ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు ఈ వాహనాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,392 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 385 వాహనాలను ఏర్పాటు చేశారు. ఆ వాహన యజమానికి నెలకు రూ.18వేలు, ఆ వాహనంలో బియ్యం ఎత్తేందుకు, దించేందుకు ఆపరేటర్ పేరుతో మరో రూ.5వేలను గౌరవవేతనంగా ఇస్తూ వచ్చారు. అలా ఒక్కొక్క వాహనానికి నెలకు రూ.23వేలను ప్రభుత్వం వెచ్చించింది. రేషన్ పంపిణీ 1వతేదీ ప్రారంభించి 15వతేదీ నాటికి పూర్తిచేస్తారు. ఏదైనా సర్వర్ పనిచేయకపోతే మరో రెండు, మూడు రోజులు పెంచేవారు. మిగిలిన 12 రోజులు ఆ వాహన యజమానులు ఇంకా ఇతర పనులకు వినియోగించుకునేవారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది.

టీడీపీ ప్రభుత్వం గతంలో మాదిరిగా రేషన్ షాపుల ద్వారానే కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తుందని విస్తృతంగా ప్రచారం జరుగుతుండటంతో వాహన యజమానుల్లో వణుకు నెలకొంది. మరోవైపు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసేందుకు కొత్తగా టెండర్లు పిలిచి టీడీపీ మద్దతుదారులకు వాహనాలను అప్పగిస్తే తమ పరిస్థితి ఏమిటోనని వారు మదనపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే తమకు తెలిసిన వారి ద్వారా టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. తమ వాహనాలను కొనసాగించే విధంగా చూడాలనే ప్రయత్నాలను ప్రారంభించినట్లు సమాచారం. ఇలా జిల్లావ్యాప్తంగా వాహన యజమానుల్లో ఎప్పుడు ఏమి జరుగుతుందో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. వాహనాలను పెట్టుకొకపోతే తాము ఇప్పుడు ఏమి చేయాలో అనేది అర్థం కాని పరిస్థితి నెలకొంది.

నేడు బడికి పోతా ప్రత్యేక కార్యక్రమం

» ఒక రోజు ఆలస్యంగా ఉత్తర్వులు



ఒంగోలు(విద్య), జూన్ 14: బడిఈడు బాలబాలికలందరిని పాఠశాలల్లో చేర్పించేందుకు నేను బడికి పోతా పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ నెల 13నుంచి జులై 12 వరకు నెల రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు పాఠశాలల్లో చేరేందుకు అర్హులైన పిల్లందరూ పాఠశాలల్లో నమోదు కావాలని, 6 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న బాల బాలికలు ఎవరు బడిబయట ఉండరాదు, మధ్యలో బడిమానేసిన పిల్లలందరిని మళ్లీ బడికి రప్పించడనే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బడికిపోతా కార్యక్రమానికి సంబంధించి ఒకరోజు ఆలస్యంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈనెల 13 నుంచి కార్యక్రమం షెడ్యూల్ మొదలవుతుండగా సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ (ఎస్పీడీ) మాత్రం తాపీగా 14వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈవిధంగా వారు ఎంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారో ఇటువంటి ఉదంతాలు తేటతెల్లం చేస్తున్నాయి. షెడ్యూల్ ప్రకారం 13న పాఠశాలల్లో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించాలి. 14న బడి ఉత్సవం, 15న బాలికా ఉత్సవం, 17న ప్రత్యేకావసరాల పిల్లల కార్యక్రమాలు, 18న విద్యా సదస్సు, 19న సమాజంతో ఒక రోజు కార్యక్రమం నిర్వహించాలి. గ్రామ/వార్డు సచివాలయం, వలంటీర్లు, సహకారంతో కార్యక్రమం నిర్వహించాలని పేర్కొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 14 : రక్తదానం మరొకరికి ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం చీరాల ఏరియా వైద్యశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి, ఇతర వైద్యులు, సిబ్బంది కొండయ్యకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ఏరియా వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అంతకుముందు ఏరియా వైద్యశాల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొండయ్యను కలిసిన మున్సిపల్ కమిషనర్, సెక్షన్ హెడ్స్

ఎమ్మెల్యే కొండయ్యను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వారితో పలు అంశాలపై మాట్లాడారు. ఆయా విభాగాల బాధ్యులు నిర్వహించాల్సిన పనులపై అశ్రద్ధ లేకుండా పురప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో అన్ని విభాగాల ముఖ్యులు పాల్గొన్నారు.


సబ్సిడీ విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

రైతులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జూన్ 14 : రైతులకు అన్ని విధాల అండగా ఉంటాం. సాగుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని అక్కాయిపాలెంలో శుక్రవారం చీరాల, వేటపాలెం మండలాల పరిధిలోని ఆర్‌బీకే, డీలర్స్, వ్యవసాయ శాఖ అధికారులు, బాధ్యులతో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ ఉపవృత్తులకు సంబంధించి రైతులకు అన్ని విధాలుగా అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఖరీఫ్ సాగుకు ముందస్తుగా రైతులకు ఉపయోగకరంగా ఏఏ పంటలు వేస్తే లాభదాయంకగా ఉంటుందనే అంశాన్ని గ్రామ,గ్రామాన వివరించాలని చెప్పారు. అనంతరం 50శాతం సబ్సిడీపై లబ్ధిదారులకు పచ్చిరొట్ట పైర్లకు సంబంధించిన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఏవో రామకృష్ణ, డీడీఏ విజయనిర్మల, ఏడీఏ ఎఫ్రాయమ్, డాట్ శాస్త్రవేత్త మురళీకృష్ణ, ఉషారాణి, ఉద్యావనశాఖ అధికారి అలేఖ, నీటిపారులశాఖ అధికారులు, ఏఓలు, సిబ్బంది, ఆర్‌బీకే సిబ్బంది, ఇన్‌ఫుట్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.


పర్చూరులో చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న టీడీపీ శ్రేణులు

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

పర్చూరు, జూన్ 14: ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశ ప్రవేశ పెట్టిన హామీలు అమలు దిశగా చంద్రబాబు అడుగులు వేయటంతో తెలుగు దేశం పార్టీ కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో శుక్రవారం స్థానిక బొమ్మల సెంటర్‌లో చంద్రబాబు చిత్రపటానికి పార్టీ శ్రేణులు పాలభిషేకం నిర్వహించి అభిమానం చాటుకున్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో పట్టణపార్టీ అధ్యక్షులు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, దూళ్లిపల్లి వెంకటస్వామి, కోదూరి శేష బ్రహ్మాచారి, కొల్లా శివరాంప్రసాద్, కొండ్రగంటి శివనాగేశ్వరరావు, మానం హరిబాబు, ఆకుల మధుబాబు, తులసి శ్రీనివాసరావు, రంగిశెట్టి రవికుమార్, కూరపాటి జగన్, అన్నపరపు శ్రీనివాసు, గోరంట్ల రామకృష్ణ, శ్రీరాం వెంకటసుబ్బారావు, లక్కిపోగు సుమన్, కొరిటాల సురేష్, నాయుడు శ్రీనివాసరావు, అడ్డగడ్డ సాంబయ్య, కంచేటి శ్రీహరి, గ్రంధి రమణ, గడ్డె చిన్నోడు, దరియా హుస్సేన్, కొల్లా సుబ్బారావు, పెద్దబ్బాయి, షేక్.బషీర్ తదితరులు పాల్గొన్నారు.


పురందేశ్వరితో ఇంకొల్లు ప్రాంత బీజేపీ నాయకులు

పురందేశ్వరిని కలిసిన ఇంకొల్లు నాయకులు

ఇంకొల్లు, జూన్ 14: ఇంకొల్లు మండల బీజేపీ నాయకులు శుక్రవారం విజయవాడలో ఆపార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు అయిన తరువాత తొలిసారిగా ఇంకొల్లు నుంచి వెళ్లి విజయవాడ బీజేపీ కార్యాలయంలో కలిసారు.పార్టీ బలోపేతానికి,సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు వెనిగండ్ల వెంకటేశ్వర్లు, గుది శివరామకృష్ణ, అమరేశ్వరరావు,పెనుమాల రామయ్య జగజ్జీవన్‌రావు, నాదెండ్ల పార్థసారథి, కరి హరిబాబు,నల్లూరి కృష్ణయ్య పలువురు కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

మంచి పనులు చేద్దాం.. బాధ్యతగా వ్యవహరిద్దాం

సమావేశంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, జూన్14: వైసీపీ నేతలు చేసిన తప్పులు మనం చేయకుండా ప్రజలకు మంచి పనులు చేస్తూ బాధ్యతగా వ్యవహరించాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంత్రిగా ప్రమాణం చేసిన తరువాత తొలిసారి శు క్రవారం అద్దంకి వచ్చిన రవికుమార్ స్థానిక నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఘన విజయం సాధించటంతో ఎక్కువ బాధ్యత పెరిగిందన్నారు. వైసీపీ దుర్మార్గపు పాలనతో దేశంలో ఏపీకి చెడ్డ పేరు వచ్చిందన్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి

వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. వాళ్ల చేసిన తప్పులు మనం చేయకుండా మంచిపాలన అందించాలన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు మర్మతులు చేయకుండా వైసీపీ నాయకులు గాలికి వదిలివేశారు. వెంటనే మరమ్మతులు చేయించి సాగు, తాగు నీటి సమస్య లేకుండా చర్యలు చేపడతాన అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో భాగంగా ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ, అన్న క్యాంటిన్‌ల ఏర్పాటు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, పెన్షన్ పెంపు తదితర ఫైళ్లపై సంతకాలు చేశారన్నారు.పింఛన్లను టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 200 రూపాయల నుంచి వెయ్యి రూపాయలకు, వెయ్యి రూపాయల నుంచి 2 వేల రూపాయలకు పెంచిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వెయ్యి రూపాయలు పెంచటానికి 5 సంవత్సరాలు పట్టిందన్నారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 3 వేల రూపాయల పింఛన్ 4 వేలకు పెంచటంతో పాటు, ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి పెంచిన వెయ్యి రూపాయలను కలిపి మూడు వేల రూపాయలను కూడా వచ్చే నెలలో ఇళ్లవద్దనే అందజేస్తారన్నారు.

అద్దంకి నియోజకవర్గ చరిత్రలో తొలిసారి మంత్రి పదవి

అద్దంకి నియోజకవర్గ చరిత్రలో తొలిసారి మంత్రి పదవి వచ్చిందని, మరింత బాధ్యతగా పనిచేసి అద్దంకి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి అభివృద్ధికి గత టీడీపీ


టీడీపీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రభుత్వ హయాంలో 85 కోట్ల రూపాయలతో మంచినీటి పథకం మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తే వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇంకా పూర్తి కాలేదన్నారు. అత్యధిక శాతం పనులు పూర్తయిన టిడ్కో ఇళ్ల కూడా నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వెంటనే అసంపూర్తి పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామన్నారు.వరుస విజయాలు అందిస్తున్న అద్దంకి నియోజకవర్గ ప్రజల అభిమానం మరువ లేనిదన్నారు. నిత్యం అందుబాటులో ఉండి అద్దంకి నియోజకవర్గాన్ని మరింత అభివృచేస్తానని హామీ ఇచ్చారు.

మంత్రి గొట్టిపాటికి ఘన స్వాగతం

పంగులూరు, జూన్ 14 : రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం శుక్రవారం తొలిసారిగా చందలూరు వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు స్థానిక నేతలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. గ్రామానికి చేరుకున్న గొట్టిపాటి ముందుగా స్థానిక రామాలయంలో మహిళలతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటం, మంత్రి పదవి చేపట్టడం పట్ల మహిళలు

గ్రేడింగ్ మహిళలతో ముచ్చటించిన మంత్రి

నూతన ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి తొలిసారి పంగులూరు మండలం చందలూరు గ్రామం వచ్చిన గొట్టిపాటి రవికుమార్ తిరుగు ప్రయాణంలో అలవలపాడు గ్రేడింగ్ కంపెనీలో పనిచేస్తున్న మహిళా కూలీలతో ముచ్చటించారు. మహిళా కూలీలకు అభివాదం చేస్తూ కంపెనీ లోపలికి వెళ్ళిన గొట్టిపాటికి ప్రతిగా నమస్కరిస్తూ మహిళలు స్వాగతం పలికారు. తన గెలుపునకు సహకరించిన మహిళలకు గొట్టిపాటి కృతజ్ఞతలు తెలిపారు.


మంత్రి రవికుమార్‌కు పూలలు వేసి అభినందనలు తెలుపుతున్న రావినూతల టీడీపీ నాయకులు

మంత్రికి అభినందనలు తెలిపిన రావినూతల టీడీపీ నాయకులు

మేదరమెట్ల , జూన్14 : ఇటీవల శాసన సభ ఎన్నికలల్లో అద్దంకి నియోజకవర్గం నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా విజయం సాధించి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గొట్టిపాటి రవికుమార్‌కు రావినూతల తెలుగుదేశం నాయకులు అభినందనలు తెలిపారు. శుక్రవారం చిలకలూరిపేటలోని మంత్రి నివాసానికి 30 వాహనాలు టీడీపీ నాయకులు, పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు తరలి వెళ్ళి మంత్రి రవికుమార్‌కు పూల మాలలు, బొకేలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం పట్ల తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కారుసాల నాగేశ్వరరావు(బాబు), మోపర్తి లక్ష్మీనారాయణ, అనుబ్రోలు కస్తూరి, చేబ్రోలు నాగేశ్వరరావు, కారుసాల గురుబాబు, పిన్నక హనుమయ్య, కారుసాల సుబ్బయ్య, బొడపాటి ఆంజనేయులు, అనుబ్రోలు ప్రభాకరరావు, కావూరి ప్రసాద్, మువ్వ పావనీ, పాములపాటి కృష్ణకుమారి, వజ్జా ఇందిరమ్మ తదితరులు పెద్ద సంఖ్యల్లో హాజరై మంత్రి శుంభాకాంక్షలు తెలియజేశారు.


సీఎం చంద్రబాబుతో మంత్రులు గొట్టిపాటి, అనగాని

సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి

అద్దంకి, జూన్14: సీఎం నారా చంద్రబాబునాయుడును శుక్రవారం రాత్రి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌లు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రివర్గంలో స్థానం కల్పించి శాఖలు కేటాయించటంతో శుక్రవారం రాత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

డ్రైనేజీ లేకుండా రోడ్డు నిర్మాణం

- అగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు
- పొలాలు ముంపునకు గురవుతాయని ఆవేదన

పర్చూరు, జూన్ 14: డ్రేనేజ్ కాలువను నిర్మించకుండా వాడరేవు - పిడుగురాళ్ళ రహదారిని ఏర్పాటు చేస్తే తమ భూములు కొద్దిపాటి వరదలు వచ్చినా ముంపుకు గురిఅవుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా అధికారులకు విన్న విన్నవించుకున్న నేపథ్యంలో రెవెన్యూశాఖ అధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణానికి ముందే 14 మీటర్ల మేర డ్రైనేజ్ కాలువను ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఉన్న డ్రైనేజ్ కాలువను పూడ్చివేసి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది వరదలు సంభవించి వేల ఎకరాల్లో పంటభూములు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే గత ఏడాది సంభవించిన పరిస్థితులే పునవావృతం అవుతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వాడరేవు - పిడుగురాళ్ళ రహదారి నిర్మాణానికి సంబంధించి పర్చూరు - కారంచేడు మండలాల పరిధిలోని దాదాపు రెండు వేల ఎకరాలకు పైగా పంటభూములు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించి డ్రైనేజ్ కాలువను ఏర్పాటు చేసిన తరువాతే జాతీయ రహదారి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


పర్చూరు - కారంచేడు మధ్య జాతీయ రహదారి నిర్మాణ పనులు (ఇన్‌సెట్లో) రోడ్డు నిర్మాణంతో డ్రైనేజ్ కాలువ పూడిపోవటంతో నిలిచిన మురుగు

చౌడు భూములుగా మారతాయని రైతుల అందోళన

డ్రైనేజ్ కాలువను ఏర్పాటు చేయకుండా జాతీయ రహదారి నిర్మాణం చేపడితే మురుగునీరు పారుదల లేక పంటపొలాలను ముంచెత్తుతాయని రైతులు అంటున్నారు. ఇలా జరిగితే తమ భూములు చౌడు భూములుగా మారిపోతాయని వారు ఆందోళన చెందుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పేరాల(చీరాలటౌన్), జూన్ 14 : నేడు ప్రపంచం వివిధ రకాల పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటుందని పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాల్మన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రమాద భరితమైన ప్లాస్టిక్ వస్తువులను పోగుచేసి ప్రదర్శన చేశారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వివరించారు. ఇలాగే కొనసాగితే భవిష్యతులో ఎదుర్కొనే సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పవని భానుచంద్రమూర్తి, గాంధీ, ముత్యాల ప్రసాద్, రాజేంద్ర ప్రసాద్, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.


పర్యావరణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

దుర్గగుడికి యువకుల పాదయాత్ర


దుర్గగుడికి పాదయాత్రగా తరలివెళుతున్న ముప్పవరం గౌడకాలనీ యువత

పంగులూరు, జూన్ 14 :రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో పాటు రాష్ట్ర మంత్రివర్గంలో గొట్టిపాటి రవికుమార్‌కు చోటు దక్కడంతో ముప్పవరం గౌడ కాలనీ యువకులు తమ మొక్కు తీర్చుకునేందుకు విజయవాడ కనకదుర్గమ్మ గుడికి శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. టీడీపీ గ్రామ అధ్యక్షులు రౌతు వీరాంజనేయులుతో పాటు యార్లగడ్డ సాంబశివరావు, ఇంటూరి వీరాంజనేయులు, తాతా శ్రీను, మోహనకృష్ణ, హర్ష, దాసరి యుగంధర్, దుర్గ, నరేంద్ర, అద్దేపల్లి సుబ్బారావు, పున్నారావు, జనసైనికుడు తరుణ్‌లు కాలినడకన దుర్గగుడికి తరలి వెళ్లారు.

ఎంపీ కృష్ణ ప్రసాద్‌ను కలిసిన పాస్టర్లు

పంగులూరు, జూన్ 14 : ఏపీ పాస్టర్ల వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు శుక్రవారం బాపట్ల పార్లమెంట్ సభ్యులు తేనేటి కృష్ణ ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘ అధ్యక్షులు షడ్రక్ బాబు నేతృత్వంలో ఎంపీని కలసి అద్దంకి నియోజకవర్గ పరిధిలో తమకున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీని సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కృపారావు, హరిబాబు, ఎలమందయ్య, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ కృష్ణప్రసాద్‌ను సత్కరిస్తున్నపాస్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ


నోట్ పుస్తకాలను పంపిణీచేస్తున్న చీరాల ఉప విద్యాశాఖఅధికారి ఎం.నిర్మల

మార్టూరు, జూన్ 14: మండలంలోని ప్రాథమిక పాఠశాలలకు జడ్పీ హైస్కూల్స్‌లో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని వలపర్ల జడ్పీ హైస్కూల్‌లో చీరాల ఉపవిద్యాశాఖఅధికారి ఎం. నిర్మల నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరూ నోట్ పుస్తకాలను సక్రమంగా వినియోగించుకోవాలని, 10 వతరగతి విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చక్కగా చదువుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతల సుబ్బారావు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు తాత్కాలిక అంతరాయం

చీరాలటౌన్, జూన్ 14 : మరమ్మతుల నేపథ్యంలో నేడు విద్యుత్‌కు తాత్కాలిక అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఉదయం 7:30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు అంతరాయం ఉంటుందన్నారు. వైకుంఠపురం, విఠల్‌నగర్, ఉజిలీపేట, జయంతిపేట, రోశయ్య కాలనీ, కారంచేడు రోడ్డులో ఈ అంతరాయం ఉన్నట్లు చెప్పారు. అనంతరం యథావిధిగా విద్యుత్ కొనసాగుతుందని, వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

చినగంజాంలో..

చినగంజాం, జూన్ 14 : మండల పరిధిలోని చినగంజాం, కొత్తపాలెం, మోటుపల్లి, పెదగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో వార్షిక మరమ్మతులలో భాగంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు ఆశాఖ ఏఈ పడవల గణనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మూడు గ్రానైట్ శ్లాబుల లారీల పట్టివేత

మార్టూరు, జూన్14: మార్టూరు పరిధిలో గ్రానైట్ పరిశ్రమల నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా ఇతర రాష్ట్రాలకు అక్రమంగా గ్రానైట్ శ్లాబుల లారీలను తరలిస్తున్న మూడు లారీలను మైన్స్ అండ్ జియాలజీ ఒంగోలుకు చెందిన అధికారులు గురువారం అర్ధరాత్రి మార్టూరులో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాటిని తీసుకువెళుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేశారు. లారీలను స్టేషన్‌కు తరలించారు.



అద్దంకిలోని కోర్టు భవనాల సముదాయం వద్ద కేక్ కట్ చేస్తున్న న్యాయవాదులు

ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు ప్రజలకు ఎంతో మేలు

అద్దంకి, జూన్14: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో రైతులతో పాటు ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సీనియర్ న్యాయవాది మోతుకూరి సుభాషబాబు అన్నారు. సీఎం చంద్రబాబు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ సంతకం చేయటంతో శుక్రవారం స్థానిక కోర్టు భవనాల సముదాయం వద్ద న్యాయవాదులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గొట్టిపాటి శ్రీనివాసరావు, పీఎల్‌యన్ ప్రసాద్, ఇంటూరి హనుమంతరావు, పంచాగ్నుల ఉదయభాస్కర్, వడ్లవల్లి వీరనారాయణ, పంచాగ్నుల రమేష్, కరి రామకృష్ణ, కాకాని నాగేశ్వరమ్మ, మద్దినేని గృహలక్ష్మి, మహ్మద్ రఫీ, శానం నాగేశ్వరరావు, మురకొండ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని సీఎం చంద్రబాబునాయుడు రద్దు చేయటంపై బాపట్ల జిల్లా టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు బత్తుల రామకోటయ్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

మంత్రి పర్యటనలో జేబు దొంగల చేతివాటం

అద్దంకి, జూన్14: విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం అద్దంకి పట్టణానికి తొలిసారి రావటంతో శుభాకాంక్షలు తెలిపేందుకు అన్ని ప్రాంతాల నుంచి టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున వచ్చారు. పాతబస్టాండ్ సెంటర్ లో మరింత ఒత్తిడి ఏర్పడింది. ఈ నేపథ్యంలో జేబుదొంగలు చేతివాటం చూపించారు. పలువురు టీడీపీ నేతల జేబులలో ఉన్న నగదును నొక్కేశారు. సుమారు 10 మంది వద్ద నుంచి 1.5 లక్షల రూపాయల వరకు కాజేసినట్లు తెలుస్తోంది. అయితే జేబులో నుంచి నగదు తీయటాన్ని గుర్తించి ఓ యువకుడుని పట్టుకొని టీడీపీ శ్రేణులు పోలీసులకు అప్పగించారు. దర్శికి చెందిన యువకుడుగా అనుమానిస్తున్నారు. పట్టుబడ్డ యువకుడుతో పాటు సుమారు 10 మంది ముఠాగా కలిసి వచ్చినట్లు తెలుస్తోంది. ఒక యువకుడు పట్టుబడటంతో మిగిలిన యువకులు అక్కడ నుంచి జారుకున్నారు.





పొంగూరు రెవెన్యూలో ప్రభుత్వ భూమిని చదును చేసిన దృశ్యం

ప్రభుత్వ భూమి.. కబ్జా చేసేయ్!

- మర్రిపాడులో బరితెగిస్తున్న ఆక్రమణదారులు
- తెరవెనుక వైసీపీ నాయకుల అండ
- ఎన్నికల విధులంటూ అధికారుల తాత్సారం

మర్రిపాడు, జూన్ 14 : జిల్లాకు విసిరేసినట్టు ఉన్న మర్రిపాడు మండలంలో కబ్జాదారులు పేట్రేగిపోతున్నారు. ఈ ప్రాంతంపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టి అంతంత మాత్రంగా ఉండటం, ఎన్నికల విధుల కోసం వచ్చిన మండల అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించడం ఆక్రమణదారులకు బాగా కలిసి వస్తోంది. దీంతో ఖాళీ జాగా కనిపిస్తే చాలు రాత్రికి రాత్రే హస్తగతం చేసుకుంటున్నారు. మండలంలోని పొంగూరు, బూదవాడు, చిలకపాడు, అల్లంపాడు గ్రామ పరిసరాల్లో ప్రభుత్వ భూముల్లో ఉన్న ముళ్ల చెట్లను తొలగించి, చుట్టూ ఫెన్సింగ్ వేసి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఈ భూములన్నీ ముంబయి జాతీయ రహదారికి పక్కనే ఉండటంతో ఒక్కో ఎకరా లక్షల రూపాయలు విలువ పలుకుతోంది. కేవలం గడిచిన ఇరవై రోజుల వ్యవధిలోనే వైసీపీకి చెందిన కొంతమంది నాయకుల ప్రోద్బలంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారనే విమర్శలు జోరందుకున్నాయి. పొంగూరు రెవెన్యూలో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి వెంబడి ఉన్న సుమారు 7ఎకరాల ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రే చెట్లు తొలగించి జామాయిల్ నాటేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ ఎకరా భూమి ఆరు లక్షల రూపాయలకు పైగా పలుకుతోంది. అలాగే చిలకపాడు రెవెన్యూలోని ఏపిలగుంట గ్రామంలో ఇళ్ల పక్కనే ఉన్న సర్వేనెంబర్ 639లో సుమారు 50 సెంట్ల ప్రభుత్వ భూమిని వైసీపీకి చెందిన ఓ నేత ఆక్రమించి ఫెన్సింగ్ వేశారు. అంతేగాక ఆ స్థలంలో ఓ రేకుల షెడ్డును కూడా నిర్మించారు. ఇక్కడ సెంటు భూమి రూ.70వేల వరకు పలుకుతోంది. బూదవాడ వద్ద జాతీయ రహదారి వెంబడి చెరువుకు సంబంధించిన సర్వే నెంబరు 579లో ప్రభుత్వానికి చెందిన ఎకరా భూమిని కబ్జాదారులు హస్తగతం చేశారు. సుమారు రూ.11లక్షలు విలువ జేసే ఈ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అల్లంపాడు రెవెన్యూలో ఇంటి స్థలాలకు కేటాయించిన ఎకరా ప్రభుత్వ భూమిని వైసీపీకి చెందిన ఓ మహిళా నేత ఆక్రమించేసి ఫెన్సింగ్ వేశారు. ఈ భూమి విలువ రూ.60 లక్షల నుంచి 70 లక్షల వరకు పలుకుతోంది. ఇలా ప్రభుత్వ భూమిని ఇష్టానుసారంగా కబ్జా చేస్తున్నా అధికారులు మాత్రం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు.



ఏపిలగుంట వద్ద ప్రభుత్వ భూమిలో నిర్మించిన రేకుల షెడ్డు

ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తాం

ప్రభుత్వ భూముల ఆక్రమణపై స్థానికులు మా దృష్టికి తెచ్చారు. ఎన్నికల పనిలో ఉన్నందున సమయం కుదరలేదు. ఆ భూముల్లో సర్వే చేసి అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను తొలగిస్తాము. ముందుగా ఆక్రమణదారులకు చట ప్రకారం నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాము.

- సీతారత్నం, మర్రిపాడు తహసీల్దారు

పింఛనుదారులకు 'ఎన్టీఆర్ భరోసా'

- వృద్ధులు, వితంతువులకు రూ.3వేల నుంచి 4వేలకు పెంపు
- దివ్యాంగులకు రెండింతల పెరుగుదల
- కిడ్నీ బాధితులకు రూ.10వేలు • లబ్ధిదారుల్లో ఆనందం

నెల్లూరు (హరనాథపురం), జూన్ 14 : ఎన్టీఆర్ భరోసా పేరుతో పింఛనుదారులకు జూలై నెల నుంచి సామాజిక భద్రతా పింఛన్లు అందనున్నాయి. వృద్ధులు, వితంతువులు తదితరులకు రూ.వెయ్యిగా ఇస్తున్న పింఛన్‌ను 2019లో చంద్రబాబు రూ.2వేలకు పెంచారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రూ.250 వంతున ఐదేళ్లలో రూ. వెయ్యి పెంచి రూ.3వేలు చేసింది. 2024 ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల కనుగుణంగా సామాజిక పింఛన్ల పెంపు దస్త్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేశారు. దీంతో పింఛను మొత్తం పెంపు జీఓ విడుదలైంది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, ట్రాన్స్‌జెండర్లు, హెచ్‌ఐవీ బాధితులు, కళాకారులకు ఇప్పటి వరకు అందుతున్న రూ. 3వేల పింఛన్‌ను రూ.4వేలకు పెంచారు. వీరికి ఏప్రిల్ 1 నుంచి పెంపును అమలు చేసి, జులై ఒకటిన పింఛను కింద వీరికి రూ.7వేలు (జులై1న ఇచ్చే రూ.4 వేలు, ఏప్రిల్ నుంచి 3 నెలలకు రూ.వెయ్యి వంతున కలిపి) అందచేయనున్నారు. అదేవిధంగా దివ్యాంగులకు ఎన్నడూ లేని విధంగా వారి పింఛను మొత్తాన్ని రూ.3 వేల నుంచి 6వేలకు పెంచారు. కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి చేసుకున్న వారికి, డయాలసిస్ స్టేజ్‌కు ముందున్న కిడ్నీ వ్యాధిగ్రస్థులకు పింఛనుగా అందే రూ.5వేల మొత్తాన్ని 10వేలకు పెంచారు. కుష్ఠు కారణంగా బహుళ వైకల్యం సంభవించిన వారికి రూ. 6వేల పింఛను ఇస్తారు. పూర్తిస్థాయిలో అస్వస్థతకు గురైన వారికి, తీవ్ర అనారోగ్యంతో మంచాన పడిన వారికి, వీల్ చైర్‌లో ఉన్న వారికి అందే రూ.5వేల పింఛన్‌ను 15వేలకు పెంచారు. పింఛను పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

దివ్యాంగులకు మహర్దశ

సంగం, : కూటమి అధికారంలోకి రావడంతో దివ్యాంగుల్లో జోష్ నెలకొంది. ఇప్పటివరకు రూ.3వేలు పెన్షన్ తీసుకుంటున్న వీరు వచ్చే నెల నుంచి 6వేలు అందుకోనున్నారు. ఎన్నికల హామీలో భాగంగా జులైలో ఒక్కో లబ్ధిదారుడికి పెండింగ్ బకాయితో కలిపి రూ.15 వేలు (ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయి రూ.9వేలతోపాటు జులై పింఛన్ 6వేలు మొత్తం రూ.15 వేలు) పెన్షన్ రానుంది. దీనికోసం జిల్లాలోని 33,171 మంది దివ్యాంగు లు ఎదురుచూస్తున్నారు. గతంలో ఎన్నడూ ఈస్థాయిలో లబ్ధి చేకూరలేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా అమాత్యులకు కీలక శాఖలు

- పొంగూరు నారాయణకు మున్సిపల్ శాఖ • దేవదాయ శాఖ మంత్రిగా ఆనం
- జిల్లాలోని పట్టణాలు, ఆలయాలకు మహర్దశ
- పట్టణాల్లో ప్రతి పేదకూ ఇల్లు ఇస్తాం • నెల్లూరులో పెండింగ్ పనులు పూర్తి చేస్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో మంత్రి నారాయణ

నెల్లూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు సిటీ, ఆత్మకూరు ఎమ్మెల్యేలు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలకు రాష్ట్ర క్యాబినెట్‌లో కీలక శాఖలు కేటాయించారు. నారాయణకు మున్సిపల్ శాఖ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలను కేటాయించారు. రాజధాని రీజియన్ అభివృద్ధి, విస్తరణ (సీఆర్‌డీఏ) కూడా ఈ శాఖలోనే విలీనమై ఉంటుంది. 2014 టీడీపీ క్యాబినెట్‌లో కూడా ఈయనకు ఇదే శాఖలు కేటాయించారు. ఇక ఆనం రామనారాయణరెడ్డికి దేవదాయ శాఖ కేటాయించారు. జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులకు కీలక శాఖలు కేటాయించడంతో జిల్లా పరిధిలోని నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు, జిల్లా పరిధిలోని ప్రముఖ దేవాలయాలకు మహర్దశ పట్టనుంది. జిల్లాకు రెండు మంత్రి పదవులు ఇవ్వడం, ముఖ్యమైన శాఖలు కేటాయించడం పట్ల టీడీపీ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పొంగూరు నారాయణ ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. పట్టణ ప్రాంతాల అభివృద్ధిలో ప్రభుత్వ ప్రాధాన్యతలను ఇలా వివరించారు. ఆయన మాటల్లోనే..

• ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు : నారాయణ

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణ ప్రాంతాల్లోని ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పట్టణ ప్రాంతాల్లో ఒక్కరు కూడా ఇల్లు లేకుండా ఉండకూడదనే దిశగా పనిచేస్తాం. నెల్లూరు నగరంతో పాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇల్లులేని ప్రతి పేదకుటుం బానికి పక్కా ఇల్లు మంజూరు చేస్తాము. అలాగే పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి కొళాయి నీరు ఇవ్వాలన్నది మరో ముఖ్యమైన ప్రాధాన్యతాం శం. ప్రతి కుటుంబం తమ ఇంట్లోనే కొళాయి నీరు పట్టుకునే విధంగా తాగునీటి పథకాలను అమలు చేస్తాము. హైజెనిక్ పద్ధతిలో పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు చర్యలు చేపడుతాము. మురుగు నీటి కాలువలు, రోడ్లు బాగుచేస్తాము.



ఆనం రామ నారాయణరెడ్డి



పొంగూరు నారాయణ

నెల్లూరు నగరం విష యానికి వస్తే గత ప్రభుత్వం అర్ధంతరంగా ఆపేసిన భూగర్భ డ్రైనేజీ, ఇంటింటికి తాగునీటి పథకాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాము. మౌలిక సదుపాయాలతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కేంద్రాలుగా పట్టణాలను తయారు చేస్తాము. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా యువతకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతాం. నెల్లూరు నగరం, ఇతర మున్సిపాలిటీల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ ప్రభుత్వానికి ఒక స్పష్టమైన ప్రణాళిక ఉంది. ఆ మేరకు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తా"మని నారాయణ చెప్పుకొచ్చారు.

ఆసుపత్రిలో ఉన్న మందులు ఇవే!



మాత్రలెన్ని మింగినా జబ్బు తగ్గదే!

- ఈఎస్ఐ కార్మికుల గగ్గోలు
- ఆసుపత్రుల్లో కానరాని విలువైన మందులు
- నాసిరకం మందులు ఇస్తున్నారని విమర్శలు
- మెరుగైన వైద్యం కావాలంటే తిరుపతికి వెళ్లాల్సిందే!

నెల్లూరు (వైద్యం) జూన్ 14 : కార్మికులకు వైద్య సేవలు అందించాల్సిన ఈఎస్ఐ ఆసుపత్రులు వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో కునారిల్లుతున్నాయి. రోగుల నాడి పట్టేందుకు వైద్యులు ఉన్నా అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో అటువైపు వెళ్లేందుకే కార్మికులు జంకుతున్నారు. దీంతో అనేక మంది కార్మికులు ప్రైవేట్ ఆసుపత్రులతోపాటు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన మొదటి రెండేళ్ల పాత మందులతోనే వైద్యసేవలు అందించేది. ఆ తర్వాత పేరు ఊరు లేని కంపెనీల నుంచి మందులు కొనుగోలు చేసిందనే ఆరోపణలు పెల్లుబికుతున్నాయి. ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం 75 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం నిధులు వెచ్చించి మందులు కొనగోలు చేయాలి. అయితే, రాష్ట్ర ప్రభుత్వం తనకు తోచిన మందులనే కొనుగోలు చేసి సరఫరా సరఫరా చేసింది. ఇదేమిటని ప్రభుత్వాన్ని ఎదురించే సాహసం కూడా అధికారులు చేయలేక పోయారు. జిల్లావ్యాప్తంగా వివిధ కంపెనీలలో 25వేల మంది పని చేస్తుండగా, వీరికి నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రి మాత్రమే అందుబాటులో ఉంది. నవాబుపేటలో ఈఎస్ఐ ఆసుపత్రి ఉన్నా అక్కడ నామమాత్రపు వైద్యసేవలు అందుతున్నాయి. ఎన్ని మందులు వేసుకున్నా జబ్బు తగ్గకపోవడంతో ఈఎస్ఐ ఆసుపత్రులపై నమ్మకం సన్నగిల్లి ఒకప్పుడు రోజుకు 150 మంది వచ్చేవారు ప్రస్తుతం 35 మంది మాత్రమే వస్తున్నారు.

• పేరులేని మందుల కంపెనీలెన్నో..

ఒకప్పుడు ఈఎస్ఐ ఆసుపత్రిలో మనిషి ఎదుగుదలకు ఉపయోగపడే రూ.25వేల విలువైన హార్మోన్ సూదిమందు, కేన్సర్ నియంత్రణకు రూ.60వేలకుపైగా విలువైన ఇంజక్షన్లు, మందులు అందుబాటులో ఉండేవి. అలాగే కీళ్లనొప్పులకు, గాయాలు మానేందుకు అత్యుత్తమ కంపెనీలకు చెందిన మందులు ఇచ్చేవారు. ఇలా దాదాపు 300 రకాల మందులు ఈఎస్ఐ ఆసుపత్రులలో ఉండేవి. అయితే, వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం 100 రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. సిగ్నేచర్, ఆల్ఫాల్యాబ్, యూనిమార్క్ లిమిటెడ్, ప్రిసైసిమి, మిడాస్ ఫార్మా, ఇంటాస్ ఫార్మా వంటి కంపెనీ పేర్లతో ఉన్న మందులు ఈఎస్ఐ ఆసుపత్రి కొనుగోలు చేసింది. ఆసుపత్రికి వచ్చే వ్యాధిగ్రస్థులైన కార్మికులకు విధిలేని పరిస్థితుల్లో వైద్యులు ఉన్న మందులు రాసి, ఇస్తున్నారు.

• తిరుపతికి వెళ్లాల్సిందే..

తీవ్ర అనారోగ్యానికి గురైన కార్మికులను గతంలో నారాయణ ఆసుపత్రికి పంపించే వారు. అక్కడ వైద్య ఖర్చులతోపాటు ఇతరత్రా ఖర్చులను కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వమే చెల్లించేది. అయితే వైసీపీ ప్రభుత్వంలో రోగులను తిరుపతిలోని ఈఎస్ఐ ప్రాంతీయ ఆసుపత్రికి సిఫారసు చేస్తున్నారు. అక్కడ వైద్యసేవలు అందినా మందులు మాత్రం నాసిరకంగా ఉంటున్నాయని బాధిత కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. ముత్తుకూరు మండలం కృష్ణపట్నం వద్ద ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేశారే తప్ప వైద్యులు, సిబ్బందిని నియమించ లేదు. దీంతో ఆ ఆసుపత్రికి బాడుగ రూపంలో వేల రూపాయలు ఖర్చు చేసి ప్రస్తుతం మూసివేశారు. పరిశ్రమలు ఎక్కువగా ఉన్న ఆ ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండిఉంటే కార్మికులకు ఎంతో వెసులు బాటుగా ఉండేది.



బీట్ వ్యవస్థ పటిష్టం

- ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైం), జూన్ 14: నేర నియంత్రణలో భాగంగా బీట్ వ్యవస్థను మరింతగా పటిష్టం చేశామని ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ కోసం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు రాత్రి బీట్లు ఏర్పాటు చేసుకొని, సమస్యాత్మక గ్రామాల్లో స్థానికులతో గురు, శుక్రవారాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నెల్లూరు నగర పరిధిలో వంద శాతం బీట్లు కచ్చితంగా ఏర్పాటు చేయాలని, రాత్రి పూట ప్రజల భద్రత, రక్షణకు జిల్లా వ్యాప్తంగా ముమ్మ రంగా గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. గస్తీ సమ యంలో తాళాలు వేసిన ఇళ్లు, రైల్వేస్టేషన్లు, బస్టాప్‌లు, ఆలయాలు, బ్యాంక్లు, ఏటీఎంలతోపాటు అన్ని ముఖ్యమైన కూడళ్లలో, నిర్మానుష్యమైన ప్రదేశాల్లో నిఘా ఉంచాలని సూచించారు. రాత్రి వేళ తిరిగే ఆకతాయిలపై, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, రాత్రి గస్తీ వేళల్లో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలకు ఏమైనా రక్షణ సహాయం అవసరమైతే తోడ్పాటు అందించాలంటూ దిశా నిర్దేశం చేశారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని, శాంతియుత వాతావరణంలో జీవించాలని ఎస్పీ కోరారు. కాగా, జిల్లాలోని పలు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నామని, అంకిత భావంతో సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. సిబ్బంది నుంచి ఎస్పీ అర్జీలను స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలు పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అనంతరం ఖాళీల ఆధారంగా సిబ్బందికి స్థాన చలనం కల్పించారు.

19, 20 తేదీలలో జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

నెల్లూరు (హరనాథపురం), జూన్ 14 : ఈ నెల 19, 20 తేదీలలో జిల్లాలో కేంద్ర బృందం పర్యటిస్తుందని కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆరు జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో కరువు పరిస్థితిని అంచనా వేయడానికి ఆ బృందం రానున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర పశుసంవర్థక, డెయిరీ శాఖ డైరెక్టర్ సందీప్ శర్మ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు మన్ను జి. ఉపాధ్యాయ్, మదన్‌మోహన్ మౌర్యలతో కూడిన బృందం జిల్లాలో కరువు పరిస్థితిని అంచనా వేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, కరువు నష్టాన్ని వివరించేలా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు, పవర్ పాయింట్ ప్రజంటేషన్, రూట్ మ్యాపులు సిద్ధం చేయాని అధికారులను ఆదేశించారు.

రెడ్‌క్రాస్‌లో పురస్కారాలు

నెల్లూరు (వైద్యం) : రక్తదాతల దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని రెడ్‌క్రాస్ కేంద్రంలో శుక్రవారం రక్తదాతలకు పురస్కారాలు అందచేశారు. ఎమ్మెల్సీ, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి 59 మందికి అవార్డులు అందించారు. రక్తదానం వల్ల దాతలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. త్వరలో రెడ్‌క్రాస్‌లో తలసీమియా క్లినిక్‌ను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- దువ్వూరు సమీపంలో గేదెలను ఢీకొన్న వ్యాన్
- ఇద్దరు మృతి.. మరో ఇద్దరికి గాయాలు
- కోవూరు సమీపంలో కంటైనర్‌ను ఢీకొన్న లారీ
- ఒకరు మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

రహదారులు రక్తపుటేరులుగా మారుతున్నాయి. త్వరగా గమ్యం చేరాలన్న ఆతృత... మితిమీరిన వేగం.. ఆపై నిద్రలేమి తదితర కారణాలతో ప్రమాదాల బారిన పడుతున్నారు. శుక్రవారం వేకువజామున సంగం, కోవూరు సమీపంలో జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాతపడ్డారు.

సంగం : నుజ్జునుజ్జయిన వ్యాన్



కోవూరు : కంటైనర్‌ను ఢీకొని నుజ్జునుజ్జయిన మినీలారీ



సంగం, జూన్ 14: మండల పరిధిలోని దువ్వూరు సమీపంలో ముంబయి జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఓ వ్యాన్ గేదెను ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. తల్లీబిడ్డకు స్వల్పగాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కృష్ణా జిల్లా కైకలూరుకు చెందిన జయమంగళం నాగరాజు సంగం మండలం శంకరవీరరాఘవపురంలో చేపల చెరువులను లీజుకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట స్వగ్రామం కైకలూరుకు వెళ్లి అక్కడ గర్భిణి అయిన తన కుమార్తె అనసూయను, మరో కుమార్తె ప్రశాంతి, మనుమరాలిని వెంటబెట్టుకుని శంకరవీరరాఘవపురం బయలుదేరారు. అర్ధరాత్రి రెండున్నర గంటల ప్రాంతంలో నెల్లూరులో రైలు దిగి బస్సులు లేకపోవడంతో సంగం వైపు వచ్చే పేపర్ వ్యాన్‌లో ఎక్కారు. బుచ్చిరెడ్డిపాళెం దాటిన తరువాత వేగంగా వస్తూ మార్గమధ్యంలోని దువ్వూరు సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న రెండు గేదెలను వ్యాన్ ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ముందు సీట్‌లో కుర్చొన్న నాగరాజు (45) అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ శ్రీనివాసులు (40) వ్యాన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. వ్యాన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ శ్రీనివాసులును బయటకు తీసి 108 వాహనంలో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. వ్యాన్‌లో ఉన్న ప్రశాంతి, ఆమె కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. గర్భిణి అనసూయ ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడింది. కాగా, ఈ ఘటనలో ఓ గేదె మృతి చెందగా, వ్యాన్ నుజ్జునుజ్జయింది. సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• కంటైనర్‌ను ఢీకొన్న మినీ లారీ..

కోవూరు : చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఓ లారీ ఆగిఉన్న కంటైనర్ లారీని ఢీకొనడంతో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు నుంచి చిలకలూరిపేట సమీపంలోని కావూరు మార్కెట్‌కు మామిడి కాయల లోడుతో ఓ మినీ లారీ గురువారం రాత్రి బయలుదేరింది. శుక్రవారం తెల్లవారుజామున కోవూరు సమీపంలోని ఫ్లైఓవర్ దిగిన తరువాత ఆగి ఉన్న కంటైనర్‌ను మినీలారీ ఢీకొంది. దీంతో కావూరు గ్రామానికి చెందిన మినీ లారీ డ్రైవర్ మొగిలి సతీష్ (30) రెండు వాహనాల మధ్య ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, వైద్యసిబ్బంది అతికష్టం మీద మృతదేహాన్ని వెలికితీశారు. డ్రైవరు బంధువైన క్లీనరు అజయ్ తీవ్రంగా గాయపటంతో ఆసుపత్రికి తరలించారు. కోవూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





నాగరాజు, శ్రీనివాసులు మృతదేహాలు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఉదయగిరి రూరల్, జూన్ 14: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వేల్పుల గిరిబాబు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వెంగళరావునగర్ గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి తనిఖీలు నిర్వహించి సరైన ధ్రువ పత్రాలను లేని వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని, అల్లర్లు సృష్టించేందుకు యత్నిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

దాడిపై కేసు నమోదు

సంగం, జూన్ 14: మండలంలోని మర్రిపాడులో జీ నవీన్ అనే వ్యక్తిపై దాడి చేసిన కొండయ్యపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. జీ నవీన్ గురువారం రాత్రి తన ఇంటికి సమీపంలోని అరుగుపై నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఎం కొండయ్య మద్యం మత్తులో కర్రతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారించిన పోలీసులు కొండయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో



రికార్డులు పరశీలిస్తున్న ఎంఈవో జానకీరాం

అనంతసాగరం, జూన్ 14: మండలంలోని వడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలను అనంతసాగరం ఎంఈవో-1 జానకిరాం శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు పుస్తకాల పంపిణీపై ఆరాతీశారు. మెనూ ప్రకారం భోజనం అందిండంలో శ్రద్ధ చూపాలని, విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

సబ్సిడీపై పొద్దుతిరుగుడు విత్తనాల పంపిణీ

ఉదయగిరి రూరల్, జూన్ 14: నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ పథకంలో భాగంగా రైతులకు నూరు శాతం సబ్సిడీపై పొద్దుతిరుగుడు విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఏ ఆంజనేయులనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఆయన కోరారు.

50 శాతం రాయితీపై పచ్చరొట్ట విత్తనాల పంపిణీ

ఆత్మకూరు, జూన్ 14 : భూసారం, నేలలో సేంద్రియ కర్బనం పెంపొందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 50 శాతం రాయితీపై సరఫరా చేసిన పచ్చరొట్ట విత్తనాలను మండలంలోని నువ్వూరుపాడులో శుక్రవారం ఏవో కిషోర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటే విత్తనాలు తెప్పించి అందజేస్తామని తెలిపారు.




మూతపడిన సుజలధార కేంద్రం

సుజలధార ప్లాంట్ మూత!

- మరమ్మతులకు గురైన మోటర్లు
- 23 గ్రామాలకు ఆగిన నీటి సరఫరా

అనంతసాగరం, జూన్ 14: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న సుజలధార పథకం ఐదు రోజులుగా పనిచేయడం లేదు. ప్లాంట్‌లోని మోటర్లు మరమ్మతులకు గురి కాగా శుద్ధిజల కేంద్రం మూతపడింది. దీంతో నిర్దేశించిన 23 గ్రామాలకు మినరల్ వాటర్ అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకాన్ని 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.7 కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేయగా వైసీపీ అధికారంలోకి వచ్చాకా ఎన్‌టీఆర్ సుజలధారను వైఎస్సార్ సుజలధారగా నామకరణం చేశారు. మొత్తం 35 గ్రామాలకు ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 23 గ్రామాలకు నీటి సరఫరా చేస్తూ కాలం వెళ్లతీశారు. అయితే గడిచిన ఐదు రోజులుగా నీటిపథకం మూతపడి మినరల్ వాటర్ అందక ప్రజలు ప్రైవేటు ప్లాంట్ వద్ద నీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకొంటున్నారు. నీటి సరఫరాలో నెలకొన్న ఇబ్బందిపై మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్‌ను వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారులకు వివరించి త్వరలో నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోంటామని చెప్పారు.

శిథిలావస్థలో పురాతన భవనాలు



శిథిలావస్థలో ఉన్న ఖజానా భవనం

కూలేస్థితిలో ఉన్న జైలు గదులు

ఉదయగిరి, జూన్ 14: ఉదయగిరి పట్టణంలో బ్రిటీష్ పరిపాలన కాలంలో నిర్మించిన పలు భవనాలు నేడు శిథిలావస్థకు చేరాయి. వీటి ఆలనా పాలనా చూసేవారు లేకపోవడంతో భవనాలు పెచ్చులూడి కూలేస్థితికి వచ్చాయి. ఎంతో విలువైన రంగూన్ టేక్ సామాగ్రి సైతం వర్షానికి తడిసి ఎండకు ఎండి చెదలు పడుతోంది. బ్రిటీష్ పాలనలో నిర్మించిన జైలు గదులు, గార్డు భవనం ఖజానా కార్యాలయం రికార్డులు భద్రపరిచే గదులు కోర్టు భవంతులు శిథిలావస్థకు చేరాయి. ఎంతో చరిత్ర కలిగిన ఈ భవనాలకు మరమ్మతులు చేపట్టి వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



మంత్రి ఆనంకు అభినందనలు తెలుపుతున్న టీడీపీ నేత కాలం బుజ్జిరెడ్డి



మంత్రి రామనారాయణరెడ్డికి అభినందనలు తెలుపుతున్న బీజేపీ నేతలు

రాష్ట్ర మంత్రి ఆనంకు అభినందనలు

ఆత్మకూరు, జూన్ 14 : రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రిగా నియమితులైన ఆనం రామనారాయణరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. శుక్రవారం ఆయనను పలువురు టీడీపీ, బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఆత్మకూరు టీడీపీ నాయకుడు కాలం బుజ్జిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంది మల్లికార్జునరెడ్డి ఆనం రామనారాయణరెడ్డిని శాలువాతో సన్మానించారు.

ఆనంకు దేవాదాయశాఖ కేటాయింపుపై హర్షం

సంగం : ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో దేవాదాయశాఖ కేటాయింపుపై స్థానిక టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, గంగపట్నం చంద్రశేఖరయ్య శుక్రవారం అమరావతికి వెళ్లి ఆనం రామనారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కరుణాకర్‌రెడ్డి, బాణా శ్రీనివాసులురెడ్డి, షేక్ బాబు, అల్లూరు శ్రీధర్‌రెడ్డి, పిట్టు పట్టాభిరామిరెడ్డి, కాకు మధుసూదన్ యాదవ్, ముత్యాల మోహన్, అనిల్‌కుమార్‌రెడ్డి, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు అభివృద్ధి ఆనంతోనే సాధ్యం

- టీడీపీ శ్రేణుల సంబరాలు

ఆత్మకూరు, జూన్ 14 : ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి ఆనం రానారాయణరెడ్డితోనే సాధ్యమని పలువురు టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి రాష్ట్ర దేవాదేయశాఖ మంత్రి పదవి దక్కడంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని బీఎస్ఆర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవంలో కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని చిందులు వేశారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జయహో.. అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల చంద్రారెడ్డి, పల్లవోలు జయాకర్, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దావా పెంచలరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాకర్లకు ఎన్‌జీవో ఉద్యోగుల సన్మానం

ఉదయగిరి రూరల్, జూన్ 14: ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్‌ను శుక్రవారం వింజమూరు మండలం బొమ్మరాజుచెరువు గ్రామం వద్ద గల టీడీపీ ప్రధాన కార్యాలయంలో తాలుకా ఎన్‌జీవో అధ్యక్షుడు బొమ్మతట్టు శ్రీహరి, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘ నాయకులు రియాజ్, ఇలియాజ్, వెంకట్రావు, సమద్, అంజాద్, రామ్మోహన్, ఉప్పు కొండయ్య, వెంకటాద్రి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాకర్లను సన్మానిస్తున్న ఎన్‌జీవో తాలుకా సంఘ అధ్యక్షుడు, సభ్యులు

అర్హత కలిగిన ఉపాధ్యాయులతో బోధన చేయాలి



హోలీఏంజిల్స్ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో గోపాల్

ఉదయగిరి రూరల్, జూన్ 14: ప్రైవేటు పాఠశాలల్లో యాజమాన్యాలు అర్హత కలిగిన ఉపాధ్యాయులచే విద్యాబోధన చేయించడంతోపాటు ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించాలని ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డీఈవో గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని హోలీఏంజల్స్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలతో మాత్రమే విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థులను తీసుకొచ్చే వాహనాల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఫోర్స్‌లో ఉండాలన్నారు. అంతకుముందు ఆయన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టూడెంట్ కిట్స్‌ను, గోదామును పరిశీలించి ఉపాధ్యాయులకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు, కరస్పాండెంట్ వీ.సుధాకర్, ప్రధానోపాధ్యాయులు బాలకేశవులు, మేరీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



చిన్నారులతో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ఉదయగిరి రూరల్, జూన్ 14: మూడేళ్లు దాటిన ప్రీస్కూల్ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను కోరారు. ఆమె శుక్రవారం పట్టణంలోని కోళ్లవీధి, వాల్మీకివీధి, యాదవపాళెం తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ చిన్నారులతో బడిబాట ర్యాలీ నిర్వహించి తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఇంటింటికెళ్లి ప్రచారం చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, విద్యాబోధన తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, భోగ్యం వెంకటరత్నం, ఆయాలు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, గువ్వాడి అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో శుక్రవారం బడిబాట ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు రజియా, విజయలక్ష్మి మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా కేంద్రాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పీ లాసర్, ఆయాలు కె కృష్ణకుమారి, నాగమ్మ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

దాసరిపల్లిలో వైద్యశిబిరం

ఉదయగిరి రూరల్, జూన్ 14: మండలంలోని దాసరిపల్లి గ్రామంలో జ్వరాలు విజృంభించడంతో గండి పాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది గ్రామం లో ఇంటింటా సర్వే చేపట్టారు సర్వేలో లార్వాతోపాటు. జర్వపీడితులను గుర్తించారు. లార్వా నిర్మూలనకు చర్యలు తీసుకోవడంతో పాటు జ్వరపీడితులకు చికిత్స అందించారు. జిల్లా సహాయ మలేరియా అధికారి నాగార్జున వైద్యశిబి రాన్ని పరిశీలించారు. నివాసాల్లో దోమల నివారణకు పిచికారీ చేపట్టారు. మురికి ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి అంటు వ్యాధులకు దూరంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ మల్లికార్జున, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటింటా సర్వే చేపడుతున్న వైద్యఆరోగ్య సిబ్బంది

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



మాట్లాడుతున్న ఆర్డీవో శీనా నాయక్

ఎన్నికల నిర్వహణ సంతృప్తి నిచ్చింది

- కావలి ఆర్డీవో శీనానాయక్

కావలి, జూన్ 14: కావలి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించటం సంతృప్తిని ఇచ్చిందని కావలి ఆర్వోగా పనిచేసిన ఆర్డీవో శీనానాయక్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల టీంలో పనిచేసిన అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు, సీఐలు, వివిధ విభాగాలలో విధులు నిర్వర్తించిన అధికారులంతా ఎన్నికల నిర్వహణలో తమ అనుభవాలను ఆత్మీయ సమావేశంలో పంచుకున్నారు. గతంలో ఎన్నికల నిర్వహణలో పాల్గొన్నప్పటికీ ఈ పర్యాయం ఎన్నికల కమిషన్ కఠోరత్వం చూసి ఎన్నికలు పూర్తి అయ్యే వరకు దినదిన గండంగా ఉండిందన్నారు. ఆర్వో ఒక కార్యాచరణ ప్రకారం టాస్క్‌లు ఇచ్చి మమ్ములను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో అందరం కలిసి టీంవర్క్‌గా పనిచేసి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించ గలగామని ఊపిరి పీల్చుకున్నామని తెలిపారు. ఆర్డీవో శీనా నాయక్ మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పాటు ఎన్నికలటీంలో ఉన్న సభ్యులందరూ వారి టాస్కులు సమర్దవంతంగా నిర్వహించటం వలననే ఎలాంటి రిమార్కు లేకుండా సక్సెస్ అయ్యామన్నారు. అలాగే తాము ఏడాది నుంచి ఓటర్ల జాబితాను ప్యూరిఫైడ్ చేసుకుంటూ రావటం వలన ఓటింగ్ శాతం కూడా పెంచగలిగామన్నారు. కావలి డీఎస్పీ ఎం వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణను సీరియస్‌గా తీసుకోవడంతో పాటు తప్పు జరిగితే ఎప్పటికప్పుడు కమిషన్ చర్యలు తీసుకుంటుంటూ పెద్దపెద్ద అధికారులపైనే వేటు వేసిందన్నారు. దీంతో ప్రతి రోజు ఏరోజుకు ఆ రోజు ఊపిరి పీల్చుకుంటూ దినగండంగా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామన్నారు. రెవెన్యూ అధికారులతో పాటు ఎన్నికల టీంలో ఉన్న ప్రతి ఒక్కరు కోఆర్డినేషన్‌తో పనిచేయటం, అదే విధంగా కావలి ప్రజలు కూడా సహరించటంతో శాంతిభద్రతలకు ఎక్కడా భంగం కలుగకుండా ప్రశాంతంగా నిర్వహించగలిగామన్నారు.

సబ్ కలెక్టరును కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి



సబ్ కలెక్టరుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

కందుకూరు, జూన్ 14: కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం సబ్ కలెక్టరు జీ.విద్యాధరిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక టీడీపీ నాయకులు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి సబ్ కలెక్టరు కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తాజా పరిస్థితులు, ప్రభుత్వం మారిన నేపథ్యంలో చేపట్టాల్సిన వివిధ అంశాల గురించి వారిమధ్య చర్చ జరిగింది.

ఎమ్మెల్యేని కలిసిన వైద్యాధికారులు

వలేటివారిపాలెం : మండలంలోని బడేవారిపాలెంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరాను వలేటివారిపాలెం, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు మండలాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యులు పొనుగోటి రమేష్‌బాబు, కొండపల్లి అనూరాధ, సీహెచ్‌వో గుంటుపల్లి శ్రీనివాసులు, వలేటివారిపాలెం పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసులు, శివ సిద్దప్ప, గుడ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మారుతీరావు, కరేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కుంబ శ్రీనివాసులు, డీపీఎంవో దామా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమృత్ ఫైలాన్ ధ్వంసం కేసు సీఐడీకి అప్పగించాలి

- బీజేపీ నేత భరత్‌కుమార్ యాదవ్



మాట్లాడుతున్న బీజేపీ నేత భరత్‌కుమార్ యాదవ్

కావలి, జూన్ 14: కావలి పట్టణంలో నిర్మించిన అమృత్ పథకం ఫైలాన్ ధ్వంసం కేసును సీఐడీకి అప్పగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ.భరత్‌కుమార్ యాదవ్ కోరారు. స్థానిక జర్నలిస్ట్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిగా ముప్పవరపు వెంకయ్య నాయుడి హయాంలో కావలిలో తాగునీటి ఎద్దడి శాశ్వత పరిష్కారం కోసం అమృత్ పథకం మంజూరు చేశారన్నారు. ఆ పథకంకు గుర్తుగా పట్టణ నడిబొడ్డున ఫైలాన్‌ను నిర్మించగా దానిని అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారన్నారు. ఆ ఫైలాన్‌ను 2020 ఏప్రిల్ 10న అప్పటి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ దేవరకొండ ప్రసాద్‌ల సహకారంతో రాత్రికి రాత్రి సీసీ కెమెరాలు నిలుపుదల చేయించి ధ్వంసం చేయించి తెల్లారేసరికి అక్కడ శిథిలాలు కూడా లేకుండా చేశారన్నారు. అప్పట్లో దానిపై రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దానిపై నేటికి ఎలాంటి చర్యలు లేవన్నారు. ఈ కేసును సీఐడీకి అప్పగించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కే.బ్రహ్మానందం, నేతలు పరుసు వెంకటేశ్వర్లు, మందా కిరణ్, మామిడాల వెంకటేశ్వర్లు, వెంగళరెడ్డి, మస్తాన్, జయకుమార్, మురళీ, రాకేష్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రక్తదాన వారోత్సవం



రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేస్తున్న దాతలు

కావలిటౌన్, జూన్ 14: ప్రతి ఒక్కరు విధిగా రక్తదానం చేయాలని ఆర్డీవో శీనానాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం రెడ్‌క్రాస్ రక్తనిధిలో ప్రపంచ రక్తదాన వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్ అధ్యక్షతన రెడ్‌క్రాస్ రక్తనిధి భవనంలో అతిథులుగా పాల్గొన్న ఆర్డీవో, తహసీల్దారు నాగేష్, ఐఎంఏ అధ్యక్షుడు కె సుబ్బారావులు కేక్‌కట్ చేసి రక్తదాతలకు పంచిపెట్టారు. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ రక్తంలో గ్రూపులను కనుగొన్న శాస్త్రవేత్త కార్ల్‌ల్యాండ్ స్టీనర్ జన్మదినాన్ని ప్రపంచ రక్తదాన దినంగా జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్న, కలికి శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించి స్వయంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీఐ రాజేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఖాదర్‌బాషా, అలీం, వివేక్, రఫి, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

యారవ క్రిష్ణయ్యకు ఎమ్మెల్యే కాకర్ల పరామర్శ



క్రిష్ణయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కొండాపురం, జూన్ 14: అనారోగ్యంతో బాధపడుతున్న నెలూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్యను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం పరామర్శించారు. చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి వెళ్లిన యారవ క్రిష్ణయ్యకు గుండెపోటు రావడంతో స్నేహితులు విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కాకర్ల సురేష్ వైద్యశాలకు వెళ్లి క్రిష్ణయ్యను పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ ఎమ్.ఓంకారం, తదితరులు ఉన్నారు.

ఇంటూరి గెలుపుతో మాలకొండకు పాదయాత్ర



సౌజన్యకు హరతులు పడుతున్న మహిళలు

వలేటివారిపాలెం, జూన్ 14: కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఘన విజయం సాధించిన సందర్భంగా ఆయన సతీమణి సౌజన్య మాలకొండకు పాదయాత్ర చేపట్టారు. మండలంలోని బడేవారిపాలెం నుంచి మాలకొండకు సౌజన్య, కుమారులు అవినాష్, సందీప్‌లు తమ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి శుక్రవారం సాయంత్రం 3 గంటలకు పాదయాత్ర చేపట్టారు. ముందుగా బడేవారిపాలెం, పోకూరు గ్రామాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బడేవారిపాలెం, పోకూరు, కూనిపాలెం, పోలినేనిపాలెం, వలేటివారిపాలెం, చుండి, అయ్యవారిపల్లె, మాలకొండ గ్రామాలలో కార్యకర్తలు పూలవర్షం కురిపిస్తూ గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, చెరుకూరి వంశీకృష్ణ, కాకుమాను హర్ష, వలేటి మధుసూదన్‌రావు, కాకుమాను ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

లింగసముద్రం, జూన్ 14 : ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, మంత్రిగా పవన్‌కళ్యాణ్‌ల ప్రమాణ స్వీకారం సందర్భంగా ఫ్లెక్సీ కడుతూ ప్రమాదవశాత్తు విద్యుదాఘానికి గురై మృతి చెందిన కందుకూరు మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన ఇనకొల్లు నరసింహం కుటుంబానికి శుక్రవారం పలువురు ఆర్థిక సాయం అందజేశారు. జనసేన మండల అధ్యక్షుడు అంగుళూరి నరసింహారావు రూ.5000, కందుకూరు జనసేన నాయకుడు దేవళ్ల భాస్కర్‌రావు రూ.10,000, గుడ్లూరు జనసేన నేత భైరవరపు రాజశేఖర్ రూ.5000 నరసింహం కుటుంబానికి అందజేసినట్లు నరసింహం తెలిపారు. వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

కావలి, జూన్ 14: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన ఐదు హామీలపైన సంతకాలు చేయడంతో శుక్రవారం కావలి పట్టణం ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

కావలి రూరల్, జూన్ 14: రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని ప్రమాదాల నివారణకు రైల్వే విద్యుత్ లైన్‌కు సమీపంలో ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపునకు రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. కావలి పట్టణ కలుగోళమ్మపేట సమీపంలోని అండర్ పాస్ బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్‌కు సమీపంలో ఉన్న పెద్ద రావిచెట్టు కొమ్మలను శుక్రవారం రైల్వే ఎలక్ట్రికల్ టీఆర్‌డీ అధికారులు తొలగించారు. రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న ఈ చెట్టు కొమ్మలు విరిగి రైల్వే విద్యుత్ లైన్ల మీద పడే ఉండడంతో వాటిని తొలగించడం వల్ల ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

వలేటివారిపాలెం, జూన్ 14 : గ్రామాల్లో దీర్ఘకాలంగా నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దారు నాగమల్లేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్‌అహ్మద్, డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ప్రభాకర్, ఏవో హమంత్‌భరత్‌కుమార్, పీఆర్ ఏఈ గోపీ చంద్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్వులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంబరాలు

కావలిటౌన్, జూన్ 14: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పట్ల శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ కార్యాలయంలో న్యాయవాదులు సంబరాలు జరుపుకున్నారు. మాజీ ఏజీపీ పోట్లూరు శ్రీనివాసులు కేక్ కట్ చేసి న్యాయవాదులకు తినిపించారు. ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఈ చట్టాన్ని బలవంతంగా ప్రజలపై రుద్దాలని చూశారని మేధావులు, న్యాయవాదలు చట్టాన్ని వ్యతిరేకించినా కొసాగించడం దుర్మార్గమన్నారు. నూతన ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన మాట నిలబెటుకుందంటూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బార్ ప్రధానకార్యదర్శి జయప్రకాష్, న్యాయవాదులు సాయిప్రసాద్, రాజేంద్రప్రసాద్, శివప్రసాద్ రెడ్డి, మనోరమ, మంగళగిరి బాబు, రమణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థిని పూజితకు అభినందన

కావలిటౌన్, జూన్ 14: జేబీ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎం పూజిత జాతీయ సమైక్య శిబిరానికి (ఎన్ఎస్ఎస్) ఎంపికయ్యింది. దీంతో శుక్రవారం కళాశాలలో పూజితను ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మాల్యాద్రి, అధ్యాపకులు అభినందించారు. మాల్యాద్రి మాట్లాడుతూ 15 నుంచి 20వ తేదీ వరకు బెంగుళూరులో జరగనున్న జాతీయ సమైక్య శిబిరంలో పూజిత పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు భాస్కర్, అయూబ్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి పోరాడుతాం

బిట్రగుంట, జూన్ 14 : బిట్రగుంట రైల్వేస్టేషన్ అభివృద్ధికి భవిష్యత్తులో రైలు రోకో కార్యక్రమాలు చేపడుతామని బిట్రగుంట రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ నూరుద్దీన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానికు స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూరుద్దీన్, టీడీపీ నేత చిలకపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైల్వేస్టేషన్ అభివృద్ధి విస్మరించి రైల్వేస్టేషన్లో మౌలిక సదుపాయాలను తొలగిస్తూ రైళ్ల స్టాపింగ్‌లు తీసివేస్తూ ప్రజలను ఇబ్బందులు కలుగజేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ జహీర్, శశికుమార్, దాసరి సునీల్, బత్తుల రవిచంద్ర, ఆరోగ్య రాజ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాలపై ఆగ్రహావేశాలు తగదు

బిట్రగుంట, జూన్ 14 : ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ప్రజలు ఆగ్రహావేశాలు ప్రదర్శించరాదని, వివాదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణాన్ని ఏర్పరచాలని కావలి డీఎస్పీ వెంకట రమణ అన్నారు. బోగోలు మండలం ముంగమూరు సచివాలయ ఆవరణలో శుక్రవారం ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. గెలుపోటములు సహజమని, ఎవరు కూడా ఆవేశాలకు పోయి సమస్యలు తెచ్చుకోకూడదని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.